సోపానం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
KAPIL GROUP కపిల్ చిట్స్ 45 years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-11-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 280 పేజీలు: 12 వెల: 6.50



# ఢిల్లీలో ఉగ్రరాక్షసం

ఢిల్లీలో సోమవారం రాత్రి జరిగిన పేలుడుతో తగలబడుతున్న వాహనాలు

- ఎర్రకోటవద్ద కారులో పేలుడు
- సిగ్నల్ వద్ద ఆగగానే పేలిపోయిన కారు
- ఎనిమిది వాహనాలు పూర్తిగా ధ్వంసం
- వెంటనే ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించిన అమిత్‌షా
- దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఎ, ఎన్ఎస్‌జి బృందాలు
- ఢిల్లీ, యుపి, హర్యానా, జమ్ము కాశ్మీర్, పంజాబ్, హైదరాబాద్, అమరావతిలో హై అలర్ట్

## 13 మంది మృతి, 24 మందికి తీవ్రగాయాలు



**న్యూఢిల్లీ, నవంబరు 10:** దేశంలో ఉగ్రవాదుల కుట్రలు భగ్నం అవుతున్న వేళ రాజధాని ఢిల్లీలో సోమవారం రాత్రి జరిగిన పేలుడు పెను ప్రకంపనలు సృష్టించింది. దేశంలో ఉగ్రవాద దాడులకు పాల్పడేందుకు కుట్రలు చేస్తున్న పలువురిని అరెస్ట్ చేయడం, వారి ప్రయత్నాలను ఫెయిల్ చేయడం వంటివి కట్టుదిట్టంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. హర్యానాలో జరిగిన సంఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా >>2

# లక్ష కోట్ల పెట్టుబడులు

- రాష్ట్ర కేబినెట్ ఆమోదం
- పేదలందరికి గృహనిర్మాణం
- అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థ
- పరిశ్రమలకు తగిన భూముల కేటాయింపు
- రాజధానిలో మౌలిక సదుపాయాలకు రూ. 1500 కోట్ల రుణం
- రెవెన్యూ శాఖలో 19 కొత్త పోస్టులు
- మంత్రిమండలి నిర్ణయాలు



సోమవారం సచివాలయంలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్,మంత్రులు అచ్చెన్న, నారా లోకేష్ తదితరులు

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పేదలందరికీ గృహ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఈ విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నివాస స్థలం లేని వారందరి అర్హుల జాబితా రూపొందించి అందరికీ హౌస్ సైట్స్ దక్కేలా చూడాలన్నారు. ఎపిలో సంవత్సరంలోగా నివాస స్థలం లేని వారికి లబ్ది చేకూరేలా ప్రభుత్వ చర్యలు ఉండాలని సూచించారు. ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు కూడా బాధ్యత తీసుకునేలా ఇన్చార్జ్ మంత్రులు చొరవ చూపాలని సిఎం దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం విషయంలో జాప్యం తగదని అన్నారు. త్వరితగతిన సమస్యల పరిష్కారానికి సరైన విధానం రూపొందించాలని సూచించారు. సిఎం చంద్రబాబు అధ్యక్షతన దాదాపు 70 అజెండా అంశాలతో సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గం భేటీ అయింది.ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రులతో సిఎం చంద్రబాబు చర్చించారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మంత్రులకు దిశానిర్దేశం చేశారు.వైజాగ్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ద్వారా యువతకు మనం ఏం చేస్తున్నామో తెలియజేయాలని సిఎం చంద్రబాబు అన్నారు. పాఠశాలల్లో వాళ్లకు ఎవరికైన ఆసక్తి ఉంటే వాళ్లు ఈ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ చూసే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకోసం మంత్రులు పనిచేయాలన్నారు. >>2

## జోగి రమేష్‌పై మరికొన్ని కేసులు

### రంగం సిద్ధం చేసిన సిఐడి

**విజయవాడ, నవంబరు 10, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యం తయారీ కేసు ఇప్పటికే అరెస్ట్ అయిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత,మాజీ మంత్రి జోగి రమేష్ పై మరిన్ని కేసుల నమోదు సిఐడి సిద్ధమవుతుంది.ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైలులో రిమాండులో జోగి రమేష్ ఉన్నారు. ఆయన మరిన్ని కేసులు నమోదుకు రంగం సిద్ధమైనట్లుగా తెలుస్తోంది..తాజాగా అగ్రి గోల్డ్ భూముల కొనుగోలులో అక్రమాలపై కూడా మాజీ మంత్రి జోగి రమేష్‌పై సిఐడీ కొత్త కేసు నమోదు చేయనుంది ..అగ్రిగోల్డ్ భూముల అమ్మకాల్లో జోగి రమేష్ పాత్ర ఉన్నట్లు ఇప్పటికే గుర్తించినట్లు సిఐడీ అధికారులు. ప్రకటించారు. పెడనలో కూడా భూములు క్రయ విక్రయాల్లో జోగి రమేష్పుఐ పలు ఫిర్యాదులు అందాయని చెబుతున్నారు. వీటిపై కూడా కేసు నమోదు చేసే అవకాశాలు సిఐడీ అధికారులు పరిశీలిస్తున్నట్లుగా తెలుస్తోంది. నకిలీ మద్యం తయారీ కేసులో వైఎస్సార్సీ సీనియర్ నేత,మాజీ మంత్రి జోగి రమేష్‌తో పాటు ఆయన సోదరుడు జోగి రామును కూడా పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసంలో తెల్లవారుజామున జోగి రమేష్‌ను సిట్,పోలీసు,ఎక్సైజ్ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. కాగా,ఉద్దేశ్యపూర్వకంగానే తప్పును వీడియోలతో జోగి రమేష్‌ను ఈ కేసులో ఇరికించారని వైఎస్సార్సీ నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా వైఎస్సార్సీ నేతలను అరెస్ట్ చేసి వరుసగా కేసులు నమోదు చేసి జైలు నుంచి బయటకు రాకుండా చాలా రోజులు ఇబ్బంది పెట్టారని...ఇప్పుడు జోగి రమేష్ విషయంలో కూటమి సర్కార్ అదేతీరుగా ముందుకు పోతోందని వైఎస్సార్సీ నేతలు ఫైర్ అవుతున్నారు.

## ప్రతి ధాన్యం గింజ కొంటాం: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజ ఏ స్థితిలో ఉన్నా కొనుగోలు చేయాలన్నదే ప్రభుత్వం కీలక లక్ష్యంగా పెట్టుకుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.ఏపీలో 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు అనంతరం సిఎంఆర్ రైస్ నిల్వ కోసం అవసరమైన స్టోరేజ్ గోడౌన్ల ముందుగానే సిద్ధం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. సచివాలయం రెండో బ్లాక్‌లోని సివిల్ సప్లైస్ మంత్రి ఛాంబరులో సోమవారం మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షన రైస్ మిల్లర్స్ ప్రతినిధుల సమావేశం జరిగింది. గత ఏడాది కూటమి ప్రభుత్వం రైతులకు న్యాయం చేయడంతో పాటు ధాన్యం కొనుగోలులో చరిత్ర సృష్టించిందన్నారు. ఈ సీజన్‌లో పౌర సరఫరాల శాఖకు 20 లక్షల మెట్రిక్ టన్నులు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు 14 లక్షల మెట్రిక్ టన్నులు రైస్ నిల్వ కోసం గోడౌన్లను సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు >>2

# స్ఫూర్తిమంత్రం.. వందేమాతరం

- నాలుగు దశల్లో యేడాదిపాటు వందేమాతరం 150 వసంతాల వేడుకలు
- ప్రజలతో కలిసి గీతం ఆలపించిన సిఎం చంద్రబాబు
- దేశాన్ని ప్రమోట్ చేసేలా ప్రధాని మోడీ ఆలోచనలు: సిఎం



సోమవారం విజయవాడలో వందేమాతం ద్విశతాబ్దోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, నవంబరు 10, ప్రభాతవార్తప్రతినిధి:** వందేమాతరం స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం తుమ్మల పల్లి వారిక్షేత్రయ్య కళా క్షేత్రంలో సాంస్కృతిక శాఖ నిర్వహించిన వందేమాతరం 150 వసంతాల వేడుకల్లో సిఎం పాల్గొన్నారు. ఈ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ప్రజలతో కలిసి వందేమాతరం గేయాన్ని ముఖ్యమంత్రి ఆలపించారు. ఎపి సాంస్కృతిక, సృజనాత్మశాఖ డైరెక్టర్ రెగుళ్ల మల్లిఖార్జునరావు రచించిన బకించంద్ర చటోపాధ్యాయ జీవిత చరిత్ర చిరు పొత్తాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... “వందేమాతరం నినాదంతో స్వాతంత్ర్యోద్యమం చేపట్టారు.. అందర్నీ ఏకతాటి మీదకు తెచ్చిన గేయం వందేమాతరం. బెంగాల్లోని కంఠలపారా అనే గ్రామంలో ఈ వందేమాతర గేయం పుట్టింది. బంకిమ్‌చంద్ర ఛటర్జీ ఈ గేయాన్ని రూపొందించారు. మాతృభూమిని దేవతలా భావించి ‘వందే మాతరం’ పాట రాశారు. అది జాతీయ భావానికి తొలి జ్యోతి అయ్యింది. తన రచన ‘ఆనందమఠం’ నవల ద్వారా దీనిని ప్రజల్లోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత కాలంలో వందేమాతరం గేయం స్వాంతంత్ర్యోద్యమ సంగ్రామంలో జాతీయ భావాన్ని రగిలించింది. వందేమాతరం ఉద్యమ గేయంగా మారింది... ప్రజలందర్నీ ఏకం చేసింది. 1950 జనవరి 24న వందేమాతరానికి జాతీయ గేయం హోదా ఇచ్చారు. ఏడాది పాటు వందేమాతరం ఉత్సవాలు జరపాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. నాలుగు దశలుగా ఈ ఉత్సవాలు జరుపుకుంటున్నాం. ప్రతి భారతీయుడు అనునిత్యం ఈ గేయాన్ని నెమరువేసుకోవాలి. లాలా లజపతి రాయ్, బాల గంగాధర్ తిలక్, భగత్ సింగ్ వంటి వారికి ఈ గేయం స్ఫూర్తినిచ్చింది. వందేమాతరం గీతానికి బ్రిటీష్ వాళ్లు భయపడ్డారు.. నిషేధించారు. అయినా ప్రజలు వెనుకడగు వేయలేదు. లాఠీఛార్జీలు, అరెస్టులు, తూటాలను ఎదుర్కొంటూ వందే మాతరం అంటూ నినదిస్తూ వీధులలోకి వచ్చారు. ఉప్పెనలా ఉద్యమం సాగింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా దేశం కోసం ఆ నినాదాన్ని వీడలేదు. చనిపోయేటప్పుడు కూడా వందేమాతరం అని నినదిస్తూ ప్రాణాలు వదిలారు. ఈ విశిష్ట గేయానికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వేడకలు జరుపుకుంటున్నాం. ఈ వేడుకలు 2025 నవంబర్ 7నుంచి 2026 నవం >>2



తెలంగాణ రాష్ట్ర గీత రచయిత

## అందెశ్రీ కన్నుమూత

నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

తెలుగు సాహితీలోకానికి తీరని లోటు: సిఎం చంద్రబాబు


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు10:** తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రూపశిల్పి, ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ (64) కన్నుమూశారు. సోమవారం తెల్లవారు జామున లాలా >>2

# మొంథా తుఫాన్‌తో రూ. 6384 కోట్లు నష్టం

## రూ. 901 కోట్ల తక్షణ సాయం చేయండి

### కేంద్ర బృందాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

### తుఫాన్ నష్టంపై ఆర్టీజీఎస్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్



తుఫన్ నష్టంపై ఆర్టీజీఎస్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ప్రభుత్వ అధికార యంత్రాంగం

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుపాను రాష్ట్రంలో అంచనాలకు మించి అపార నష్టం కలిగించిందని, కేంద్ర ప్రభుత్వం ఉదారత చూపి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందాన్ని కోరింది. మొంథా తుపాను వల్ల రూ.6384 కోట్ల నష్టం వాటిల్లిందని, రూ.901.4 కోట్ల తక్షణ సాయం చేసి ఆదకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. మొంథా తుపాన్ వల్ల వాటిల్లిన నష్టం మదింపు వేయడానికి కేంద్ర బృందం రాష్ట్రానికి వచ్చింది. కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ పాసుమీబసు, కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ కె. పొన్నుస్వామీల నేతృత్వంలోని 8 మంది సభ్యులతో కూడిన కేంద్ర బృందం సోమవారం ముందుగా అమరావతిలోని సచివాలయానికి వచ్చింది. ఈ బృందానికి సచివాలయంలోని ఆర్టీజీఎస్ లో అధికారులు స్వాగతం పలికారు. అనంతరం మొంథా తుపాను కలిగించిన నష్టం గురించి రెవెన్యూ శాఖ చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్‌లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మొంథా తుపాన్ రాష్ట్రంలోని 24 జిల్లాల్లో విధ్వంసం సృష్టించిందని తెలిపారు. అంచనాలకు మించిన అపార నష్టం కలిగించిందని జయలక్ష్మి చెప్పారు. వ్యవసాయరంగానికి మొంథా తుపాను తీవ్ర నష్టం కలిగించిందన్నారు. కోత దశకు వచ్చిన పంటలను తుపాను ముంచెత్తిందని దానివల్ల రైతులకు జీవనాధారమైన >>2



# కొత్త ఎమ్మెల్యేలకు పాఠాలు చెప్పండి

## పలువురు మంత్రులతో జరిపిన సమావేశంలో మంత్రి లోకేష్ వ్యాఖ్య

### విశాఖ సదస్సులో రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి

**విజయవాడ,నవంబరు 10,పభాతవార్త ప్రతినిధి:** తొలిసారి గెలిచిన కొంతమంది ఎంఎల్ఎలకు మంచిచెడులు తెలియడం లేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ అన్నారు. అవగాహనా రాహిత్యం, అనుభవలేమితో సమన్వయం ఉండట్లేదని వ్యాఖ్యానించారు. ఉండవల్లి లోని సిఎం క్యాంపు కార్యాలయంలో పలువురు మంత్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తొలిసారి గెలిచిన ఎంఎల్ఎలకు సీనియర్ ఎంఎల్ఎలకు సీనియర్ ఎంఎల్ఎలు, నేతలు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంఎల్ఎగా గెలిచిన కొత్తలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు?ఎలాంటి సమస్యలను అధిగమించి ఈ స్థాయికి వచ్చారనే విషయాలపై కొత్త ఎంఎల్ఎలకు అవగాహన అవసరమని చెప్పారు. కొత్తగా గెలిచిన ఎంఎల్ఎలు వరుస విజయాలు కొనసాగించాలంటే లోటుపాట్లు సరిచేసుకోవాలన్నారు.ఈ నెల 14,15 తేదీల్లో విశాఖ వేదికగా జరిగే పెట్టుబడుల భాగస్వామ్య సదస్సును కలిసికట్టుగా విజయవంతం చేద్దామని లోకేష్ పిలుపునిచ్చారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని చెప్పారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా,పరోక్షంగా లక్షలాది మందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రతి మంత్రీ తమ శాఖల పరిధి ఒప్పందాలకు సంబంధించి బాధ్యతతో వ్యవహరిద్దామని చెప్పారు.మంగళవారం నిర్వహించే ఎంఎస్ఎంఇ పార్కుల కార్యక్రమంలో మంత్రులంతా విధిగా పాల్గొనాలని సూచించారు. తమ జిల్లాల పరిధిలో సంస్థలు గ్రౌండ్ అయ్యేలా మంత్రులు,ఇన్‌ఛార్జి మంత్రులు భాధ్యత >>2

# కల్తీనెయ్యిలో కీలకం గత టిటిడి బోర్డు పెద్దలే!

## మార్కెటింగ్, కొనుగోళ్లవిభాగం అధికారులనుండి సిట్ కీలక సమాచారం

**తిరుమల, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** దేవుని లడ్డూల తయారీలో 2020నుండి 2024వ సంవత్సరంవరకు కల్తీనెయ్యి సరఫరా జరిగిన కేసులో కీలకంగా గత టిటిడి బోర్డు పెద్దలే ఉన్నారనేది సిబిఐ సిట్ అధికారులు రాబట్టిన సమాచారం. ఈ కేసులో టిటిడి మార్కెటింగ్ విభాగం, కొనుగోళ్ల కమిటీలో అధికారుల నుండి సిట్ రాబట్టిన సమాచారంతో ఇప్పుడు ఇటీవల సిట్ అరెస్ట్‌చేసిన చిన్న అప్పన్న, అజయ్ కుమార్‌లను కస్టడీకి తీసుకునేందుకు ఎసిబి కోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. దీనిపై ఎసిబి న్యాయమూర్తి కస్టడీకి అప్పగిస్తే తదుపరి ఎవరి పేర్లు బయటకు రానున్నాయనేది తెలిసినా సిట్ అధికారికంగా స్పష్టతనీయలేదు. ఇప్పటికే కల్తీనెయ్యిలో గత బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి సంబంధించిన బ్యాంకు లావాదేవీల >>2



పేలుడు సంభవించిన ప్రాంతంలో పర్యటిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న భద్రతా దళాలు

# ఢిల్లీలో ఉగ్రరాక్షసం

>> మారింది. హర్యానాలో భారీ మొత్తంలో ఆర్డీఎక్స్ పట్టుబడటం దేశం మొత్తాన్ని వణికించింది. అయితే ఇది జరిగిన కొన్ని గంటల్లోనే దేశ రాజధానిలో భారీ పేలుడు చోటు చేసుకోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. ఇందుకు సంబంధించి అనుమానితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఇంటరాగేషన్‌చేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద కారులో ఈ పేలుడు సంభవించినట్లు స్థానికులు వెల్లడించారు. ఎర్రకోట గేట్ నంబర్ వన్ మెట్రో స్టేషన్ వద్ద ఆపి ఉంచిన కారులో ఈ భారీ పేలుడు జరిగినట్లు ఢిల్లీపోలీసులు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 6.52 గంటలకు ఈ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి పక్కనే ఉన్న 8 కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ పేలుడుతో సమీపంలో ఉన్న షాపులు కూడా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఇప్పటిదాగా 13మంది మృతి చెందగా వారి మృతదేహాలు ఛిద్రమైపోయాయి.శరీరభాగాలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. పేలుడు సంభవించగానే ఒక్కసారిగా మంటలు చెలరేగి అక్కడే ఉన్న 24 మందికిపైగా సామాన్య జనం తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే దగ్గర్లో ఉన్న ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఇక గాయపడిన వారిని పేలుడు ప్రాంతం నుంచి బయటికి లాక్కొచ్చినట్లు స్థానికులు వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్, పోలీస్, ఇతర శాఖల సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు మరోవైపు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ కూడా రంగంలోకి దిగి గాలింపుప్రారంభించింది. ఎన్ఐఎ, ఎన్ఎస్‌జీ బృందాలు కూడా ప్రవేశించి దర్యాప్తు ప్రారంభించాయి. 7 ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి మంటలను అదుపు చేస్తున్నారు. పేలుడు జరిగిన ప్రాంతానికి 15 క్యాట్ అంబులెన్స్‌లు, వైద్యబృందాలుకూడా చేరుకున్నాయి. పేలుడు జరగడానికి కారణం ఇప్పటివరకూ వెలుగులోకి రాలేదు. గౌరిశంకర్ మందిర్‌కు సమీపంలో సాయంత్రం 6.55 గంటలప్రాంతంలో ఈపేలుడు జరిగిందని ఢిల్లీ ఫైర్ సర్వీస్ అధికారులు తెలిపారు. పేలుడు సమాచారం తెలుసుకున్న ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఆ ప్రాంతం మొత్తం తమ అధీనంలోకి తీసుకుని పరిస్థితిని అంచనా వేస్తున్నారు. తీవ్రంగా గాయపడినవారిని, మృతదేహాలను ఢిల్లీలోని ఎల్ఎన్‌జె ఆసుపత్రికి తరలించారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో 2900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న రోజే ఢిల్లీలో ఈ భారీ పేలుడు సంభవించడం గమనార్హం. దీంతో ఈ రెండు సంఘటనలకు ఏదైనా లింక్ ఉందా అనే కోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఢిల్లీ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జమ్ముకాశ్మీర్‌లో పోలీసులు భద్రతా దళాలు మొత్తం ఏడుగురిని అరెస్టుచేసిన కొన్ని గంటలకే ఈ పేలుడు జరిగింది. జమ్ముకాశ్మీర్‌లో అరెస్టుచేసిన వారిలోజైషే మహ్మద్, అన్సర్ ఘాజ్‌వాట్ ఉల్ హింద్ ఉగ్రసంస్థలకు చెందినవారే ఉన్నారు. వీరిలో ఇద్దరు డాక్టర్లు కూడా ఉండటం గమనార్హం.వారినుంచి భారీ ఎత్తున ఆయుధాలు, ఆయుధసామగ్రిని కూడా రికవరీచేసారు. వాటిలో ఎకె56 రైఫిల్, ఎకె క్రిన్‌కోవ్‌రైఫిల్,బెరెట్టా పిస్టల్ వంటివికూడా ఉన్నాయి. కారులో ఉంచిన పేలుడు సామగ్రిని రిమోట్‌సాయంతో పేల్చారా అన్న సందేహాలున్నాయి. ప్రతిసోమవారం ఢిల్లీలో పర్యాటకప్రాంతాలు, మార్కెట్లకు సెలవు కావడంతో భారీ ప్రమాదం తప్పింది. కాగా ఢిల్లీలో జరిగిన ఈ భారీ పేలుడుతో దేశం మొత్తం ఉలిక్కిపడింది. దీంతో ఢిల్లీ సహా దేశంలోని పలు నగరాల్లో హైఅలర్ట్ విధించారు. హరియానాలోని ఫరీదాబాద్‌లో సోమవారం ఉదయమే భారీ ఎత్తున పేలుడుసామగ్రి పట్టుకున్నారు. ఢిల్లీ, హరియానా, ఉత్తరప్రదేశ్‌లను కలిపే అన్ని సరిహద్దు కకేంద్రాలవద్ద పోలీస్ నిఘా పెంచారు. రైల్వేస్టేషన్లు,మెట్రోస్టేషన్లవద్ద కూడా భద్రత పెరిగింది.సరిహద్దుల్లో వాహనాలు, లాడ్జీలు, హోటళ్లను కూడా తనిఖీచేయాలని ఆదేశించారు. ఢిల్లీ సరిహద్దులు టిక్రీ, సింఘూ, బదర్‌పూర్‌సరిహద్దుల్లో అదనపు చెక్‌పోస్టులు, పోలీస్ పికెట్లు ఏర్పాటుచేసారు. అదేవిధంగా ఉగ్రమూకల చొరబాట్లు అత్యధికంగా ఉండే జమ్ముకాశ్మీర్‌లో భద్రతా బలగాలు హై అలర్ట్‌ప్రకటించాయి.

### హర్యానా రిజిస్ట్రేషన్‌తో హుండై ఐ20కారు...

కాగా పేలుడుకు కారణమైన కారు హర్యానా రాష్ట్రానిదని గుర్తించారు.రిజిస్ట్రేషన్ నంబరు హెచ్ఆర్ 26, 7674గా ఢిల్లీపోలీసులు తెలిపారు. కొందరు ఐ20 అని చెపుతుంటే మరికొందరు మారుతి స్విఫ్ట్ డిజైర్ అంటున్నారు. నదీమ్‌ఖాన్ అనే వ్యక్తిపేరిట ఈ కారు రిజిస్టరు అయిఉంది. పేలుడు సమయంలో కారులో ముగ్గురున్నారని పోలీసులు గుర్తించారు. కాగాపేలుడు సంఘటనకు సంబంధించి అనుమానితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అయితే వీరు ఎక్కడివారన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఇద్దరు అనుమానితులను ఎన్ఐఎ, ఢిల్లీపోలీసులు సంయుక్తంగా ఇంటరాగేషన్‌చేస్తున్నారు. అయితే ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందా, ప్రమాదవశాత్తూ జరిగిందా అన్నది దర్యాప్తుజరుగుతున్నదని ఢిల్లీపోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా అన్నారు.

### గతంలోనూ ఎర్రకోట, పలుచోట్ల పేలుళ్లు

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో గతంలోకూడా పేలుళ్లు జరిగాయి. 2021 జనవరి 29వ తేదీ ఢిల్లీ ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం సమీపంలో పేలుడు జరిగింది. అలాగే 2012 ఫిబ్రవరి 2వ తేదీ ఢిల్లీ హైసెక్యూరిటీప్రాంతంలో బాంబుదాడిలో ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం కారు ధ్వంసం అయి ఒక మహిళకూడా గాయపడ్డారు. 2011 సెప్టెంబరు ఏడో తేదీ ఢిల్లీ హైకోర్టుప్రవేశ ద్వారం వద్ద రిసెప్షన్‌ప్రాంతంలో బ్రీఫ్‌కేస్‌లో ఉంచిన శక్తివంతమైన బాంబు పేలింది. 15 మంది చనిపోగా 67 మందికిపైగా గాయపడ్డారు. 2011 మే 25వ తేదీ కూడా ఢిల్లీ హైకోర్టు వెలుపల కారుపార్కింగ్‌లో స్వల్పపేలుడు జరిగిందిప్రాణనష్టం అయితే జరగలేదు. అలాగే 2008 సెప్టెంబరు 27న కుతుబ్‌మీనార్‌సమీపంలోని మెహ్రౌలి పూలమార్కెట్‌లోపేలుడు జరిగి ముగ్గురుచనిపోగా 21 మంది గాయపడ్డారు. 2008 వరుసపేలుళ్లతో ఢిల్లీ దద్దరిల్లిపోయింది. కన్నాట్‌ప్లేస్, కరోల్‌బాగ్‌లోని గఫార్‌మార్కెట్,గ్రేటర్‌కైలాష్‌లోనిఎంబ్లాక్ మార్కెట్‌లలో 45నిమిషాల వ్యవధిలో ఐదు వరుసపేలుళ్లు జరిగాయి. 25 మంది చనిపోగా 100మందికిపైగా గాయపడ్డారు. 2006 ఏప్రిల్ 14వ తేదీ పాతఢిల్లీలోని జామా మసీదు ప్రాంగణంలో జరిగిన పేలుళ్లలో 14 మంది గాయపడ్డారు. 2005 అక్టోబరు 29న ఢిల్లీలోని సరోజిని నగర్ పహాడ్‌గంజ్‌మార్కెట్లు, గోవింద్‌పురి ప్రాంతంలో ఒక బస్సులో పేలుళ్లలో 59 మందికిపైగా మరణించారు. విదేశీయులు సహా 100 మందికిపైగా గాయపడ్డారు. అలాగే 2005 మే 22 వ తేదీ ఢిల్లీలోని రెండు సినిమాహాళ్లలో చోటుచేసుకున్న వరుసపేళ్లులో ఒకరు మరణించగా 60 మంది గాయపడ్డారు. 2000వ సంవత్సరంలో జూన్18న ఎర్రకోట సమీపంలోనే రెండు బాబులు పేలి బాలికసహా ఇద్దరు మృతిచెంది పది మంది గాయపడ్డారు. 1998 జులై26వ తేదీ అంతర్‌రాష్ట్ర బస్ టెర్మినల్‌లోనిక శ్మీరీ గేట్‌వద్ద ఆగి ఉన్న బస్సులో భారీ పేలుడు జరిగి ఇద్దరుచనిపోయారు. 1997 చివరినెలల్లో వరుపేలుళ్లతో ఢిల్లీ వణికిపోయింది. ముగ్గురు చనిపోగా 150 మంది గాయపడ్డారు. నవంబరు 30న ఎర్రకోట ప్రాంంలోనే రెండు పేలుళ్లుజరిగాయి. ముగ్గురుచనిపోయి 70 మంది గాయపడ్డారు. డిసెంబరు 30న పంజాబీబాగ్ సమీపంలో బస్సులో బాంబుపేలుడు రిగి నలుగురుచనిపోగా 30మందికిపైగా గాయాలపాలయ్యారు.



ఘటనా స్థలంలో వాహనాలు బూడిదైన దృశ్యం

# కొత్త ఎమ్మెల్యేలకు పాఠాలు చెప్పండి

>> తీసుకోవాలని లోకేష్ సూచించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీని త్వరగా నెరవేరుద్దామన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో 5వసారి 'భాగస్వామ్య సదస్సు'కు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. 'టెక్నాలజీ ట్రస్ట్ అండ్ ట్రేడ్ నావిగేటింగ్ ది న్యూ జియో ఎకనామిక్ ఆర్డర్' అనే థీమ్‌తో ఈ నెల 14, 15వ తేదీల్లో విశాఖలో సదస్సు జరగనుంది. పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి ఏం కావాలో అన్నింటినీ సమకూర్చేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీటి సౌకర్యాలను కల్పిస్తోంది. ఎపిఐఐసి ఆధ్వర్యంలో ల్యాండ్‌బ్యాంక్ ఏర్పాటు చేసి తక్కువ ధరకే పరిశ్రమలకు భూములను కేటాయిస్తున్నారు. ఆర్సెలార్ మిత్తల్, ఎన్టీపీసీ, టీసీఎస్, గూగుల్ సహా ఇతర ఐటీ కంపెనీలకు భూ కేటాయింపులు వేగంగా పూర్తిచేశారు. ప్రోత్సాహకాలు, రాయితీలు ప్రకటించడంతో పాటు, జీఎస్టీపైనా రాయితీని అందిస్తున్నారన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లలో రాష్ట్రం ముందంజలో ఉంది.

పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ కోసం సోలార్, విండ్, పంప్డ్‌స్టోరేజ్, గ్రీన్ ఎనర్జీలో టాటా, నవయుగ వంటి పెద్ద కంపెనీలు ఇప్పటికే 3.50 లక్షల కోట్ల రూపా యల పెట్టుబడులు పెట్టాయి. పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకునే పరిశ్రమలు గ్రౌండ్ అయ్యేలోగా పోలవరం ప్రాజెక్టుని పూర్తిచేసి నీటిని అందించనున్నారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రస్తుతం విశాఖ, గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ మేజర్ పోర్టులు ఉన్నాయి. నూతన పెట్టుబడులతో పరిశ్రమలు స్టార్ట్ అయ్యేసరికి మూలపట్నం, రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ డీప్ వాటర్ యాంక రేజ్ పోర్టులు అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రహదారుల నిర్మాణం సైతం శరవేగంగా జరుగుతున్నాయి.ఇవన్నీ ప్రజలకు వివరించాలన్నారు.

# తుఫాన్‌తో రూ. 6384 కోట్లు నష్టం

>> పంటలు నీట మునిగిపోయి కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. 1.61 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మినుము, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు చెప్పారు. అలాగే 6,250 హెక్టార్లలో ఉద్యానవన పంటలు , 17.72 హెక్టార్లలో మల్బరీ తోటలకూ నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ తుపాన్ కారణంగా మత్స్యకారులు కూడా బాగా దెబ్బతిన్నారన్నారు. 3063 హెక్టార్లలో చేపల చెరువులు ధ్వంసమయ్యాయని వివరించారు. తుపాను కారణంగా 4,566 ఇళ్లు దెబ్బతిన్నాయని, 1853 పాఠశాలలకు కూడా నష్టం వాటిల్లిందని వెల్లడించారు. ఆర్ అండ్ బీ శాఖకు సంబంధించి 4,794 కిలోమీటర్ల రోడ్లు, 311 వంతెనలు, కల్వర్టు దెబ్బతిన్నయాన్నారు. జలవనరుల శాఖకు సంబంధించి 3437 మైనర్ ఇరిగేషన్ పనులు, 2417 మేజర్ మరియు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ వర్షాల వల్ల 58 అర్బన్ లోకల్ బాడీస్‌కు కూడా నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ విపత్తు కలిగించిన విధ్వంసం నుంచి బాధితులు కోలుకోవడానికి కేంద్ర ఉదారంగా వ్యవహరించాలని కోరారు. తుపానుకు సర్వం కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధితులు మళ్లీ కోలుకోవడానికి కేంద్రం అందించే సహాయం, సహకారం ఎంతో కీలకమని అన్నారు.

### 680 డ్రోన్లు ఉపయోగించాం..

రాష్ట్ర ప్రభుత్వం తుపాను ఎదుర్కోవడానికి ఎంతో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం వల్ల పెద్దగా ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగామని అధికారులు వివరించారు. సహాయక కార్యక్రమాలు కూడా యుద్ధప్రాతిపదికన చేపట్టామని తెలిపారు. బుడమేరు వరదల అనుభవంతో ఈ సారి వరద సహాయక చర్యల కోసం 680 డ్రోన్లు ఉపయోగించామని చెప్పారు. అక్టోబరు 2729 వ తేదీల మధ్య 82.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని ఇది సాధారణ వర్షపాతం కంటే 9 రెట్లు ఎక్కువన్నారు. 443 మండలాల్లో ఈ తుపాన్ ప్రభావం చూపించిందని, ఈ విపత్తు కారణంగా 3 మృతి చెందారని, 9,960 ఇళ్లు నీట మునిగాయని, 1,11,402 మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. తుపాను సహాయక చర్యల్లో 12 ఎన్డీఆర్ ఎఫ్, 13 ఎస్డీఆర్ ఎఫ్ బృందాలను, 1,702 వాహనాలను, 110 మంది ఈతగాళ్లను వినియోగించామని వెల్లడించారు. 22 జిల్లాల్లో 2,471 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి1,92,441 మందికి పునరావాసం కల్పించామన్నారు.

# లక్ష కోట్ల పెట్టుబడులు

>> పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ఉపరాష్ట్రపతి వస్తున్నారని.. పుట్టపర్తిని ఆధ్యాత్మిక కేంద్రంగా చేయాలని సూచించారు. ఈ సమ్మిట్‌కు ప్రెసిడెంట్, ప్రధాని, వైస్ ప్రెసిడెంట్, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, చాలామంది వస్తున్నారని చెప్పారు. కూటమి ఎమ్మెల్యేలు ఎవరైనా తప్పు చేస్తుంటే.. ఇన్‌చార్జి మంత్రులు జోక్యం చేసుకుని సరిచేయాలని దిశానిర్దేశం చేశారు క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ 2025-30, ఆంధ్రప్రదేశ్ నైబర్ హుడ్ వర్క్ స్పేస్ పాలసీ 2025- 30కి, డ్రోన్ సిటికి భూ కేటాయింపు విధానాలకు రాష్ట్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. విశాఖలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగే పెట్టుబడులు భాగస్వామ్య సదస్సు విజయవంతానికి చర్చ చేపట్టింది. వివిధ సంస్థలకు భూకేటాయింపులు, అభివృద్ధి పనులకు పాలనాపర అనుమతులు మంజూరు వంటి వాటిపై క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఐటీ శాఖ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖలకు సంబంధించి 10కి పైగా అంశాలను క్యాబినెట్ ఆమోదించింది.విశాఖ, తిరుపతి, కుప్పం, కర్నూలు తదితర ప్రాంతాల్లో ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూని కేషన్ పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. 12వ పెట్టుబడులు ప్రోత్సాహక మండలి సమావేశంలో ఆమోదం తెలిపిన దాదాపు రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడులను ఆమోదించింది. ఎపిఎడిసిఎల్‌కు హడ్కో రుణాల చెల్లింపు విషయంలో ప్రభుత్వ గ్యారెంటీ ఇచ్చే అంశానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది.

సత్ప్రవర్తన కలిగిన ముగ్గురు జీవిత ఖైదీలను విడుదలచేసే అంశంపై క్యాబినెట్ చర్చించింది.విశాఖలో ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహించే పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు సంబంధించి ఒప్పందాల్లో ప్రభుత్వం తరఫున సంతకాలు చేసే అధికారాలు బాధ్యత సర్దుబాటు అంశానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థ ఏర్పాటు సహా వివిధ సంస్థల ఏర్పాటు కోసం భూ కేటాయింపులకు సంబంధించి సిఆర్‌డిఎ ఆథారిటీ నిర్ణయాలను ఆమోదించింది. సిఆర్‌డిఎ సహా పట్టణాభివృద్ధి, మున్సిపల్ శాఖల్లో వివిధ పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకోనుంది. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎపిపిఎఫ్‌సిఎల్ నుంచి రూ.1500 కోట్ల రుణం సిఆర్‌డిఎ పొందేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చినట్లు సమాచారం. వివిధ పరిశ్రమల ఏర్పాటులో భూ కేటాయింపునకు రాయితీలు కల్పించే అంశంపై చర్చించి మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖలో ఆదనపు కమిషనర్, సంయుక్త కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ స్థాయిలో 19 కొత్త పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వివిధ సంస్థలకు కేటాయించిన భూమి లీజు గడువును పెంచే అంశంపై చర్చించింది అసైన్డ్ భూముల చట్టానికి ప్రతిపాదించిన పలు సవరణలకు చర్చించింది,కీలకనిర్ణయం తీసుకుంది.

### రాష్ట్ర మంత్రులకు సిఎం చంద్రబాబు అభినందనలు,కీలక సూచనలు

క్యాబినెట్ సమావేశంలో మంత్రులను సిఎం చంద్రబాబు అభినందించారు. మొంథా తుఫాను సమయంలో క్షేత్ర స్థాయిలో బాగా పనిచేశారని మంత్రులను సిఎం ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో ఉండి ప్రజలకు తక్షణ సాయం అందేలా చేశారన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికార యంత్రాంగం పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లనే తుఫాను సహాయక చర్యలు వేగంగా అందాయని తెలిపారు. ఆర్టీజీ సెంటర్ నుంచి నిరంతర పర్యవేక్షణ, టెక్నాలజీ సహాయంతో ప్రాణ, ఆస్థి నష్టాన్ని చాలా వరకు తగ్గించగలిగామని అన్నారు. మంత్రులు, అధికారులు, యంత్రాంగం టీం స్పిరిట్‌తో పనిచేస్తే ఇటువంటి మంచి ఫలితాలే వస్తాయని అభినందనలు తెలిపారు. అంతా ఎలా కష్టపడి పనిచేశారో స్వయంగా చూశానంటూ మంత్రులకు సిఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు.ఇక తాము ఇన్‌చార్జీలుగా ఉన్న జిల్లాపై మంత్రులు దృష్టిపెట్టాలని సిఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

## వారం - వర్జ్యం

11-11-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
సప్తమి రా.11.14
పుష్యమి సా.6.24, విశాఖ కార్తె
వర్జ్యం : ఉ.7.21-8.58
దు.ఉ.8.27-9.13
2) రా.10.09 - 10.55
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** పోటీ ప్రపంచంలో ముక్కు సూటితనం కన్నా లౌక్యం అవసరమని ఋజువు చేస్తాయి. పెట్టుబడుల విషయంలో తొందరపాటు వద్దు.

**వృషభం:** అత్మ సాక్షికి విరుద్ధంగా ఏపని చేయరు. ఆహార నియమాలు పాటించండి. ఆరోగ్య, కుటుంబ సమస్యల నుండి బయటపడతారు.

**మిథునం:** నిలిపివేసినటువంటి విద్యా కళా సంబంధమైన వాటిని పునఃప్రారంభిస్తారు. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం :** సున్నితమైన మనస్తత్వం ఇబ్బందికి గురి చేస్తుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** కుటుంబ సభ్యుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. ఇతరుల విషయాలలో జోక్యం తగదు.

**కన్య:** ఆరోగ్య, వాహనాల విషయాలలో మెలకువ పాటించండి. వివాదాలకు దూరంగా వుండండి. నూతన వ్యవహారాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

**తుల :** కొన్ని అవకాశాలు అనుకోకుండా లభిస్తాయి. వీటిని చేజార్చుకోకండి. ఆస్తి విషయాలలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**వృశ్చికం:** పాత మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. ఉద్యోగులలో ఇంక్రిమెంట్లు, పదోన్నతులు పొందుతారు.

**ధనుస్సు:** దూరపు బంధువుల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఒడిదుడుకులు కొంతవరకు తీరుతాయి.

**మకరం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యోగయత్నాలు సాగిస్తారు. ఆకస్మిక బదిలీలు ఉంటాయి.వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** శత్రువులు సైతం మిత్రులుగా మారి సహాయం అందిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.శ్రమ అధికం.

**మీనం :** సంతానపరంగా సంతృప్తిని కలిగి వుంటారు. బంధువుల కలయిక. నూతన భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అందెశ్రీ కన్నుమూత

>> గూడలోని తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అందెశ్రీ కలం నుంచి జాలువారిన జయ జయహే తెలంగాణ గీతాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర అధికారిక గీతంగా గుర్తించిన విషయం తెలిసిందే. తన పాటలు, రచనలతో ఆయన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో ఆయన గీతాలు ప్రజల్లో స్ఫూర్తిని రగిలించాయి. 1961, జూలై 18న ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తిలో (ప్రస్తుతం సిద్దిపేట జిల్లా) అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లన్న. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. 'మాయమై పోతున్నడమ్మ మనిషన్నవాడు' అనే పాటతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆశుకవిత్వం చెప్పడంలో దిట్ట అయిన అందెశ్రీ.. ప్రజాకవి, ప్రకృతి కవిగా ప్రసిద్ధి చెందారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తన పాటలతో ప్రజలను ఉత్తేజితులను చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ్ణతోపాటు ఎన్నో పాటలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 2006లో గంగ సినిమాకు నంది పురస్కారం అందుకున్నారు. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కరం, లోక్‌నాయక్ పురస్కారం అందుకున్నారు.ఇటీవల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆయనకు రూ.కోటి పురస్కారం,ఇంటి స్థలం, తామ్రపత్రం అందజేసింది. మాయమైపోతున్న మనిషి తనాన్ని తట్టిలేపినవాడు.. ఒక అనాథగా పెరిగి.. పశువులను కాసి.. అక్షర జ్ఞానం లేకపోయినా.. తనకు ఎదురైన సమస్యలనే అక్షరంగా మార్చి.. తన కవితలతో, రచనలతో ఎంతో మందిని ప్రభావితం చేసిన వ్యక్తి అందెశ్రీ.. ఆయన మరణం అందరిని కలచివేసింది. 'అందె శ్రీ మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఒక గొప్ప కవి, మేధావి అయిన ఆయన, ప్రజల పోరాటాలకు , ఆకాంక్షలకు , అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ఏకం చేసే శక్తి, ప్రజల సాంఘిక హృదయస్పందనకు రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఓం శాంతి' అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలుగులో ట్వీట్ చేశారు. అందెశ్రీ ఆకస్మిక మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయజయహే తెలంగాణ రాసిన సమయంలో అందెశ్రీతో జరిపిన సంభాషణలను గుర్తుచేసుకున్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందని చెప్పారు. స్వరాష్ట్ర సాధనలో అందెశ్రీ చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, అందెశ్రీ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

మంగళవారం ఘట్కేసర్ ఎన్ఎఫ్‌సి నగరంలో అందెశ్రీ అంత్యక్రియలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సాహితీ లోకానికి అందెశ్రీ అందించిన సేవలు చిరస్మరణీయమని వారు కొనియాడారు. అందెశ్రీ ఆకస్మిక మృతిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించిన డాక్టర్ అందెశ్రీ మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని తెలిపారు. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటని చెప్పుకొచ్చారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. వారికుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సీఎం చంద్రబాబు తెలిపారు.

# స్ఫూర్తిమంత్రం.. వందేమాతరం

>> బర్ 7 వరకు ఏడాది పాటు జరుగుతాయి. మొత్తం నాలుగు దశలుగా ఈ ఉత్సవాలు నిర్వహించుకుంటున్నాం. మొదటి దశ నవంబర్ 7 నుంచి 14 వరకు ప్రారంభ వారోత్సవంగా జరుపుతున్నాం. రెండో దశ - 2026 జనవరి 19 నుంచి 26 వరకు... మూడో దశ - 2026 ఆగస్టు 7 నుంచి 15 వరకు... నాలుగో దశ - 2026 నవంబర్ 1 నుంచి 7 వరకు జరుపుకుందాం. 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ గేయం ఇచ్చిన స్ఫూర్తిని అనునిత్యం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది." అని ముఖ్యమంత్రి చెప్పారు.

### దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా ప్రధాని ఆలోచనలు..

ప్రతి భారతీయుడు గర్వించేలా ప్రధాని పాలన చేస్తున్నారు. మేకిన్ ఇండియా కార్యక్రమాలు ఓవైపు, యోగా వంటి కార్యక్రమాలు మరోవైపు చేపట్టి భారత దేశ కీర్తిని ప్రపంచం మొత్తం చాటారు. విశిష్టమైన ఈ గేయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కార్యక్రమం ప్రకటించిన ప్రధానికి ధన్యవాదాలు. మన సంస్కృతీ సాంప్రదాయాలను, మన పోరాటాలను, చరిత్రను ప్రపంచానికి తెలుపుతున్నారు. ప్రపంచ స్థాయి ఉత్పత్తులను మనం తయారు చేసుకోవాలి. 11వ స్థానంలో ఉన్న భారత దేశం.. ప్రస్తుతం నాలుగో అతిపెద్ద వ్యవస్థగా మారింది. మరికొన్ని రోజుల్లో 3వ వ్యవస్థగా మారుతుంది. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మారుస్తాం. దేశం నాకేమి ఇచ్చిందని కాదు.. దేశానికి నేనేం చేశానని ఆలోచిస్తే సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రతి ఒక్క పౌరుడూ బాధ్యతగా ఉండాలి." అని సీఎం అన్నారు.

# కల్తీనెయ్యిలో కీలకం గత టిటిడి బోర్డు పెద్దలే!

>> వివరాలను సమర్పించాలని సిట్ ఆదేశించింది.

మరీ న్యాయమూర్తి ఆదేశాలతో తదుపరి సిట్ చర్యలకు సిద్ధమవుతోంది. కల్తీనెయ్యి సరఫరా చేసిన బాగోతంలో రానున్న రోజుల్లో కీలకంగా వ్యవహరించిన కొందరు సూత్రధారులతోబాటు టిటిడి అధికారుల పాత్రను తేల్చేయనుంది. గతంలోనే టిటిడికి తిరుమల లడ్డూలకు అవసరమైన నెయ్యి సరఫరాకు టెండర్లు పిలవడం, టెండర్లలో పాల్గొన్న డెయిరీ సంస్థల యాజమాన్యం టిటిడి నిబంధనలు ఉల్లంఘించి నాణ్యతలేని నెయ్యిసరఫరాచేయడం వెనుక కీలక వ్యక్తులు పట్టుకోవడం సిట్‌కు సాహసంతో కూడిన విషయం. గత టిటిడి బోర్డు పెద్దలు,మాజీ అధికారుల అరెస్ట్ తప్పదనేది తెలుస్తోంది. ఈ వారంలో సిట్ దర్యాప్తు, ఎవరిని పిలిచి అరెస్ట్ చేయనుందనేది టిటిడిలో హాట్‌టాఫిక్‌గా మారింది. కల్తీనెయ్యి సరఫరాచేసిన పాపంలో అసలు సూత్రధారులైన గత టిటిడి పెద్దల అవినీతిగుట్టు రట్టయ్యే అవకాశం కూడా ఉండటంతో సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో కార్యాచరణ సిద్ధంచేసుకొంటున్నారు.

# ప్రతి ధాన్యం గింజ కొంటాం: మంత్రి నాదెండ్ల

>> సూచించారు. డ్రైయర్ల సౌకర్యాలు ఉన్న రైస్ మిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి గోడౌన్ వద్ద నిరంతర నిఘా ఉండేలా తి। కెమెరాలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల వారీగా రైస్ మిల్లర్లు 1:2 బ్యాంక్ గ్యారంటీలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఇందుకు సుమారు 35 బ్యాంకులు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సివిల్ సప్లైస్ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై సెక్రటరీ సౌరభ్ గౌర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సెక్రటరీ సూరిబాబు, నాయకులు సత్యనారాయణరాజు, వీరయ్య, లలిత శ్రీనివాస్, పట్టాభి శ్రీనివాస్, సివిల్ సప్లై అధికారులు ఉన్నారు.

# చలికి వణుకుతున్న తెలంగాణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,నవంబర్10:** తెలంగాణ రాష్ట్రంలో శీతల గాలులు వీస్తున్నాయని, వాటి ప్రభావంతో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలపై చలి ప్రభావం అధికంగా ఉందని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు తెలిపారు. నాలుగైదు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరుగుతుందన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.5 డిగ్రీలుగా నమోదైందని, రానున్న నాలుగు రోజుల్లో మరింతగా తగ్గుతాయని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్,మెదక్ జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుందని, పొగ మంచు, శీతల గాలుల కారణంగా రాత్రి పూట చలి ఎక్కువగా ఉంటుందన్నారు. చీప్నిజి

# ముందు అవగాహన.. ఆ తర్వాతే చలానా

**ట్రాఫిక్ నిబంధనల అమల్లో సరికొత్త మోడల్ అమలు**
**రోడ్డు ప్రమాదాలు, తొక్కిసలాటలు, అగ్నిప్రమాదాల నివారణపై ఫోకస్ పెట్టండి**
**ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశాలు**


ఆర్టీజీఎస్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ నవంబర్ 10, ప్రభాతవార్తప్రతినిధి:** రోడ్డు ప్రమాదాల నివారణపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. నిబంధనల ఉల్లంఘనలపై అవగాహన కల్పించిన తర్వాతే చలానా విధించే అంశాన్ని పరిశీలించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్‌పై ముఖ్యమంత్రి సమీక్షి ంచారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి దాని ఆవశ్యకతను వివరించాలని సూచించారు. భారీ ఎత్తున చలానాలు వేయాలన్న అధికారుల ప్రతిపాదనలను సీఎం సున్నితంగా తిరస్కరించారు. చలానాలు వేసి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ఈ క్రమంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడవడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ముందుగా హెల్మెట్లు, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడిపే వారికి అవగాహన కల్పించడంతోపాటు... వారు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనే విషయాన్ని వారి ఫోన్లకు మెసేజీలు పంపాలని సూచించారు. ఆ తర్వాత కూడా వారి నిబంధనలు ఉల్లంఘిస్తుంటే అప్పుడు చలానాలు వేయాలని స్పష్టం చేశారు. దీని వల్ల నిబంధనలు ఉల్లంఘించిన వారికి తాను తప్పు చేసినందు వల్లే చలానాలు వచ్చాయనే భావన కలుగుతుందని చెప్పారు. ఇందులో కేరళ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో జరిగిన వరుస రోడ్డు ప్రమాదాలు, తొక్కిసలాట, అగ్ని ప్రమాదాలు వంటి అంశాలను సీఎం ప్రస్తావించారు. ఇలాంటివి జరగ్గకుండా ఉండేలా పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి... నిర్మాణత్మక ప్రణాళికను తయారు చేయాలని నిర్దేశించారు. దీనికి సంబంధించి ఎస్‌ఓపీలను సిద్ధం చేసి వారం రోజుల్లోగా అందివ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. జన సమూహాల్లో తొక్కిసలాటలు జరగకుండా క్రౌడ్ మేనేజ్మెంట్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా రోడ్డు ప్రమాదాలను ఏ మేరకు నియం త్రించగలమనే అంశాన్ని కూడా విశ్లేషించాలని చెప్పారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు, డ్రైనేజీలు, నీటి నిర్వహణ, ఉద్యోగ, ఉపాధి కల్పన, పంటలకు మద్దతు ధర... ఇవే తన ప్రాధాన్యతలని స్పష్టంగా చెప్పారు. అధికారులు ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రాధాన్యతలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఇప్పటికీ రోడ్లు సరిగా లేవనే ఫీడ్ బ్యాక్ వస్తుందని అలా జరగకుండా చూసుకోవాలని చెప్పారు. గత పాలనలో రహదారుల నిర్వహణ కూడా పట్టించు కోలేదని... ఆ నిధులను వేరే కార్యక్రమాలకు మళ్లించారన్నారు. అందువల్లే రహదారులు దారుణంగా ఉన్నాయన్నారు. కారణలేమైనా.. రోడ్లపై గుంతల్లేకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం ఉందన్నారు. తక్షణం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇదే విధంగా డ్రైనేజీల నిర్వహణ కూడా సరిగ్గా చేపట్టాలన్నారు. నిర్వహణ సరిగా లేకపోవడం కారణంగా నీళ్ల నిలిచిపోయే పరిస్థితి రాకూడదని సీఎం స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా జాబ్ మేళాలు నిర్వ హించాలన్నారు. వాటి గురించి నిరుద్యోగ యువతకు తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, రైతులకు సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు.

## వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న జగన్ అభ్యర్థనపై కౌంటరు దాఖలు చేయండి

### సిబిఐకి హైకోర్టు ఆదేశాలు

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న వైఎస్ జగన్ అభ్యర్థనపై కౌంటరు దాఖలు చేయాలని సీబీఐని హైదరాబాద్ సీబీఐ కోర్టు ఆదేశించింది. గత నెలలో యూరప్ పర్యటనకు వెళ్లేందుకు జగన్‌కు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే యూరప్ నుంచి వచ్చిన తర్వాత ఈనెల 14 వరకూ వ్యక్తిగతంగా వచ్చి పర్యటన వివరాలు తెలపాలని జగన్‌కు సీబీఐ కోర్టు షరతు విధించింది. యూరప్ వెళ్లి వచ్చిన జగన్ వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సీబీఐ కోర్టులో పిటిషన్ వేశారు. తాను కోర్టుకు వస్తే భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేయాల్సి వస్తుందని తెలిపారు. అందుకే హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకు అనుమతివ్వాలని కోరారు. జగన్ అభ్యర్థనపై స్పందించాలని సీబీఐని ఆదేశిస్తూ న్యాయస్థానం విచారణను రేపటికి వాయిదా వేసింది. యూరప్ పర్యటనకు వెళ్లి వచ్చాక కోర్టులో హాజరుకావాలన్న ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని కోరుతూ అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడైన వైఎస్ జగన్ గత గురువారం హైదరాబాద్ సీబీఐ కోర్టులో మెమో దాఖలు చేశారు. అక్టోబరు 1 నుంచి 30లోగా 15 రోజులపాటు జగన్ యూరప్ పర్యటన నిమిత్తం సీబీఐ కోర్టు అనుమతి ఇస్తూ వెళ్లే ముందు పర్యటన వివరాలు, ఫోన్ నంబరు, ఈమెయిల్ వివరాలు సమర్పించాలన్నారు.



## అలిపిరి మెట్లమార్గంలో కార్మికుల మాంసాహార భోజనం

**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రతను కాపాడి భక్తుల మనోభావాలు పరిరక్షించాల్సిన కార్మికులు నిబంధనలు ఉల్లంఘించి ఆదివారం రోజు మాంసాహార భోజనాన్ని ఏకంగా అలిపిరి మెట్లమార్గంలో తినడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పవిత్రతకూ తూట్లుపొడిచిన ఈ ఘటన కలకలంరేపింది. అలిపిరి మెట్లమార్గంలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు మాంసాహార భోజనం తింటుండగా కొందరు భక్తులు సెల్‌ఫోన్‌లలో వీడియోలు తీశారు. ఈ వీడియోలను టిటిడి వెబ్‌సైట్‌లో,వాట్సాప్‌కు పంపడంతో టిటిడి అధికారులు వెంటనే స్పందించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సరసమ్మ, రామస్వామిలుగా గుర్తించారు. వెంటనే వారిపై చర్యలు తీసుకుని విధుల్లోంచి తప్పించారు. దీనిపై తిరుమల 2టౌన్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై టిటిడి అధికారులు కూడా అధికారికంగా ప్రకటన వెలువడించారు. జరిగిన తప్పిదంపై వెంటనే వారిని తొలగించామని తెలిపింది.

## కెఎ పాల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

**విజయవాడ,నవంబరు 10,పభాతవార్త ప్రతినిధి:** ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్‌పై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీలో మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో నిర్వహించాలనే ఏపీ ప్రభుత్వం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మీడియాలో ప్రచారం కోసం పిటీషన్లు దాఖలు చేస్తున్నారని జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. దీనిపై హైకోర్టును ఆశ్రయించాలని కేఏ పాల్‌కు సూచించింది.

## ప్రముఖకవి అందెశ్రీ మృతి పట్ల ఎపి సిఎం,డిప్యూటీ సిఎం, మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారధి సంతాపాలు

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** కవి,రచయిత అందెశ్రీ కన్నుమూయడంపై పలువురు సినీ,రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. అందెశ్రీ మృతిపై సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు .'ప్రముఖ కవి,రచయిత,తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించిన డాక్టర్ అందెశ్రీ మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని ఏపీ సిఎం చంద్రబాబునాయుడు ట్వీట్ చేసారు.తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ...అందెశ్రీ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను.అంటూ సిఎం చంద్రబాబు ఎక్స్ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. 'ప్రముఖ తెలుగు సాహితీవేత్త,గేయ రచయిత అందెశ్రీ మరణం భాధాకరం అని పేర్కొన్నారు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్...అందెశ్రీ ఆత్మకు శాంతి చేయాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఆయన చచనా ప్రస్థానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది.గొర్రెల కాపరిగా,భవన నిర్మాణ కూలీగా జీవితం మొదలుపెట్టి అక్షర యాత్ర చేశారు.తెలంగాణ జానపదాలపై,మాండలికంపై పట్టు కలిగిన రచయిత ఆయన....పలు సినీగీతాలు రచించారు. 'మాయమై పోతున్నా డమా మ్మ మనిషన్నవాడు...' గీతం వింటే సమాజాన్ని అందెశ్రీ ఎంతగా చదివారో అర్థమవుతుంది.తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెంగాణ జననీ జయకేతనం' రచించి తెలంగాణ చరిత్రలో ఆయన చిరస్మరణీయంగా నిలిచారు. అందెశ్రీ మృతి పట్ల తీవ్ర సంతాపం తెలియచేస్తూ,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను అంటూ ఓ ప్రకటన విడుదల చేశారు పవన్‌కళ్యాణ్.ఒక 'ప్రముఖ కవి,రచయిత,తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించిన డాక్టర్ అందెశ్రీ మరణవార్త దిగ్భ్రాంతిని కలిగించింది. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటు...ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ... అందెశ్రీ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను' అంటూ ట్విట్టర్‌లోఏపీ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. ఉత్తమోత్తమ సాహిత్య ద్రష్టగా అందెశ్రీని ఏపీ సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ వ్యాఖ్యానించారు.పెద్దగా విద్యలేకున్నా సామాజిక అవగాహనతో ఆయన జాగృతన సాహిత్యం మరువలేనిదన్నారు.అందెశ్రీ తెలుగు భాషకు గుర్తింపు తెచ్చిన ప్రజా కవి అని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు.

# పుట్టపర్తికి ప్రధాని రాక నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు

## శతజయంతి వేడుకల ఏర్పాట్లపై సిఎం చంద్రబాబు సమీక్ష



**విజయవాడ,నవంబర్ 10. ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19న పుట్టపర్తికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, 22వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్మ రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రపతి సహా వివిధ ప్రముఖులు హాజరుకానున్న దృష్ట్యా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సత్యసాయిబాబా జయంతి వేడుకల నిర్వహణపై సచివాలయంలో మంత్రులు, సీఎస్ విజయానంద్, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తికి ప్రముఖులు రానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, పట్టణాన్ని సుందరంగా అలంకరించాలని సీఎం సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షించేందుకు మంత్రుల కమిటీ పుట్టపర్తిలో పర్యటించాలని ఆదేశించారు. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. సత్యసాయిబాబా మహాసమాధి దర్శన నిమిత్తం పుట్టపర్తి నిలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వచ్చే వాహనాలకు పార్కింగ్‌తో పాటు పట్టణంలో రాకపోకల ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. బాబా మహాసమాధి దర్శనానికి ఎంత మంది భక్తులు రావచ్చనేదానిపై అంచనా వేసి అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల కోసం అవసరమైన మేరకు ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ముందుస్తు జాగ్రత్తగా మెడికల్ క్యాంపులు సైతం ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. పుట్టపర్తిలోని వేర్వేరు ప్రాంతాల్లో 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలియజేశారు. పారిశుద్ధం విషయంలో ఎలాంటి నిరక్ష్యం ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తికి వచ్చే భక్తులకు చిన్నపాటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు సీఎంకు వివరించారు. పారిశుద్ధం నిర్వహణకు 250 మంది సిబ్బంది, వచ్చే భక్తులకు తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను కల్పిస్తున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు.

## రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు సాంకేతిక అత్యాధునిక యంత్రాలు

### కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా సౌకర్యాల కల్పన

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం లోని సూక్ష్మ,చిన్న మధ్య తరహా(ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు సాంకేతిక అత్యాధునిక యంత్రాలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే తరహా ఉత్పత్తులు చేసే పరిశ్రమలు ఉన్న క్లస్టర్లలో ప్రభుత్వ నిధులతో కామన్ పెసిలిటీ సెంటర్ల(సీఎఫ్‌సీ) ఏర్పాటుకు నిర్ణయించింది. ఒక్కో దానికి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం భరిస్తుంది. రూ.200 కోట్లతో ప్రాజెక్టును సిద్ధం చేసింది. రాష్ట్రంలో కనీసం 100 సీఎఫ్‌సీల ఏర్పాటును లక్ష్యంగా నిర్ధేశించింది. చిన్న పరిశ్రమల నిర్వాహకులపై మూలధన పెట్టుబడి భారాన్ని తగ్గించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీపడేలా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ ఆలోచనచేస్తుంది.ఒక్కో సిఎఫ్‌సీకి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం ఇస్తుంది. దీని కోసం 10 మంది సూక్ష్మ చిన్న పరిశ్రమల నిర్వాహకులు ప్రత్యేక వాహన నౌక (ఎస్‌పీవీ)ని ఏర్పాటు చేయాలి. సీఎఫ్‌సీ నిర్వహణను ఎస్‌పీవీ పర్యవేక్షిస్తుంది. యంత్రాల కొనుగోలుకు చేసే ఖర్చులో 80 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. సిఎఫ్‌సీ లోని యంత్రాలు, సాంకేతికత వినియోగించుకున్న యూనిట్ల నుంచి నామమంత్రంగా సర్వీసు ఛార్జీలు వసూలు చేసి, ఆ మొత్తాన్ని నిర్వహణను ఎస్‌పీవీ వినియోగిస్తుంది. సీఎఫ్‌సీ ఏర్పాటకుకు తక్కువ వ్యవధిలో అవసరైన అనుమతులను ప్రభుత్వం ఇస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటైన తర్వాత యంత్రాలు ,సాంకేతికతలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు ఆర్థిక పరిస్థితి వారికి సహకించడం లేదు.

వాటిలోనే ఉత్పత్తి చేస్తుండటం పట్ల నిర్వహణ వ్యయం పెరుగుతోంది. నాణ్యమైన ఉత్పత్తులు సాధ్యం కావడం లేదు.

ఇదే సమయంలో అదే ఉత్పత్తులను కార్పొరేట్ సంస్థలు తక్కువ ధరకు మార్కెట్‌లో అందుబాటులోకి తెస్తున్నాయి. అవి ఆధునాతన యంత్రాలను (ఆటోమేషన్)వినియోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ వస్తు ఉత్పత్తి జరుగుతోంది. దీంతో కార్పొరేట్ సంస్థలతో ధరల్లో పోటీ పడే స్థాయి ఎంఎస్ఎంఈలకు ఉండటం లేదు. ఆ సమస్యలను సీఎఫ్‌సీల ద్వారా పరిష్కారం లభించనుంది. డిజైన్లు,పరిశోధన,

అభివృద్ధిఅత్యాధునిక సదుపాయాలు క్వాలిటీ కంట్రోల్ సెంటర్లునైపుణ్య శిక్షణముడిసరకు డిపోలు,ఉత్పత్తుల విక్రయాలు..మార్కెటింగ్ డిస్‌ప్లే సెంటర్లు పరిశ్రమలకు వచ్చే మరికొన్ని ప్రయోజనాలుడిజైన్లలో వచ్చే మార్పులు,టెస్టింగ్, శిక్షణ సహా విస్తృత శ్రేణి సేవలు అందుబాటులో ఉంటాయి.కామన్

నీటి శుద్ధి ప్లాంటు వ్యవస్థ ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌తో

పోటీ పడేలా ఉత్పత్తుల తయారీ వంటి సీఎఫ్‌సీల్లో ఉండే సౌకర్యాలుగా అధికారులు చెబుతున్నారు.

# విశాఖ ఆర్థిక ప్రాంత అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

**- క్లస్టర్లుగా ఈ ప్రాంతంలో ప్రాజెక్టుల అభివృద్ధికి బ్లూ ప్రింట్..**
**- విఇఆర్‌కు అవసరమైన పాలసీల రూపకల్పన - విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు..**

**విజయవాడ నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ ఉన్న విశాఖ ఆర్థిక ప్రాంత అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో వచ్చే పెట్టుబడులు, పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం అవసరమైన పాలసీలను రూపొందించాలని సూచనలు జారీ చేశారు. సోమవారం సచివాలయంలో జరిగిన విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి సీఎస్ కే.విజయానంద్, ఆర్థిక, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, పర్యాటక, ఐటీ , మున్సిపల్, పరిశ్రమలు, వ్యవసాయ, ప్రణాళికా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీఈఆర్ ప్రాంతం రాష్ట్రానికి గ్రోత్ హబ్ గా తీర్చిదిద్దే అంశంపై ముఖ్యమంత్రి వివిధ శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ ఉన్న వివిధ జిల్లాలను విశాఖ ఎకనామిక్ రీజియన్ గా అభివృద్ధి చేసే విషయంలో స్థానికంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు, ప్రజల జీవన ప్రమాణాలు, సుస్థిరాభివృద్ధి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనికి సంబంధించిన ఎకనామిక్ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని సీఎం స్పష్టం చేశారు. మొత్తం ఏడు అంశాల ఆధారంగా వీఈఆర్ గ్లోబల్ ఎకనామిక్ హబ్ గా మారుతుందని సీఎం వ్యాఖ్యానించారు. పోర్టుల ద్వారా కార్గో హ్యాండ్లింగ్ తో పెద్ద ఎత్తున లావాదేవీలు జరగాల్సి ఉందని అన్నారు. శ్రీకాకుళం మూలపేట పోర్టు నుంచి రీజియన్ లోని కాకినాడ పోర్టు వరకూ హింటర్ ల్యాండ్ లోని చత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్య ప్రదేశ్ లాంటి ప్రాంతాలకు చెందిన కార్గోను కూడా రవాణా జరిగేలా చూడాలని సూచించారు. మూలపేట పోర్టు నుంచి దుగరాజపట్నం పోర్టు వరకూ షిప్ బిల్డింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యేలా చర్యలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తర దక్షి ణాది రాష్ట్రాలను కలుపుతున్న ఏపీ ఇక ఈస్ట్ వెస్ట్ కారిడార్ గానూ మారాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 1215 మాన్యుఫాక్చరింగ్ నోడ్స్ కలిగిన ప్రాంతంగా విశాఖ ఎకనామిక్ రీజియన్ మారుతుందని అన్నారు. ప్రత్యేకించి ఈ రీజియన్ లో క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి ప్రాజెక్టులపై దృష్టి సారించాలని సీఎం సూచించారు. విశాఖ లాంటి ప్రాంతాలు నెక్స్ జెన్ ఐటీ డేటా సెంటర్ , ఏఐ ఇన్నోవేషన్ మారుతున్నాయన్నారు.ఈ రీజియన్ లోని ఇతర ప్రాంతాలు జాతీయ, అంతర్జాతీయ హెల్త్ కేర్ హబ్ గా మార్చాల్సి ఉందన్నారు. అలాగే ప్రణాళికా బద్దంగా పట్టణీకరణ హౌసింగ్ ప్రాజెక్టులు రావాల్సి ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో స్లమ్ క్లస్టర్ రీడెవలప్మెంట్ కోసం ప్రత్యేకంగా విధానాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# తిరుమల సమాచారం

## కొండపై ఉన్న సిసికెమెరాలు ఐసిసిసితో అనుసంధానం

- క్యూలైన్ల నిర్వహణ మరింత పటిష్టం - అదనపు ఇఒ వెంకయ్యచౌదరి




**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి రోజూ లక్షమందివరకు భక్తులు వస్తుండటంతో భద్రతను మరింత కట్టుదిట్టంచేసే స్థాయిలో టిటిడి అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు.ఇందులో భాగంగా దర్శన క్యూలైన్లను పటిష్టంగా నిర్వహించడంతోబాటు వైకుంఠం క్యూకాంప్లెక్స్,నారాయణగిరి షెడ్లు, లోపల,బయట క్యూలైన్లలోని సిసికెమెరాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. ఈ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మరింతగా బలోపేతం చేసేందుకు అధునాతన సాంకేతిక అభివృద్ధిచేసేందుకు చర్యలుతీసుకోవడంపై అధికారులతో ఆయన చర్చించారు. భక్తుల కదలికలపై ,భక్తుల గణాంకాలను ఎప్పటికప్పుడు విశ్లేషించి నిర్ణయాలు తీసుకుని సదుపాయాలు కల్పించేలా చూడాలన్నారు. సోమవారం తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, వింగ్ విఎస్ఒ ఎస్టీవిరామ్‌కుమార్, విఎస్ఒ అల్లంసురేంద్ర, ఐటి జిఎం ఫణికుమార్‌నాయుడు,డిప్యూటీ ఇఒ లోకనాథం, డిజిఎం ఐటి వెంకటేశ్వర్‌నాయుడు, కార్య ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు జయప్రసాద్,రవి తదితరులతో అదనపు ఇఒ వెంకయ్యచౌదరి సమీక్షించారు. విజిలెన్స్, వైకుంఠం, ఆలయ సిబ్బంది క్యూలైన్లలో భక్తుల సౌకర్యాలు, రద్దీ తదితరవాటిని నిరంతరం పర్యవేక్షించడం సులభమవుతుందన్నారు.

## స్వామివారి ఆశీస్సులందుకున్నా : జస్టిస్ రజని



**తిరుమల,నవంబర్ 10ప్రభాత వార్తప్రతినిధి:** కార్తీక మాసంలో సోమవారం రోజు శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం మన స్సు ఆనందంగా ఉందని రాష్ట్ర ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని తెలిపారు. విఐపి బ్రేక్‌లో ఆమె కుటుంబంతో కలసి ఆలయం లోనికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.

## తిరుమల, తిరుపతిలో భద్రత దళాలు నిఘా



**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** దేశరాజధాని ఢిల్లీనగరంలో సోమవారం సాయంత్రం ఎర్రకోటవద్ద భారీ బాంబులు పేలడంతో పుణ్యక్షేత్రాల్లో హై అలర్ట్ ప్రకటించింది. కేంద్ర హోంశాఖ ఆదేశాలతో రాష్ట్ర హోంశాఖ ఉన్నతాధికారులు తిరుపతి జిల్లా పోలీసులను అప్రమత్తం చేసింది. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆగమేఘాలపై తిరుమల,తిరుపతితోబాటు శ్రీకాళహస్తి క్షేత్రాల్లో పోలీస్ అధికారులను, ఏఆర్ బలగాలను, ఆక్టోపస్ దళాలను రంగంలోకి దించారు. తిరుమల ఆలయం పరిసరాల్లో మరింతగా నిఘా పెంచారు. తిరుమలకు వచ్చే అలిపిరి టోల్‌గేట్‌లో,కొండపై జిఎన్‌సి టోల్‌గేట్‌లో ఆక్టోపస్ దళాలు పహారాకాస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నారు.ఇదిలా ఉంటే ఇప్పటికే ఆధ్యాత్మిక నగరం, యాత్రాస్థలం తిరుపతినగరంలో గతంలో కొద్దిరోజులుగా నకిలీ మెయిల్స్ బాంబు బెదిరింపులు భయపెట్టాయి. వెంటనే పోలీసు అధికారులు, బాంబుడిస్పోజల్ టీమ్ పోలీసులు, పోలీసు జాగిలాలు అణువణువూ నిశితంగా తనిఖీలు చేశారు. ఎక్కడా ఎలాంటి బాంబులు లేవని తేలడంతో అంతా ఊపిరిపీల్చుకుంటున్నారు. తిరుమల తిరుపతి నగరం ప్రాముఖ్యతతో 24గంటలూ పోలీసు విభాగంఅప్రమత్తంగా వ్యవహరిస్తూ ఉంది. నగరం శివార్లలో, ప్రధాన వాణిజ్యసంస్థలు, హోటళ్ళు, లాడ్జీలు, స్టార్‌హోటళ్ళు, నగరానికి ప్రధాన ప్రవేశ కూడళ్ళు, నగరం అంతా అత్యాధునిక నిఘానేత్రాలు డేగకళ్ళతో పహారాకాస్తున్నాయి. ఈ నేపధ్యంలో సాంకేతిక పరిజ్ఞానం పోలీసులు మరింతగా వినియోగించుకుని ప్రజలకు భద్రత కల్పిస్తున్నారు. నగరంలో డ్రోన్ కెమెరాలతో కూడా పోలీసు యంత్రాంగం 24గంటలూ పహారాకాస్తోంది. ఇప్పుడు కేంద్రహోంశాఖ హెచ్చరికలతో మరింతగా అలర్ట్ అయ్యారు.

## నిందితుడి పట్ల ఉదాసీనత ఎందుకు చూపారు?

**- ఎఫ్ఐఆర్ తరువాత అరెస్ట్ చేయలేదెందుకు?**
**- పోలీసు అధికారులను విచారణ చేసిన సిఐడి**



**తిరుపతి,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో 2023 ఏప్రిల్‌నెలలో అమెరికన్ డాలర్లు చోరీ కేసుపై ఎఫ్ఐఆర్ చేసినా నిందితుడైన సివి రవికుమార్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేక పోయారని, ఈ కేసులో నిందితుడిపట్ల ఉదాసీనత చూపాల్సిన అవసరం ఏ ముందని సిఐడి అధికారులు పూర్వ తిరుమలలో పనిచేసిన ప్రస్తుత విఆర్‌లో ఉన్న సిఐ జగన్మోహన్‌రెడ్డిని, ఎస్ఐ లక్ష్మీరెడ్డిని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో మీపై ఎవరైనా ఒత్తిడి చేశారా,టిటిడి అధికారులు ,అప్పటి బోర్డు కలుగజేసుకుందా అనే ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. చట్టపరంగా మీకున్న అధికారాలను ఎందుకు ఉపయోగించుకోలేకపోయారని అడిగిన దానికి సమాధానం తీసుకున్నట్లు, ఈ వ్యవహారం మొత్తం పరకామణి కేసు దర్యాప్తు చేపట్టిన సిఐడి బృందం వీడియో రికార్డు చేసినట్లు తెలుస్తోంది. 2023 ఏప్రిల్‌లో పరకామణిలో గుమస్తాగా ఉన్న సివి రవికుమార్ ఏకంగా 920 విదేశీ డాలర్లు, 11నోట్లు చోరీ చేసిన తరువాత అప్పటి ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ ఫిర్యాదుపై ఎలా స్పందించారని వివరాలు సేకరించారు. తదనంతరం ఆధారాలు సేకరించి ఎఫ్ఐఆర్ చేసిన తరువాత చట్టప్రకారం నిందితుడ్ని ఎందుకు అరెస్ట్ చేయలేదనేది కీలకంగా వివరాలు రాబట్టడం విశేషం. పూర్తిస్థాయిలో ఆధారాలు ఎందుకు సేకరించలేకపోయారని, నిందితుడి నుండి సమగ్ర కేసు వివరాలు రాబట్టలేకపోవడం వెనుక ఆంతర్యమేమని ప్రశ్నించడం తెలుస్తోంది. అయితే ఏవిఎస్ఒ ఈ కేసులో ఫిర్యాదిదారుడు కావడంతో టిటిడి నిబంధనల మేరకు కేసులో మధ్యవర్తిత్వం జరిపి రాజీచేసుకునే పరిస్థితులు వివరించారని వెల్లడించినట్లు సమాచారం. చివరకు మూడునెలల్లోనే లోక్‌అదాలత్‌లో కేసు రాజీ చేసుకున్నారని ఈ తతంగం మొత్తం టిటిడి అధికారుల నుండి ఏవిఎస్ఒ వివరణమేరకు జరిగిందని పోలీస్ అధికారులు వివరించినట్లు తెలిసింది. పూర్వ టిటిడి విజిఒగా పనిచేసిన ప్రస్తుత డిఎస్పీ గిరిధర్ కూడా ఈ కేసులో కేవలం నిమిత్తమాత్రులమేనని,టిటిడిలో ఉన్నతాధికారులు, బోర్డు కీలకమని సిఐడి దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎవరికీ దురుద్దేశ్యం లేదని, టిటిడి అధికారుల సూచనల మేరకు అన్ని జరిగాయని పోలీస్ అధికారులు వివరించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు టిటిడి పూర్వ అధికారులను విచారణకు పిలుస్తారా లేక మళ్ళీ నిందితుడు రవికుమార్‌కు సంబంధించి పూర్తి వివరాలు సిఐడి బృందం దర్యాప్తు చేసి హైకోర్టుకు నివేదిక సమర్పించేందుకు త్వరత్వరగా ముందుకు కదులుతోంది. ఈ కేసులో గత పోలీస్ అధికారులను సిఐడి విచారణ చేయడంతో టిటిడిలో ఉలిక్కిపడుతున్నారు. రవికుమార్ ఆస్తుల వివరాలను సిఐడి సేకరించే పనిలో నిమగ్నమైంది. గత టిటిడి బోర్డు సభ్యులు, గత టిటిడి అధికారుల గుండెల్లో భయం పట్టుకుందని తెలుస్తోంది. రవికుమార్ పరకామణిలో ఎంతకాలంగా ఇలా విదేశీ కరెన్సీ దొంగతనం చేశాడనేది పోలీసులు సమగ్రంగా విచారణ చేయలేదనేది సిఐడి బృందం తేల్చిన ప్రధాన అంశం.

## 14న తిరుపతిలో కార్తీకదీపోత్సవం

**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీకమాసంలో తిరుపతిలో 14వతేదీ శుక్రవారం కార్తీకదీపోత్సవం నిర్వహిస్తున్నారు. టిటిడి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది కార్తీకదీపోత్సవాలను మహిళా భక్తులతో జరిపించడం పరిపాటి. ఈ ఏడాది శుక్రవారం ఈ కార్యక్రమానికి టిటిడి పరిపాలన భవనం మైదానాన్ని సిద్ధం చేస్తోంది.

వార్త

శ్రమతో సంపాదించిన సంపదను అనుభవించడంలో ఉన్నంత మాధుర్యం మరొకటి లేదు. శ్రమించే వారున్నచోటే సంపద ఉంటుంది.

-గోథే

# వీధి కుక్కల బెడద తప్పేనా?

నడిరోడ్డు మీద స్వైరవిహారం చేసే కుక్కల భారినపడకుండా తప్పించుకోగలిగిన మానవ మాత్రుడెవరూ ఉండరు. వీధి కుక్కల నియంత్రణపై పదేపదే తర్జన భర్జన పడటం తప్పడం లేదు. వీధి కుక్కలపై సుప్రీంకోర్టు మరోసారి జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. వీధి కుక్కల బారినపడి రేబిస్ వ్యాధితో మృతిచెందిన కొన్ని కేసులగురించి ఇప్పటికే న్యాయస్థానం ముందుకు రావడంతో గతంలో ఒకసారి సుప్రీంకోర్టు తీవ్రంగా ఆలోచించి కొన్ని కీలకనిర్ణయాలు ప్రకటించింది. అయినప్పటికీ ప్రభుత్వ సంస్థలు కలిసి రాకపోవడం, నిష్క్రియాపర్వాతం కారణంగా తమ తొలి ఆదేశాలు పట్టించుకోకపోవడంతో ధర్మాసనం కాస్త ఆగ్రహించినా కొత్తగా మార్గదర్శకాలు జారీ చేసింది. పౌరుల భద్రత, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారి రక్షణ రీత్యా ఈ కొత్త మార్గదర్శకాలు వీధికుక్కల బెడదను కాస్తయినా తగ్గించే వీలుంది. విద్యాసంస్థలు, బస్ స్టేషన్లు, రైల్వే ప్రాంగణాలు, క్రీడా సముదాయాల్లో ఎక్కడపడితే అక్కడ వీధి శునకాలు ప్రత్యక్షమవుతుంటాయి. వాటిని ఏమాత్రం అదిలించినా వాటి పక్కనే వెళ్తున్నప్పుడు 'తమ మీదకే వస్తున్నారేమోనన్న' భీతి కలిగినా అవి మానుషుల మీద దాడి చేస్తున్నాయి. ఈ కారణంతో రోజూ వీధి కుక్కల కాట్లకు ఆస్పత్రులపాలైన ఘటనలు ఎన్నో నమోదవుతున్నాయి. అరుదుగా కాదు తరచుగా అత్యంత కీలకంగా ఉన్న ప్రాంతాల నుండి అత్యవసరంగా వీధికుక్కలను షెల్టర్లకు తరలించాలి. వాటిని సంతానోత్పత్తి నియంత్రణ శస్త్ర చికిత్స చేసిన తర్వాత తిరిగి అవి నివసిస్తున్న పాత ప్రాంతంలో వదిలిపెట్టరాదు. వీధి కుక్కల స్వైర విహారాల గురించి చెప్పుకోవాలంటే శనివారం ఒక్కరోజే హైదరాబాద్ నగరంలోని బాలానగర్‌లో కనీసం 25 మందిని వీధికుక్కలు కరిచాయి. ఆయా ప్రాంతాలన్నీ జనసమ్మర్ధంగా ఉంటాయి. అలాంటి చోట చిన్న సంఘటనలేమీ నమోదవవు. భీతిల్లి ఎక్కువ మందినే కరచుకుంటూ వెళ్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు జాతీయ రహదారుల శాఖ, స్థానికసంస్థలు, హైవే గస్తీ బృందాలు తమ ఆదేశాలను తక్షణమే అమల్లోకి తేవాలని సుప్రీం ధర్మాసనం జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ సందీప్‌మెహతా, జస్టిస్ ఎన్.వి అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని తేల్చి చెప్పిన ధర్మాసనం ప్రభుత్వ సంస్థలను కూడా హెచ్చరించింది. రెండు వారాల్లోగా ఈ చర్యలను చేపట్టాలని కోరింది. ఆయా ప్రధాన సంస్థలకు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. సాధారణంగా రాష్ట్రప్రభుత్వాలు ఆర్థిక భారం పేరిట వీధి కుక్కల నియంత్రణకు నిధుల్లేవనే సాకుతో మిన్నకుంటాయి. ఈసారలా కాదు. సుప్రీం కోర్టు పర్యవేక్షణలోనే ఈ కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుంది. కనుక నిధుల్లేవనే సమస్య ఎదురు కాబోదు. అందుచే ఈ సంస్యకు ఒక పరిష్కారం దొరుకుతున్నట్లే. యానిమల్ బర్త్ కంట్రోల్ నిబంధనల ప్రకారం వాటికి వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించడం ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నట్లు ఆయా సంస్థల అధికార్లు ప్రతి మూడు నెలలకోసారి నిర్దేశిత జనసమర్థ ప్రాంతాలను తనిఖీచేయాల్సి ఉంటుంది. ఆ ప్రాంతంలో కుక్కలు లేవని నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రాంతంలో కుక్కలను దూరప్రాంతానికి తీసుకుపోయినా మరో ప్రాంతం నుంచి కొత్తకుక్కలు అక్కడకు చేరతాయని, అది నిబంధనలకు విరుద్ధమని కొందరు అభ్యంతరం వ్యక్తం చేసినా కోర్టు తోసిపుచ్చింది. ఇదే సందర్భంలో రోడ్లపై స్వైర విహారం చేసే పశువుల్ని కూడా ఎనిమిది వారాల్లోగా నియంత్రించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రానురాను వీధికుక్కల సమస్య పెరిగిపోవడంతో సుప్రీం ఆదేశాలు అమలు చేయకతప్పని పరిస్థితిఏర్పడింది. కేంద్రప్రభుత్వ గణాంకాల ప్రకారం గత సంవత్సరంలో సగటున రోజుకి 10వేల మందిని కరిచాయి. దేశవ్యాప్తంగా 2024లో 37,15,713 కుక్క కాటు కేసులు నమోదైనాయి. 2025 జనవరిలోనే 4.29 లక్షల మంది వీధికుక్కల బారినపడ్డారు. 2022-24ల మధ్య అత్యధిక కుక్కకాటు కేసులు నమోదైన పది రాష్ట్రాలలో మహారాష్ట్ర (13.5లక్షలతో) ప్రథమ స్థానంలోఉంది. తెలంగాణ3.33 లక్షల కేసులతో ఎనిమిదో స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే రేబిస్ మరణాల్లో 36శాతం భారతదేశానివే. ఇంకా విశేషంగా చెప్పాలంటే మన దేశ జనాభా కన్నా వీధిశునకాలు ఎక్కువగా ఉన్నాయి. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటుఆస్పత్రులు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లను నిల్వ ఉంచుకోవాలి. తమ ప్రాంగణాలు శుభ్రంగా ఉంచుకుని, వీధికుక్కలు ప్రవేశించకుండా చూసేందుకు ఆయా సంస్థలు నోడల్ అధికారిని నియమించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చినమార్గదర్శకాల జాబితాలో ఉంది. ప్రాంగణాల చుట్టూ ప్రహారీలు, కంచెలు, గేట్లనిర్మాణంవంటి పనులను 8వారాల్లోగా నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించింది. కుక్కల నియంత్రణలో స్థానికసంస్థలు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నా అనేక కారణాల రీత్యా అవేమీ అమలు జరగడం లేదు. ఒకవేళ ఔత్సాహిక యాజమానికార్యనిర్వాహంగా చురుకుగాఉన్న చోట్లవీటిని పాటించినా ప్రజల్నుంచి ప్రభుత్వంనుంచి తగు ఒత్తిడిఉంటే తప్ప ఇలాంటివి ముందుకుసాగే కార్యక్రమాలు కాబోవు. గతంలోనే ధర్మాసనం ప్రభుత్వఉద్యోగుల కాలనీల్లో కుక్కకాటుకు గురవుతున్న ప్రజల ఆక్రందనలు వినిపించుకుని కఠిన నిర్ణయాలు తీసుకుంది. ప్రజలు, ప్రభుత్వాలు, ప్రభుత్వసంస్థలుమూకుమ్మడిగా కుక్కల నియంత్రణకు నడుం కడితేతప్ప కుక్కల భారినుంచి జనాన్ని కాపాడుకోవడం సాధ్యంకాదు.



విజ్ఞానం సాధించువారు ధన్యులు. బంగారాన్ని సంపాదించడం కంటే విజ్ఞానం సంపాదించడం మంచిది.

రవీంద్రనాథ్ ఠాగూర్



ప్రమాణము అంటే వెనుకంజ వేయని నిశ్చయబుద్ధి, దృఢమగు నిశ్చయం లేకపోతే అభివృద్ధికి అవకాశమే ఉండదు.

మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



## రసాయన పరిశ్రమలే ఆధారం

రసాయన పరిశ్రమలు దేశఅభివృద్ధికి వెన్నెముక. వ్యవసాయం నుంచి ఔషధాలు, ప్లాస్టిక్‌లు, విద్యుత్ పరికరాల వరకు మన దైనందిన జీవితంలో ఉపయోగించే అనేక వస్తువులకు ఇవేఆధారం. అయితే, ఈరసాయన పదార్థాల స్వభావం సున్నితమైనది. ఇవి అగ్ని, ఉష్ణోగ్రత, ఒత్తిడి, లేదా ఇతరరసాయనాలతో కలిసినప్పుడు అసాధారణంగా ప్రతిస్పందిస్తాయి. అందుకే ఈ పరిశ్రమల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఇటీవల గుజరాత్‌లో అగ్ని ప్రమాదం, ఆంధ్రప్రదేశ్‌లో గ్యాస్‌లీక్, తమిళనాడులో నిల్వ లోపాలవల్ల పేలుడు వంటిఘటనలు భద్రతా నియమాలు కేవలం పుస్తకాల్లో కాకుండా, ప్రతిరోజు ఆచరణలో ఉండాలని స్పష్టం చేశాయి. మార్పు, అవగాహన, అప్రమత్తతే ఇందుకు పరిష్కారం. ప్రతి రసాయన పరిశ్రమలో మొదటగా ప్రమాద విశ్లేషణ చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఉచిత ప్రయాణం పేద విద్యార్థి హక్కు

ప్రభుత్వం మహిళల పేరిట ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు పరిచింది. వెంటనే ఈ ఉచిత ప్రయాణ వసతిని తొలగించాలి. ఉచిత బస్సుప్రయాణం పేద విద్యార్థులకు చెందవలసిన హక్కుమాత్రమే కానీరాజకీయ వ్యూహాలతో అనవసర పథకాలు పెట్టాల్సిన పనిలేదు. పథకాలు పేదవాడికి భరోసానివ్వాలి కానీ భారాన్ని మిగల్చొద్దు. కాబట్టి ఈ పథకాన్ని రద్దుపరిచి దీని స్థానంలో పేద విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి.

- కాల్వ నిఖిత, సిద్ధిపేట

## ఇతర దేశాలపై ఆధారపడడం తగ్గించాలి

భారత ఐటీరంగం ఎంతోవేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బి వీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియామకాలనుపెంచడం, రిమోట్ డెలివరీ విధానాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ద్వారా సంస్థలు తమస్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదే సమయంలో స్వదేశీ ప్రతిభను పెంపొందించడం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం.

- ఎన్.రామకృష్ణ, నెల్లూరు జిల్లా

## చారిత్రక నిర్మాణాలను సంరక్షించాలి

తెలంగాణ చరిత్రలో కాకతీయుల యుగం ఒక సువర్ణయుగం. ఆ కాలంలో నిర్మించిన దేవాలయాలు, గోపురాలు, కోటలు, బావులు ఆ కాలపు శిల్పకళా ప్రతిభకు నిదర్శనాలు. ఇటీవల కాకతీయుల కాలానికి చెందిన ఒకపురాతన బావి పునరుద్ధరించబడింది. ఈబావి శతాబ్దాలుగా నిర్లక్ష్యానికిగురై మట్టిలో కూరుకుపోయి, కాలగర్భంలో కనుమరుగైపోయింది. ఇప్పుడుఅది తిరిగి తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. పురావస్తుశాఖ, స్థానిక ప్రజల సహకారంతో ఈ బావిని శుభ్రపరచి, శిల్పాలను పునరుద్ధరించారు. రాతిబండలపై చెక్కిన కళాత్మక నమూనాలు, నీటి నిల్వకు చేసిన సాంకేతిక ఏర్పాట్లు కాకతీయుల కాలపు ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఈ బావి కేవలం నీటి వనరుగా కాకుండా, ఆ కాలపు ప్రజల సాంస్కృతిక, సామాజిక జీవన విధానాలకు అద్దం పడుతుంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## కార్మికులకు ఉపాధి కల్పించాలి

ఉపాధి హామీలో ప్రస్తుతం తెలంగాణ పరిస్థితి పైకి బాగానే కనిపిస్తున్న లోపల పురుగులన్నవి. పనులను తగ్గించడం, అనుమతించే పనులను తగ్గించడం ఇక్కడ చూడొచ్చు. గత ఉద్యమం ఫలితంగా సాధించుకున్న తెలంగాణలో కొంత నీటి వసతి పెరిగింది కదా. మరి పల్లెర్లు మొలిసిన నెలలో పంటలు సాగు చేస్తాం అని రైతన్నలు అంటుంటే రాష్ట్రం వద్దు అంటున్నది. బీడుభూమిని సాగులోకితెద్దాం అనుకున్నరైతన్నకు నిరాశే మిగులుతుంది. ప్రభుత్వం వెంటనే భూమి చదును కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలి. కనీసం రాష్ట్రప్రభుత్వానికి కొంత చారిత్రక భౌగోళిక స్పృహ అయిన ఉండాలి కదా. సాంకేతికత పేరుతో కార్మికులను పనికి దూరం చేసే పని జరుగుతుంది.

- భారత అవినాష్, జనగామ

## బస్‌స్టాప్‌లను ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్సీఎస్టీ బీసీ మైనారిటీ ప్రతి గురుకులం దగ్గర తప్పకుండా బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలి. తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఉన్నత అధికారులు బస్‌స్టాప్ ఏర్పాటు చేసినట్లయితే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, గురుకుల సిబ్బందికి, చుట్టుపక్కల పరిసర గ్రామాల ప్రజలకు సౌకర్యార్థంగా ఉంటుంది. బస్‌స్టాప్ షెడ్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులను విడుదల చేయాలి. వెంటనే నిర్మాణం చేపట్టి విద్యార్థులకు ప్రయాణం సౌకర్యం కల్పించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

# పత్తి కొనుగోళ్ల నిబంధనలు తొలగించాలి!

*గతంలో ఆంధ్రా, తెలంగాణలో ఇలాంటి కుంభకోణాలు వందలాది కోట్ల రూపాయల్లో జరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో 2017-18, 2018-19 మధ్యలో పత్తి కొనుగోళ్లలో రూ.400 కోట్లు అవినీతి జరిగినట్లు సిబిఐ అధికారులు గుర్తించారు. ఇలాంటి అవినీతే ఆంధ్రప్రదేశ్‌లో కూడా జరిగింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, ఎటువంటి వంకలు లేకుండా రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, నష్టపోయిన పత్తిధర రైతులకు ఎకరాకు 25వేలు నష్టపరిహారం ఇవ్వాలని, ఏడు క్వింటాళ్ల కొనుగోలు నిబంధన విరమించాలని, క్వింటాల్ ఉత్పత్తికి 10 వేల మద్దతుధర ప్రకటించాలని, దిగుమతి పత్తిపై 30శాతం సుంకం విధించాలని, పత్తి దిగుమతిని పరిమితం చేయాలని, పత్తిరైతులకు బ్యాంకులు ఇచ్చిన పంటరుణాలు రద్దుచేయాలని రెండు రాష్ట్రాల రైతాంగం ఉద్యమించాలి.*

బొల్లిముంతసాంబశివరావు

రెండు తెలుగు రాష్ట్రాల్లో పత్తిరైతులు తీవ్రసంక్షోభంలో ఉన్నారు. ఒకప్పుడు తెల్లబంగారంగా, రైతాంగానికి సిరులపంటగా పేరుపొందిన పత్తిసేద్యం, నేడు రైతాంగానికి ఉరితాడుగా మారుతూ ఉంది. సేద్యపు ఖర్చులు పెరగడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోవటం, గిట్టుబాటు ధర లభించకపోవటం, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల చేయూత లేకపోవటం అందుకు కారణంగా ఉంది. నేడు భారీవర్షాల వల్ల రెండు రాష్ట్రాల్లో మిగిలిన పంట అమ్ముకోవటానికి రైతాంగం తీవ్ర అవస్థలు పడుతున్నారు. భారతదేశంలో పత్తిసాగు విస్తీర్ణం 120.55 లక్షల హెక్టార్లు. ప్రపంచంలో మొత్తంసాగు విస్తీర్ణంలో ఇది సుమారు 36 శాతంగాఉంది. పత్తిసాగులో దేశం మొదటి స్థానంలో ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఉంది. అయినా భారతదేశ అవసరాలకు సరిపోక దిగుమతులు తప్పనిసరి అయ్యాయి. అమెరికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా చైనా దేశాల నుండి దిగుమతులు చేసుకుంటున్నాం. పత్తి దిగుబడుల్లోనూ భారత దేశం బాగా వెనకబడి ఉండటమే అందుకు కారణం. ప్రపంచ వితన పత్తి సగటు దిగుబడి హెక్టార్కు 1,670 కిలోలు. భారతదేశంలో సగటు దిగుబడి హెక్టార్కు 500 కిలోలు. చైనాలోప్రపంచ సగటు దిగుబడికన్నా రెట్టింపు ఎక్కువ. పత్తికి కేంద్రప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర ఎప్పుడూ రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా లేదు. అది రైతు ప్రయోజనాలను కాకుండా బడాపారిశ్రామికవేత్తల ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటుందన్నది వాస్తవం. ప్రస్తుతం పత్తిమద్దతు ధర క్వింటాలుకు 8,110గా ఉంది. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం10,075 రూపాయలు ఉండాలి. స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధరలు ప్రకటిస్తున్నామని కేంద్రప్రభుత్వం చెప్పటంలో ఉన్న మోసం పత్తి మద్దతు ధర ప్రకటన బట్టబయలు చేస్తున్నది. భారతదేశం ప్రతిసంవత్సరం లక్షల బేళ్ల పత్తిని దిగుమతి చేసుకుంటున్నది. ఈ సంవత్సరం మూడు లక్షలబేళ్ల పత్తి దిగుమతి అయ్యింది. ట్రంప్, పశ్చిమదేశాల వత్తిడికిలొంగిన కేంద్ర ప్రభుత్వం పత్తిదిగుమతులపై పూర్తిగా సుంకాన్ని ఎత్తివేసింది. ఫలితంగా విదేశాల నుండి పెద్దఎత్తున పత్తి దిగుమతులు పెరిగాయి. దిగుమతుల వల్ల దేశంలో పత్తి రేట్లు తగ్గుతాయి. ప్రపంచ మార్కెట్లో ప్రస్తుతం క్వింటాల్ గింజ పత్తి ధర 5,720 రూపాయలు. భారతదేశం దిగుమతి సుంకం విధిస్తే దేశంలో దిగుమతి పత్తి ధర ఇంకా ఎక్కువ ఉండేది. అలా చేయకపోవడంతో దిగుమతి పత్తి ధర తక్కువగా ఉండటంతో టెక్స్‌టైల్ మిల్లుల యజమానులు విదేశాల పత్తినే కొనుగోలు చేస్తున్నారు. దీన్ని గమనిస్తే కేంద్ర ప్రభుత్వానికి దేశ రైతుల ప్రయోజనాల కన్నా విదేశీ పత్తికంపెనీల ప్రయోజనమే ముఖ్యమని చెప్పకనే చెబుతున్నది. పత్తి దిగుమతుల వల్ల భారతపత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 45.32 లక్షల ఎకరాల్లో 24.12 లక్షల మంది రైతులు పత్తిసాగు చేస్తున్నారు. వీరిలో 70శాతం మంది చిన్న,సన్నకారు రైతులే. పత్తి మద్దతు ధరను క్వింటాల్‌కు 7720 నుంచి 8110 రూపాయలుగా కేంద్రం ప్రకటించింది. ప్రతి సంవత్సరం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మద్దతు ధర ఇచ్చి కొనుగోళ్లు చేస్తానని ప్రకటిస్తూ ఉంది. ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో మూడువారాలు ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది. ఎకరాకు 11.74 క్వింటాళ్ల పత్తిదిగుబడి వస్తుందనే వ్యవసాయశాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం, ఎకరాకు 12క్వింటాళ్ల పత్తి కొను



గోళ్లు ప్రారంభించింది. అకస్మాత్తుగా ఎకరాకు 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు చేయాలని రాష్ట్ర అధికారులకు సీసీఐ సమాచారం ఇచ్చింది. సీసీఐ నిర్ణయంవల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆంధ్రప్రదేశ్లో 4.56 లక్షల ఎకరాల్లో పత్తిసాగు జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. సుమారు 8 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని భావించారు. భారీవర్షాల వల్ల దిగుబడి భారీగా తగ్గింది. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లకు 30కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీసీఐ తెలిపింది. పత్తివిక్రయానికి ముందుగా రైతుసేవా కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలి. సిఎంయాప్ ద్వారా రైతు వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత కపాస్ కిసాన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈ రాష్ట్రంలో కూడా ఎకరాకు7 క్వింటాళ్లకే కొనుగోలు పరిమితం చేసింది. కొంతమంది రైతులకు ఎకరాకు12 క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడి వస్తున్నది. సీసీఐ నిర్ణయం రైతులను వ్యాపారుల దోపిడీకి గురిచేస్తుంది. భారీవర్షాలు, తుఫాన్ల వల్ల దిగుబడి ఏడు క్వింటాళ్లకు తగ్గిందని, అందుకు అనుగుణంగానే కొనుగోలు ఎకరాకు ఏడు క్వింటాళ్లకు తగ్గించడం జరిగిందని తన నిర్ణయాన్ని సీసీఐ సమర్థించుకుంది. ఈ సమర్థనలో వాస్తవం లేదు. ఎందుకంటే విదేశాల నుంచి పెద్ద ఎత్తున పత్తి దిగుమతి కావడం అందుకు కారణం కాబట్టి. పత్తి కొనుగోళ్లకు కూడా సీసీఐ అనేక నిబంధనలు పెట్టింది. తేమ శాతం 12 మించగూడదని, రంగుమారిన పత్తిని కొనుగోలు చేయమని, 12శాతం తేమకంటే ఎక్కువ తేమ ఉంటే ఆ మేరకు ధర తగ్గిస్తామని పేర్కొంది. భారీ వర్షాలకు తెలంగాణలో పత్తి తడిచిపోయి తేమశాతం ఎక్కువగా ఉంది. రైతుల ప్రయోజనం కోరే ఏ ప్రభుత్వమైనా తుఫాన్ సందర్భంగా తడిచిన పంటలను మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుంది అనటానికి సీసీఐ పత్తికొనుగోలుకు విధించిన నిబంధనలే చాలు. అసలే సంక్షోభంలో ఉన్న పత్తి రైతులు సీసీఐ నిబంధనలతో మరింత నష్టపోయి వారి సంక్షోభం తీవ్రమోతుంది. రైతు సీసీఐ కేంద్రాల్లో పత్తి అమ్ముకోవాలంటే కేంద్రప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్‌లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆయా యాప్‌లో స్లాట్ బుక్‌చేసుకుంటేనే సీసీఐ అధికారులు రైతులనుండి పత్తికొనుగోలు చేస్తారు. అలా చేసుకోవాలని చాలా మంది రైతులకు తెలియదు. అలా చేసుకోలేని రైతులు సీసీఐ కేంద్రాల్లో అమ్ముకోలేక ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముతున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నామమాత్రపు పత్తికొనుగోళ్లకే పరిమితం చేస్తూ వస్తున్నది. ఇప్పుడు కూడా ఆ బాటలోనే నడుస్తున్నది. మద్దతుధర ఇవ్వటానికి అనేక వంకలు పెట్టి నిరాకరిస్తున్నది. నేడు రెండు రాష్ట్రాల్లో తేమ, రంగు మార్పు పేరుతో మద్దతు ధరలో తగ్గించి ఇస్తున్నది. ఫలితంగా క్వింటాల్‌కు6,500లోపే రైతుకు దక్కుతున్నది. సీసీఐ పెట్టిన నిబంధనలు, మద్దతుధరలో తగ్గింపువల్ల విసిగిపోయిన రైతాంగం ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పత్తి కొనుగోలులో సీసీఐ విఫలమైనప్పుడు మద్దతు ధరకు రైతుల నుండి పత్తి కొనుగోళ్లు రాష్ట్రప్రభుత్వాలు చేపట్టాలి. రెండు తెలుగురాష్ట్ర ప్రభుత్వాలు అలాంటి బాధ్యత తీసుకోలేదు. వ్యాపారులు, సీసీఐ అధికారులు కుమ్మక్కై పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు దారితీసింది. రైతుల నుంచి సీసీఐ కొనటానికి నిరాకరించిన పత్తిని వ్యాపారులు రైతుల నుండి చౌకగా కొనుగోలుచేశారు. అలాకొన్న పత్తిని అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతుల పేరుతో పత్తి పండించినట్లు నకిలీపత్రాలు సృష్టించి తిరిగి సీసీఐకే మద్దతుధరకు అమ్ముతున్నారు. గతంలో ఆంధ్రా, తెలంగాణలో ఇలాంటి కుంభకోణాలు వందలాది కోట్ల రూపాయల్లో జరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో 2017-18, 2018-19 మధ్యలో పత్తి కొనుగోళ్లలో రూ.400 కోట్లు అవినీతి జరిగినట్లు సిబిఐ అధికారులు గుర్తించారు. ఇలాంటి అవినీతే ఆంధ్రప్రదేశ్లో కూడా జరిగింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, ఎటువంటి వంకలు లేకుండా రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, నష్టపోయిన పత్తిధర రైతులకు ఎకరాకు 25వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, ఏడుక్వింటాళ్ల కొనుగోలు నిబంధన విరమించాలని, క్వింటాల్ ఉత్పత్తికి 10 వేల మద్దతుధర ప్రకటించాలని, దిగుమతి పత్తిపై 30శాతం సుంకం విధించాలని, పత్తి దిగుమతిని పరిమితం చేయాలని, పత్తిరైతులకు బ్యాంకులు ఇచ్చిన పంటరుణాలు రద్దుచేయాలని రెండు రాష్ట్రాల రైతాంగం ఉద్యమించాలి. ●

# సామాజిక మాధ్యమాలకు బానిసలవుతున్న యువత


కామిడి సతీష్ రెడ్డి

నేడు యువత సామాజిక మాధ్యమాల బారిన పడి విలువైన భవిష్యత్‌ని సర్వనాశనం చేసుకుంటూ వున్నారు. కొంత మందికి క్రికెట్ అంటే పిచ్చి. స్నేహితులతోకలిసి ఐపీఎల్‌లో ప్రతి క్రికెట్ మ్యాచ్ తిలకించిన తర్వాతసెల్‌ఫోన్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లోకి ప్రవేశించి పందేలు కట్టడం వంటి ఆరోపణలు వినవస్తూ వున్నాయి. ఆరంభంలో నగదు రావడంతో మరింత ఉత్సాహం చూపిస్తారు. తరువాత పందేల్లో రూ.వేల నగదు పోగొట్టుకున్న సందర్భాలున్నాయి. తొలుత బంధువులు, తెలిసినవారి వద్ద అప్పులు చేయడం, నగదుకోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకున్న తర్వాత బకాయిలు పెరిగిపోవడంతో చోరీలకు దిగి పోలీసులకు చిక్కిపోతూ వున్నారు. అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్‌తో సమస్త ప్రపంచాన్ని వీక్షించే అవకాశంవచ్చింది. తాము చదివే కోర్సులకు సంబంధించి సమాచారాన్ని సేకరించి, జ్ఞానాన్ని విస్తృతం చేసుకుంటున్నారు. కొందరు మాత్రం సామాజిక మాధ్యమాలు, క్రికెట్ బెట్టింగ్‌లు, ఓటీటీల్లో సినిమాల వీక్షణతో కాలక్షేపంచేస్తూ జీవితాన్ని బలిచేసుకుంటున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు సెల్‌ఫోన్‌లను ఎక్కువగా వాడతారు. తల్లిదండ్రులు కొనిస్తే అప్పటి నుంచి వానిని రోజూ రాత్రి ఫోన్లో ఓటీటీ ప్లాట్‌ఫాం, యాప్‌లలో వీడియోలు చూడటం, నిద్రపోకుండా తెల్లవారుజామున రెండు, మూడు గంటల వరకు సెల్‌ఫోన్ చూస్తూ గడిపేస్తున్నారు. రాత్రి నిద్రపోకపోవడం వల్ల ఉదయం తరగతి గదిలో మత్తుగా ఉండి అధ్యాపకులు చెప్పే పాఠాలు వారికి అర్థం కావడం లేదు. ఏకాగ్రత దెబ్బతిని చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కరోనా లాక్‌డౌన్ కారణంగా ఇంట్లోనే ఉండాల్సి రావడం, ఖాళీసమయం ఎక్కువగా లభించడంతో యువత ఓటీటీలు, యాప్‌లు చూడటానికి అలవాటుపడ్డారు. ఓటీటీలో కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో అశ్లీల సన్నివేశాలు, సంభాషణలు నేరుగా ప్రసారమవుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి సెన్సార్‌షిఫ్ లేకపోవడంతో వీటిని చూసి పిల్లలు, యువత పాడైపోతున్నారని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హింసాత్మక, లైంగిక కార్యకలాపాల దృశ్యాలు నేరుగా ప్రసారం అవుతుండటంతో యువత తీవ్రంగా ప్రభావితమై చెడిపోతున్నారు. విద్యార్థులు ఏకాగ్రత దెబ్బతిని సరిగా చదువుపై దృష్టిసారించలేకపోతున్నారు. తలనొప్పి, కంటచూపు ఇతర అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. యాంత్రిక జీవనంలో సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోతున్నారు. నైతికవిలువలు, ప్రమాణాలు దిగజారిపోయి అడ్డదారులు తొక్కుతున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. జల్సాలకు అలవాటు పడి ఈ దందాలోకి దిగినట్లు పోలీసుల విచారణలో తేలుతుంది. ఎనిమిది నుంచి పది గంటలు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లలో సినిమాలు, వీడియోలు చూడటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. పిల్లలు, యువతలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తలనొప్పి, కంటిచూపు సమస్యలు వస్తున్నాయి. మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. మత్తుపదార్థాల సేవనానికి అలవాటుపడి బానిసలై నగదు కోసం నేరాలకు దిగడంచాలా ఆందోళనకరం. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వచ్చిన తర్వాత పోలీసులు నిఘాపెట్టి పట్టుకోవడం కష్టసాధ్యంగా మారింది. ఐపీఎల్ సమయంలో పెద్దఎత్తున బెట్టింగ్‌లలో యువత భారీఎత్తున నగదు పోగొట్టుకున్నారు. రూ.లక్షల అప్పు చేసి తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతూ తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగుల్చుతున్నారు. సెల్‌ఫోన్‌ను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. విద్యార్థులు, యువత పలురకాల ఆటలు ఆడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. వారికి ఇష్టమైన కళలో శిక్షణ ఇప్పిస్తే రాణిస్తారు. యోగ, ధ్యానం సాధన చేయించడం ద్వారా ఏకాగ్రత సాధిస్తారు. పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి పెట్టి దారితప్పక ముందే వారు సన్మార్గంలో నడిచేలా చూడాలి. తల్లిదండ్రులు ఎంత తీరిక లేకుండా ఉన్నా పిల్లలకు మాత్రం తగిన సమయం కేటాయించాలి. వారితో ప్రేమగా మాట్లాడి ఇష్టాయిష్టాలు తెలుసుకోవాలి. మంచి, చెడు గురించి వివరంగా చెప్పాలి. సానుకూల దృక్పథంలో ఆలోచించేలా వుండాలి. ●

# విద్యా హక్కు పరిరక్షణ అందరి బాధ్యత

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రతి సంవత్సరం నవంబర్ 11న దేశవ్యాప్తంగాజాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. దీన్నే రాష్ట్రీయ శిక్షా దివస్ అని కూడా పిలుస్తారు. దేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మోలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా పాటిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక మన దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ పనిచేశారు. 1947 నుంచి 1958 వరకు తన బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించారు. భారతదేశానికి మొదటి ఉప రాష్ట్రపతిగా కూడా ఆయన సేవలందించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని2008నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. మోలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజు సందర్భంగా విద్యా హక్కు పరిరక్షణ గురించి ఆలోచించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. విద్యను ప్రాథమిక హక్కుగా చేశారు. విద్యాహక్కు చట్టం హామీ ఇచ్చిన విధంగా వీరందరికీ వాళ్ల వయసుకు తగిన తరగతిలో చేర్పించి విద్యనందించడమూ ఒక సవాలే. యునిసెఫ్ ప్రకారం దాదాపు సగం మంది ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడిమాని వేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55 శాతం షెడ్యూల్డ్ తెగల్లో 63శాతం దాకా ఉందని అంచనా. విద్యను పొందడం మాత్రమే హక్కు కాదు, సరైన ఉపాధ్యాయుడి వద్ద విద్యను అభ్యసించడం కూడా హక్కే. కాలం ఎంతగా మారినా మన సమాజం ఉత్తమ ఉపాధ్యాయులను అధికంగా తయారు చేయలేకపోతుందనేది సత్యం. సాధారణ ఉపాధ్యాయుడు పాఠాల్ని బోధిస్తాడు. మంచి ఉపాధ్యాయుడు వాటిని వివరిస్తాడు. ఉత్తమ ఉపాధ్యాయుడు విశదీకరిస్తాడు. గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తిని అందిస్తాడు. గురువుల బోధనతోనే విద్యార్థులు ప్రపంచాన్ని తెలుసుకుంటారు. ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రపంచంలో సుమారు 80 కోట్ల మంది నిరక్షరాస్యులు ఉండగా అందులో 23.8 కోట్ల మంది మనదేశంలోనే ఉన్నట్లు వెల్లడైంది. నాణ్యమైన విద్యనందించడం ద్వారా ప్రతి ఒక్కరూ అవసరమైన స్థాయిలో చదువు నేర్చుకుని, తర్వాతి తరగతిలోకి ప్రవేశించగలిగేలా చేయాల్సిన బాధ్యత పాఠశాలపై ఉంటుందనీ చట్టం పేర్కొంటోంది. న్యూటన్, పైథాగరస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదలైన వారు ఆదర్శంగా నిలిచారు. విశ్వామిత్రుడు, సాందీపుడు, పరశురాముడు, ఆదిశంకరా చార్యులు, ద్రోణాచార్యులు, పరమహంస మొదలైన వారంతా పేరొందిన గురువులు. విద్య అనే ఆస్తిని సమానంగా పంచగల శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంది. ప్రజాదరణ, అపారమైన గౌరవం ఉన్న కారణంగానే ఎంతోమంది ఉపాధ్యాయులు




నాయకులయ్యారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక అధ్యాపకుడు భారత దేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన ఘనత ఆయనకే చెల్లింది. ఆయన పుట్టిన రోజును మనదేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటాము. ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా పదవీకాలం ముగియగానే చెన్నైలోని అన్నా విశ్వ విద్యాలయంలో అధ్యాపకుడిగా చేరారు. బోధన చేస్తూనే ఆయన తుదిశ్వాస విడిచారు. యావత్ ప్రపంచానికి ఆయన గొప్ప సందేశాన్ని అందించారు. నీతివంతమైన జీవనానికి అలవాటుపడే విద్యార్థులను ఉపాధ్యాయులుతీర్చిదిద్దగలగాలి. సమాజాలు మారొచ్చు, సిద్ధాంతాలుమారొచ్చు. కానీ విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య సంబంధం శాశ్వతమైనది. ఈ విషయాన్ని యువ ఉపాధ్యాయులు గుర్తుంచుకోవాలి. విద్యార్థుల భవిష్యత్‌పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సమాచారం అందివ్వడంతోనే ఉపాధ్యాయుడి పాత్ర ముగియదని నిజానికి ఉపాధ్యాయుడు రకరకాల నైపుణ్యాల్ని విద్యార్థులకు అందించవలసి ఉంటుందని కొఠారి కమిషన్ పేర్కొంది. జాతి నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత కీలకపాత్ర పోషించేది గురువే అవుతాడు. అనేక మంది గురువులు విద్యార్థుల మదిలో ప్రముఖ స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్య దేవోభవ అన్నారు పెద్దలు. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టే వారు తమ వృత్తిని ప్రేమించే లక్షణం కలిగి ఉండాలి. తాము భావిపౌరులను తీర్చిదిద్దుతున్నామనే భావనఉండాలి. విద్యార్థి ఎగిరే గాలిపటం అయితే దానికి ఆధారమైన దారంగురువు. ఉపాధ్యాయులు తమ మేధోసంపత్తిని పెంపొందించుకోవాలి. తమ జీవిత కాలంలో కనీసం నాలుగు తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. వృత్తి నైపుణ్యాల పెంపు, కంప్యూటర్ వినియోగం, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను నిర్వహించాలి. బాలబాలికల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషిచేయాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మార్చలేని గతాన్ని గురించి ఆలోచించవద్దు.. చేతిలోఉన్న భవిష్యత్తు కోసం శ్రమించు అనేవారు. ఉపాధ్యాయ లోకం కానీ రిమోట్ లెర్నింగ్ అందించడానికి, వెనకబడుతున్న విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి, అభ్యాస అంతరాలను తగ్గించేలా ఉపాధ్యాయుల కృషి పరంగా ఇది చాలా కీలక సమయం. విద్య భవిష్యత్తును, బోధనావృత్తిని రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యం. ఉపాధ్యాయుడు తన బోధనా పద్ధతుల్ని పునః సమీక్షించుకొని తదనుగుణంగా విద్యార్థులను నవ సమాజానికి అందించాలి. ఒకప్పుడు గుమాస్తాలను తయారుచేసే విధంగా విద్యా లక్ష్యం వుండేది. నేడు సామాజిక ప్రాధాన్యతలు మారిపోయాయి. దేశానికి పరిశోధకులు కావాలి. వ్యక్తుల స్వభావాన్ని, సామర్థ్యాన్ని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ప్రవచించిన అబ్దుల్ కలాం పలుకులకు సార్థకత చేకూర్చాలి. నేటి యువ ఉపాధ్యాయులు అందుకు కంకణ బద్ధులై వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించాలి. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

Main tab page 111_Main tab page 111.qxd 11/10/2025 11:12 PM Page 1






## జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందం

**ఒంగోలు, ప్రభాతవార్త**

మొంథా తుఫాన్ నష్టాన్ని పరిశీలించేందుకు ప్రకాశం జిల్లాలో నలుగురు సభ్యుల కేంద్ర బృందం సోమవారం పరిశీలించింది. కలెక్టరేట్ లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. నష్ట తీవ్రతను తెలియజేసేలా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ వీక్షించారు. వీడియో ప్రదర్శన ద్వారా నష్టాన్ని కలెక్టర్ పి.రాజాబాబు వివరించారు. జిల్లా వ్యాప్తంగా నష్టం జరిగినట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్, రాష్ట్ర అగ్రి మిషన్ వైస్ చైర్మన్ లు పాల్గొన్నారు.



ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలి

- ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు

**కనిగిరి, నవంబర్ 10, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం లక్ష్మక్కపల్లి పంచాయతీ పరిధిలోని లింగన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదగా ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరువతో వెనుకబడిన ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. స్థానిక యువతకు విస్తృతంగా ఉద్యోగావకాశాలు లభించి, ఈ ప్రాంత ఆర్థిక ప్రగతికి దారితీస్తాయి అని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామీణ పారిశ్రామిక వికాసానికి దోహదం చేస్తున్నాయి. ఈ పార్కు ద్వారా కనిగిరి పరిసర ప్రాంతాల్లో కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, కేఎస్ఎస్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవాన్ని ఘన విజయవంతం చేయాలి

- డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి

**కనిగిరి, నవంబర్ 10, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండలం లక్ష్మక్కపల్లి పంచాయతీ పరిధిలోని లింగన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదగా ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరువతో వెనుకబడిన ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. స్థానిక యువతకు విస్తృతంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఈ పార్కు ఈ ప్రాంత ఆర్థిక దృశ్యాన్ని పూర్తిగా మార్చివేయగలదు అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తీసుకుంటున్న దూరదృష్టి నిర్ణయాలు గ్రామీణ పారిశ్రామిక వికాసానికి కొత్త ఊపు ఇస్తున్నాయి. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుతో కనిగిరి పరిసర ప్రాంతాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కేఎస్ఎస్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్స వాన్ని జయప్రదం చేయాలని శ్యామల కాశిరెడ్డి పిలుపునిచ్చారు.

## ఏపి లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా పి శివారెడ్డి

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా పిడుగు శివారెడ్డి నియమితులైయ్యారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ పార్టీ అధినాయకుల ఆశీస్సులతో రాష్ట్రస్థాయి డైరెక్టర్‌గా నియమితులు కావడం శుభ పరిణామమని, ఇలాంటి పదవులు భవిష్యత్తులో మరెన్నో పొంది ప్రజలకు మంచి సేవ చేయాలని గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి నాంది: ఎమ్మెల్యే ఉగ్ర

**- ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభం**

**కనిగిరి, నవంబర్ 10, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం లక్ష్మక్కపల్లి పంచాయతీ పరిధిలోని లింగన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ లింగన్నపాలెంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు కనిగిరి నియోజకవర్గానికి అభివృద్ధి దిశగా ఒక కొత్త మైలు రాయిగా నిలుస్తుంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల విస్తరణకు ఇది దోహదం చేస్తుంది. ముఖ్యంగా స్థానిక యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెనుకబడిన ఈ ప్రాంతం ఆర్థికంగా బలపడడానికి ఇది కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టికి నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామిక ప్రగతిలో వేగంగా ముందుకు సాగుతోంది. గ్రామీణ పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడానికి ఈ ఎంఎస్ఎంఈ పార్కు ఒక ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్స వాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపునిచ్చారు.



# కొత్తపట్నం మండలంలో నష్టాన్ని పరిశీలించిన కేంద్రబృందం







**కొత్తపట్నం, నవంబర్ 10, ప్రభాతవార్త**

మొంథా తుఫాన్ వలన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులతో నియమించిన కమిటీ సోమవారం జిల్లాలో పర్యటనలో భాగంగా కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామాన్ని పర్యటించింది. పౌసుమి బసు, మహేష్ కుమార్, శశాంక్ శేఖర్ రాయ్ , శ్రీ సాయి. భగీరత్ లతోపాటు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకార్ జాన్ కూడా వచ్చారు. కేంద్ర బృందం అల్లూరులోని వరి పొలాలను సందర్శించింది. మీరు నిలిచిపోవడం వలన వేర్లతో సహా కుళ్ళిపోయిందని రైతులు వాపోయారు అంతా అనుకూలిస్తే సంక్రాంతి సమయానికి పంట చేతికొచ్చేదని, ఇప్పుడు పరిస్థితి తారుమారైపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు వరి దుబ్బులను తెచ్చి చూపించగా మొత్తం కోల్పోయారు గా అని కేంద్ర బృందం సభ్యులు సైతం ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అల్లూరు చెరువును బృందం పరిశీలించింది. తుఫాన్ సమయంలో ఈ చెరువు కట్టకు గండి పడే పరిస్థితి తలెత్తగా, జిల్లా యంత్రాంగం అప్రమతమై పరిస్థితిని అదుపులోకి తెచ్చిన తీరును వారు పరిశీలించారు. నీటి ఉధృతికి ఈ మార్గంలోని కల్వర్టు దెబ్బతిని నా విధానాన్ని ఇంజనీరింగ్ అధికారులు ఈ సందర్భంగా వారికి వివరించారు. మ్నోథా తుఫాన్ వలన కలిగిన నష్టాన్ని అర్థం చేసుకోగలమని కేంద్ర బృందం తెలిపింది. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం గురించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని భరోసా ఇచ్చింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. రాజబాబు, జాయింట్ కలెక్టర్, ఆర్.గోపాలకృష్ణ, మండలంలోని అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు





**- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు**

**కనిగిరి, నవంబర్ 10, ప్రభాతవార్త**

పీసీపల్లి మండలం గుంటూరు లింగన్నపాలెంలో మంగళవారం జరగబోయే ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమం నేపధ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొనబోయే పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ సోమవారం బందోబస్తు బ్రీఫింగ్ నిర్వహించారు. బందోబస్తు విధులు సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమం ప్రారంభం నుండి ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహారించాలని సూచించారు. హెలిప్యాడ్, కాన్వాయ్ మార్గం, పైలాన్, సభా ప్రాంగణం ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహారించాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్ కేటాయించిన ప్రదేశాల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రోన్లు, సీసీ కెమెరాల సహాయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. పర్యటన భద్రతా బాధ్యతల్లో ఇద్దరు ఏఎస్పీలు, ఎనిమిది డీఎస్పీలు, 20 సీఐలు, 49ఎస్సైలతో పాటు మొత్తం 800 మంది పోలీసులు, హోం గార్డులు, భద్రతా సిబ్బంది పాల్గొంటారని ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ సౌకర్యార్థం ఆరు మొబైల్ బైక్ పెట్రోలింగ్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ నుండి సభా ప్రాంగణం వరకు ముఖ్యమంత్రి కాన్వాయ్ ట్రయల్ రన్‌ను పరిశీలించిన ఎస్పీ, బందోబస్తు నిరాటంకంగా కొనసాగి పర్యటన విజయవంతం కావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# భక్తిశద్ధలతో అయ్యప్పస్వామి మహాపడి భజన

**చీమకుర్తి, నవంబర్ 10, ప్రభాతవార్త**

చీమకుర్తి హరిహర క్షేత్రంలో ఆదివారం రాత్రి మాజీమంత్రి శిద్దా రాఘవ రావు దంపతులు, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహా పడిభజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. స ర్వ దీక్ష స్వాముల అయ్యప్ప స్వామి కీర్తనలతో స్వామి వారి మహా పూజ ఘనంగా నిర్వహించారు గోపాల్ గురు స్వామి,ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో జరిగిన మహా పడి పూజ లో సర్వ దీక్ష స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ గార్ల అయ్యప్ప స్వామి సేవా సమాజం ఆధ్వర్యంలో స ర్వ దీక్షా స్వాములకు బిక్ష అందచేసారు. ఈ కార్యక్రమంలో శిద్దా సుధాకర్ దంపతులు, చీమకుర్తి పరిసర ప్రాంతాలను చెందిన సర్వ దీక్షా స్వాములు, వాసవి మహిళలు, చీమకుర్తి కి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.







## ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

**- రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి కోటపాటి జనార్ధన్‌రావు**

**కనిగిరి, నవంబర్ 10, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం లక్ష్మక్కపల్లి పంచాయతీ పరిధిలోని లింగన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదగా ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కోటపాటి జనార్ధన్‌రావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభం ప్రకాశం జిల్లాకు ఒక చారిత్రాత్మక మలుపు. వెనుకబడిన ప్రాంతాలకు పారిశ్రామిక అవకాశాలు తీసుకురావడమే కాకుండా, వేలాది మంది యువతకు ఉపాధి లభించడానికి ఇది నాంది అవుతుంది అని పేర్కొన్నారు. అలాగే, కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషి సహకారంతో ఈ ప్రాజెక్టు సాకారమైందని ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా ముందంజలో నిలుస్తుంది. ఎంఎస్ఎంఈ పార్కు వంటి ప్రాజెక్టులు గ్రామీణ అభివృద్ధికి దోహదపడతాయి. కార్యక్రమాన్ని జయప్రదం చేయడం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత అని కోటపాటి జనార్ధన్‌రావు పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై పాల్గొనాలని ఆయన కోరారు.

## ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

**- మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్‌రెడ్డి, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి పిలుపు**

**కనిగిరి, నవంబర్ 10, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం లక్ష్మక్కపల్లి పంచాయతీ పరిధిలోని లింగన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ ఎంఈ పార్కు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు దారపునేని చంద్రశేఖర్‌రెడ్డి, అలాగే పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి సోమవారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషితో వెనుకబడిన ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. స్థానిక యువతకు విస్తృతంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి అని పేర్కొన్నారు. ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, కేఎస్ఎస్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇద్దరు నాయకులు పిలుపునిచ్చారు.

## 12 వ తేది వైఎస్సార్సీపీ ర్యాలీలను జయప్రదం చేయండి

**- కోటి సంతకాలతో ప్రభుత్వం కళ్ళు తెరిపించుదాం..**

**ఒంగోలు, ప్రభాతవార్త**



వైఎస్సార్ సీపీ అధినేత జగనన్న పిలుపుతో మెడికల్ కాలేజీ లు ను ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ జరుగుతున్న కోటి సంతకాల ఉద్యమం విజయవంతం కోసం 12 వ తేది అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో తలపెట్టిన ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్‌ను వైకాపానాయకులు ఆవిష్కరణ చేశారు. కోటి సంతకాలు సేకరణలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో 60 వేలుకు తగ్గకుండా సంతకాలు సేకరణ చేయాలని పిలుపిచ్చారు. 17 మెడికల్ కాలేజీలను చంద్రబాబు సర్కార్ దురాశతో ప్రైవేట్ పరం చేయాలనుకోవడం దుర్మార్గపు చర్య అని, పేద కుటుంబాల నుండి కూడా డాక్టర్లు రావడానికి అవకాశం కల్పిస్తూ జగనన్న దూరదృష్టితో మెడికల్ కాలేజీలు తీసుకొస్తే, వాటిని చంద్రబాబు సర్కార్ కాసులకు కక్కుర్తి పడి ప్రైవేట్ పరం చేయడం ఆపేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ జరిపి గవర్నర్‌కు నివేదించాలని కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ప్రజలకు అవగాహన కోసం 12 వ తేది అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో చేపట్టిన ర్యాలీ ని జయప్రదం చేయాలని కోరారు. సంతనూతలపాడు మండల పార్టీ అధ్యక్షులు దుంపా చెంచి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు బొట్లా రామారావు, నాయకులు దుంపా యల్లమందా రెడ్డి, ఎంపీటీసీ షేక్ రహంతుల్లా, జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దుంపా అజయ్ రెడ్డి జిల్లా వాలంటీర్ విభాగం కార్యదర్శి తన్నీరు ఆంజనేయులు, మండల యూత్ ఉపాధ్యక్షులు కుంచాల ఆంజనేయులు, తన్నీరు మోహనరావు, ఆడకా వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్విస్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు క్విస్ ఫార్మసీ కళాశాల, డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వికసిత భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. దాంట్లో భాగంగా వారం రోజుల పాటు స్థానిక వెంగముక్కపాలెంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటిరోజు సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోల్ మేయర్ గంగాడ సుజాత పాల్గొని సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. విద్యార్థులను ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగం చేసి, వారికి సేవాగుణం అలవాటు చేయడం చాలా సంతోషంగా ఉందని మేయర్ ఈ సందర్భంగా అన్నారు. ఎన్ ఎస్ ఎస్, ఎన్ ఎస్ కేసి ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలు చేస్తున్నామని, విద్యార్థుల్లో సేవా భావం పెపొందించడం కోసం ఇలాంటి ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు వెంగముక్కపాలెంలోని రోడ్లను విద్యార్థులు శుభ్రం చేసి, శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధనామూర్తి, స్టెప్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వ దీక్ష స్వాములకు బూచేపల్లి అన్న ప్రసాద సంతర్పణ

**చీమకుర్తి, నవంబర్ 10, ప్రభాతవార్త**



మానవ సేవయే మాధవ సేవగా తమ తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని దర్శి ఎమ్మెల్యే జిల్లా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. చీమకుర్తి బూచేపల్లి కళ్యాణ మండపంలో సర్వ దీక్ష స్వాములకు అన్న దాన కార్యక్రమాన్ని ప్రత్యేక పూజలు చేసి సోమవారం ప్రారంభించారు. బూచేపల్లి ట్రస్ట్ చైర్మన్, జెడ్పి చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కార్యక్రమాన్ని టెంకాయ కొట్టి ప్రారంభించారు. తొలుతగా కళ్యాణ మండపం ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి, కనకదుర్గ భవాని అమ్మవారి భారీ చిత్రపటాలకు సకల దేవతలకు పూజలను శివాలయం అర్చకులు సోమరాజు పల్లి రాఘవేంద్ర శర్మ నిర్వహించారు. స్వాములు పడి భజన నిర్వహించారు. గణపతి పూజ, శివ పూజ, అయ్యప్ప స్వామి పూజ, కనకదుర్గమ్మ పూజలను బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి వారి సతీమణి నందిని, చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ లు నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గురు స్వాములు సకల దీక్షలు తీసుకున్న స్వాములు భక్తులు విచ్చేశారు. బూచేపల్లి దంపతులు స్వామివారి శరణాలు చెబుతూ స్వాములకు స్వయంగా భోజనం వడ్డించారు. దీక్షలు అయిపోయే వరకు అన్న దాన సంతర్పణ నిర్వహిస్తామని శివప్రసాద్ రెడ్డి తెలిపారు.



# సత్వరం పంట నష్టపరిహారం అందజేయాలి

**బల్లికురవ, నవంబర్ 10, ప్రభాతవార్త**
తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పందించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినంలో భాగంగా తహసీల్దార్ రవి నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా మండలంలో రైతులు పండించిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ముఖ్యంగా మొక్కజొన్న, పత్తి, చెరుకు పంటలు వేసిన రైతులు నష్టపోవడం జరిగిందన్నారు. ముఖ్యంగా కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, కౌలు రైతు గుర్తింపు కార్డుతో సంబంధం లేకుండా వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సత్వరం తహసీల్దార్ రవి నాయక్ స్పందిస్తూ వ్యవసాయశాఖ నుండి వచ్చిన పంట నష్టం వివరాలు ఆధారంగా పంట నష్టపోయిన రైతుల జాబితా ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, వీరయ్యలు పాల్గొన్నారు.



# గ్రంధాలయ నిర్వహణ గాలికి

**- అద్దెభవనాల్లోనే కొనసాగుతున్న వైనం**

**- పోటీ పరీక్షలకు సిద్దమయ్యే అభ్యర్థులకు అందని విజ్ఞానం**

**పుల్లలచెరువు, నవంబర్ 10, ప్రభాతవార్త**
నిరుద్యోగ యువతకు ఉపయోగకరంగా ఉండేలా ఉండాల్సిన గ్రంధాలయం గత కొన్నేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకు గదిలో పుల్లలచెరువు బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో అద్దె భవనంలో ప్రస్తుతం గ్రంధాలయ నిర్వహణ కొనసాగుతోంది. దీంతో పలు పోటీ పరీక్షలకు సిద్దమయ్యే అభ్యర్థులు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో చదువుకుని విద్యార్థులు ఈ గ్రంధాలయానికి వెళ్లలేకపోతున్నారు. ఫలితంగా వారికి విజ్ఞానం అందని ద్రాక్ష గానే మిగులుతుంది. అందరికి అందుబాటులో ఉండే స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రంధాలయాన్ని కొనసాగించాలని గతంలో నిర్వాహకులు పలుమార్లు సూచించినా పాలక పక్షం నాయకులు, పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో అద్దె భవనంలోనే ఈ గ్రంధాలయ నిర్వహణ కొనసాగుతుంది. గతంలో గ్రంధాలయం భవన నిర్మాణం కోసం ప్రభుత్వం లక్షల రూపాయలు నిధులు విడుదల చేసినా ఇక్కడి అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం గ్రంధాలయం ఎక్కడా అనే ప్రశ్న మిగులుతుంది. ప్రభుత్వ స్థలాలు వందల ఎకరాలు ఉన్నప్పటికి గ్రంధాలయానికి స్థల సేకరణ చేయకపోవడం గ్రంధాలయం ఏర్పాటును గాలికొదిలేయడంపై యువకులు, నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రంధాలయం నిర్వహణను పట్టించుకోవాలని, తాత్కాలికంగా పంచాయతీ కార్యాలయంలో అయినా గ్రంధాలయం కొనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

**- మార్కాపురంలో 18న జాబ్ మేళా**


**మార్కాపురం, నవంబర్ 10, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నవంబరు 18వ తేదీన మార్కాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జే రవితేజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 10 బహుళ జాతీయ కంపెనీలు ఈ మేళాలో పాల్గొననున్నాయని తెలిపారు. మార్కాపురం నియోజకవర్గం సహా మొత్తం ప్రకాశం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల, పదవ తరగతి నుండి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10వేల నుండి రూ.25వేల వరకు జీతభత్యాలు అందించబడనున్నాయని రవితేజ తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఎస్‌కే ఫిరోజ్ గాంధీ (మొబైల్: 70139 50097)ను సంప్రదించవచ్చని తెలిపారు.




# దశాబ్దాలుగా విద్యుత్తు స్తంభాలకు నోచుకోని ఎస్సీ కాలనీ

**- మార్కాపురంలో ప్రజల ఆవేదన**

**మార్కాపురం, నవంబర్ 10, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని స్థానిక శ్రీకర్ హాస్పిటల్ ఎదురు బజారులో ఉన్న ఎస్సీ కాలనీకి దశాబ్దాలుగా విద్యుత్తు స్తంభాల ఏర్పాటు జరగకపోవడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బజారులో సుమారు 15 కుటుంబాలు నివాసం ఉంటున్నప్పటికీ, ఇప్పటికీ విద్యుత్తు లైన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని వారు పేర్కొన్నారు. గత 30 సంవత్సరాలుగా పక్క బజారులో ఉన్న విద్యుత్తు స్తంభాలకు కనెక్షన్లు తీసుకొని తమ అవసరాలను తీర్చుకుంటున్నామని కాలనీ వాసులు తెలిపారు. సాయంత్రం వేళల్లో విద్యుత్తు లైన్ల కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గత ప్రభుత్వాలు, అధికారులు తమ విన్నపాలను పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిసారి ఈదురుగాలులు, వర్షాలు వచ్చినప్పుడు పక్క బజారు నుండి వచ్చే తీగలు తెగిపోవడం వల్ల తరచుగా విద్యుత్తు అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ప్రత్యక్షంగా చొరవ తీసుకొని విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేసి తమ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు.



# అటవీ శాఖ అమరవీరులకు ఘన నివాళులు

**మార్కాపురం, నవంబర్ 10, ప్రభాతవార్త**
మార్కాపురం అటవీ శాఖ డివిజన్ కార్యాలయంలో మార్కాపురం రేంజర్ పిచ్చిరెడ్డి అధ్యక్షతన శనివారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రారంభంలో అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి వారి త్యాగాలను స్మరించారు. అనంతరం రేంజర్ పిచ్చిరెడ్డి మాట్లాడుతూ అటవీ సంరక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమైనవని వారి ఆత్మస్ఫూర్తి మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అటవీ సంపదను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజనల్ కార్యాలయ సిబ్బంది, అటవీ అధికారులు, అటవీ కార్మికులు పాల్గొని అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళులు అర్పించారు. వృక్ష సంరక్షణ, అటవీ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ సిబ్బంది ప్రతిజ్ఞచేశారు.



# రైతు సేవా కేంద్రాల ఎదుట రైతుల పడిగాపులు

**కొమరోలు, నవంబరు 10 ప్రభాతవార్త**
మండలంలోని కొమరోలు రైతు సేవా కేంద్రం ఎదుట రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి సోమవారం నెలకొంది. ఉదయం 11గంటలైనా రైతు సేవా కేంద్రాలు తలుపులు తెరుచుకోకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన రైతులు కార్యాలయం ఎదుట నిరీక్షించాల్సి పరిస్థితి ఏర్పడింది. సచివాలయా లలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించేలా చూడాలని ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.



# ఘనంగా కార్తీక సోమవారం వేడుకలు

**బల్లికురవ, నవంబర్ 10, ప్రభాతవార్త**
అత్యంత పవిత్రమైన కార్తీక సోమవార వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మూడవ సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి అభిషేకాలలో పాల్గొన్నారు. హిందూమతంలో కార్తీక మాసం పరమ పవిత్రమైంది. పరమ శివునికి అత్యంత ప్రీతిపాత్రమైంది కార్తీక మాసం. ప్రత్యేకించి కార్తీక సోమవారాలలో శివ భక్తులు మహాదేవుడిని మరింత భక్తి భావంతో ఆరాధిస్తుంటారు. సూర్యోదయానికి పూర్వమే బ్రాహ్మీ ముహూర్తంలో స్నానమాచరించి హరహర మహాదేవ శంభో అని మహాదేవుడిని కీర్తిస్తే సమస్త పాపాలు హరించుకుపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కొనిదేనలోని నాగేశ్వరస్వామికి మహాహారతి కార్యక్రమం కొనసాగింది. ఈ కారణంగా మండలంలోని శైల క్షేత్రాలు శివనామస్మరణతో పులకించిపోయారు. కొణిదెనలోని బ్రహ్మగుండానికి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలి వెళ్లి పవిత్ర స్నానాలు ఆచరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రసిద్ధ క్షేత్రమైన కోటప్పకొండకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వెళ్లారు.



## పశ్చిమ ప్రకాశాన్ని విస్మరించిన కేంద్ర బృందంపై రైతు సంఘం ఆగ్రహం

**మార్కాపురం, నవంబర్ 10, ప్రభాతవార్త**
ముంథా తుఫాన్ ప్రభావాన్ని అంచనా వేసే కేంద్ర బృందం పశ్చిమ ప్రకాశం జిల్లాను విస్మరించడం పట్ల రైతు సంఘం తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సెల్ సమావేశంలో రైతు సంఘం నాయకులు అడ్మినిస్ట్రేటివ్ అధికారి రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత నెల రోజులుగా కురిసిన అతివృష్టి, ముంథా తుఫాన్ ప్రభావంతో పశ్చిమ ప్రకాశం జిల్లాలోని అన్ని మండలాల్లో పత్తి, మిరప, పొగాకు, కంది వంటి పంటలకు తీవ్ర నష్టం సంభవించినట్లు వారు పేర్కొన్నారు. మార్కాపురం, పెద్దారవీడు, దోర్నాల, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, కంభం, తర్లపాడు మండలాల్లో రైతులు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు వేసినా, వాటన్నింటి వర్షపునీటిలో కరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అప్పుల ఊబిలోకి నెట్టబడ్డారుని, ఏ ఒక్క పంట చేతికందే పరిస్థితి లేదన్నారు. అయినప్పటికీ కేంద్ర బృందం ఒంగోలు పరిసర ప్రాంతాలకే పరిమితమై పశ్చిమ ప్రకాశాన్ని పక్కన పెట్టడం తీవ్ర అన్యాయం అని రైతు సంఘం జిల్లా నాయకుడు దగ్గుపాటి సోమయ్య పేర్కొన్నారు. గత సంవత్సరం కూడా పత్తి, మిరప పంటలకు గిట్టుబాటు ధరలు రాకపోవడంతో పశ్చిమ ప్రకాశం రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు నమోదయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఈ సారి నష్టపరిహారంగా మిరప, పత్తి పంటలకు ఎకరానికి కనీసం రూ.50,000 చెల్లించేలా కేంద్ర బృందం సిఫారసు చేయాలని, వెంటనే పశ్చిమ మండలాల్లో పర్యటన నిర్వహించాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, మార్కాపురం మండల కార్యదర్శి గంగిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, గాదంశెట్టి వెంకటేశ్వర్లు, వెన్న వెంకటేశ్వర్ రెడ్డి, గాలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరించిన అన్నా కృష్ణచైతన్య

**మార్కాపురం, నవంబరు 10,ప్రభాతవార్త**
మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం నిర్వహిస్తున్న ర్యాలీ ప్రచార పోస్టర్‌ను గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు తనయుడు అన్నా కృష్ణచైతన్య శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఈ నెల 12వ తేదీన మార్కాపురం నియోజకవర్గ కేంద్రంలో జరగబోయే ర్యాలీని జయప్రదం చేయాలని, మెడికల్ విద్యను సామాన్య ప్రజల అందుబాటులో ఉంచేందుకు అందరూ భారీ ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## నేడు గంగపాలెం గ్రామంలోని ఇండస్ట్రియల్ పార్కును

**వర్చ్యువల్ విధానంలో శంఖుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**యర్రగొండపాలెం, నవంబరు 10, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం మండలం గంగాపాలెం గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు (ఎంఎస్ఈఎం) కోసం దాదాపుగా 40 ఎకారాలకుపైగా భూమి కేటాయింపు జరిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ప్రతిపాదనతో పారిశ్రామిక కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా కేటాయించిన ఈ ఇండస్ట్రియల్ పార్కును ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు 11వతేదీ ఉదయం వర్చ్యువల్ విధానంలో శంఖుస్థాపనచేయనున్న సందర్భంగా యర్రగొండపాలెం నియోజక వర్గ తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, ఇంచార్జ్ సబ్ కలెక్టర్‌వెంకటరామిరెడ్డి, తహాశీల్దారు మంజునాధ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి బండారు శ్రీనీవాసారావుతో కలిసి అక్కడి 40ఎకారాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ యర్రగొండపాలెం మండలంలోని గంగాపాలెం గ్రామం ఇండస్ట్రియల్ ఏర్పాటుకు ప్రణాళికాబద్ధమైన ప్రాంతమని అందుకే అధికారుల సూచనల మేరకు ఇక్కడ ఈ భూమి అన్ని రకాలుగా అణువుగా ఉంటుందని ఈ ప్రాంతం ఎన్నుకోవాడం జరిగిందని అన్నారు. గంగాపాలెం గ్రామానికి మహార్దశ పట్టినట్లేనని ఇక్కడ గిడ్డంగులకు సంబందించిన పలు రకాల ఉత్పత్తుల పంపిణీ కేంద్రాలకు అణువుగా ఉంటడమే కాకుండ ఇతర పరిశ్రమలకు అవసరమైన భూమి ఇక్కడ ఉందని, అందుకే అధికారుల సూచన మేరకు ఇదే సరైన స్థలమని కెటాయింపుకు సన్నద్ధం చెశామని తెలిపారు. ఇక్కడ పట్టణానికి తగ్గకుండగా రోడ్లు, రవాణా సౌకర్యాలు, ఇతర మౌలిక సదుపాయాలు బోలేడు కలిగి ఉంటాయని పెర్కొన్నారు. ఈ పార్కు నిర్మాణం జరిగితే ఆర్థికాభివృద్ధి ప్రోత్సహంతోపాటు , ఉద్యోగాలను సృష్టించడానికి సహాయపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలుశాఖలకు సంబందించిన అధికారులతో పాటు,మార్కెట్ యార్డు చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగల్‌రెడ్డి, బీసీ నాయకులు సత్యానారయణగౌడ్,ఎస్టీ నాయకులు మంత్రునాయక్, గంగపాలెం ఇండస్ట్రియల్ ఏరియా నాయకులు చలమయ్య, మాగులూరి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.







## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమీషన్ మెంబర్‌గా నియమితులైన గౌతమ్ రాజ్

**త్రిపురాంతకం, నవంబర్ 10,ప్రభాతావార్త**
యర్రగొండపాలెం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజ్ రాష్ట్ర ఎస్ సి కమిషన్ మెంబర్‌గా నియమితులయారు. రాష్ట్ర ఎస్సి కమీషన్ మెంబర్ గౌతమ్ రాజ్‌కు ఎర్రగొండపాలెం జనసేనపార్టీతరఫున, అభిమానులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు, మరెన్నో ఉన్నతమైన పదవులు అలంకరించాలని ఆశభావం వ్యక్తం చేశారు.

## లబ్దిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముత్తుముల

**కంభం, నవంబరు 10 ,ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం మంజూరైన లబ్దిదారులకు నియోజక వర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం గిద్దలూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో చెక్కులను అందజేశారు. మండలంలోని తురిమెళ్ళ గ్రామానికి చెందిన సంజీవరెడ్డి భార్యదొరిసెల సుజాతకు, కొమరోలు శేఖర్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్దిదారులు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కులను మంజూరు చేయించిన నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డికి, మండల, గ్రామ టిడిపి నాయకులకు లబ్దిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంభం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తోట శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ మల్లికార్జున, గ్రామ పార్టీ అధ్యక్షులు నారిశెట్టి కరుణాకర్, బూత్ ఇన్‌చార్జి ఎడవల్లి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.




## సీఎం సభను విజయవంతం చేద్దాం

**- టీడీపీ మండల నాయకులు కూరాకు వెంకట్**



**హనుమంతునిపాడు, నవంబర్ 10, ప్రభాతవార్త**
పీసీపల్లి మండలంలోని గుంటూరు లింగన్నపాలెం గ్రామంలో అభివృద్ధి ప్రదాత కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తలపెట్టిన ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేడు ఉప ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారని ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ మండల నాయకులు ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కూరాకు వెంకట్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

# శివనామస్మరణతో శివాలయాలు

**తాళ్లూరు,నవంబర్ 10,ప్రభాతవార్త**
హరహరమహాదేవ శంభో శంకర అంటూ మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా తెల్లవారుజామున నుంచే మహిళలు ఆలయాలకు చేరుకొని కార్తీకదీపాలు వెలిగించారు. గుంటి గంగా భవాని సన్నిధిలో ఉన్న మల్లికార్జున స్వామి( బ్రహ్మసూత్రం ) మాధవరంలో పురాతన శివాలయంలో నీలకంఠేశ్వర స్వామి కి పూజారులు ఎన్‌కామేశ్వర శర్మ,బెల్లంకొండశ్రీనివాస్‌శర్మలు శివునికి పంచామృతాలతో అభిషేకంప్రత్యేక అలంకరణ చేపట్టారు.మండలంలోని బొద్దికూరపాడు, శివరాంపురం,తాళ్లూరు,లక్కవరం, గ్రామాల్లోని శివాలయాల్లో శివునికి పంచామృతాలతో అభిషేకం చేశారు.



# సంగమేశ్వరుణ్ణి దర్శించుకున్న దామచర్ల సత్య

**పొన్నలూరు,నవంబర్ 10, ప్రభాతవార్త**
కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని చెన్నిపాడు గ్రామ సమీపంలోని సంగమేశ్వర దేవస్థానంలో వేంచేసి ఉన్న సంగమేశ్వర స్వామిని రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య దర్శించుకున్నారు. దేవస్థాన అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక అభిషేకాలు,పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కొండపి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస వనభోజనాల కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.



# దామచర్ల సత్యను సన్మానించిన నాయకులు

**పొన్నలూరు,నవంబర్ 10, ప్రభాతవార్త**
కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని చెన్నిపాడు గ్రామ సమీపంలోని సంగమేశ్వర దేవస్థానంలో వేంచేసి ఉన్న సంగమేశ్వర స్వామిని రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు ఆయనకు శాలువాలు కప్పి , పుష్ప గుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.



# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సరైంది కాదు



**తాళ్లూరు, నవంబర్ 10,ప్రభాతవార్త**
రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం సరైంది కాదని దోసకాయలపాడు సర్పంచ్ కోట శివ లక్ష్మి ్మ, వెంకట రామిరెడ్డి అన్నారు. సోమవారంమండలం లోని దోసకాయల పాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి ఆదేశాలు మేరకు మెడికల్ కళాశాలల ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతు మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పి విద్యను వ్యాపారం చేయాలనుకుంటున్నారని, దీంతో పేదింటి పిల్లలు డాక్టర్లుగా ఎదిగే అవకాశం లేకుండా పోతం దన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పోటీలకు పాత సింగరాయకొండ విద్యార్థుల ఎంపిక

**సింగరాయకొండ, నవంబర్ 10, ప్రభాతవార్త**
ఒంగోలు లోని పి.వి.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన 69వ ఎస్.జి.ఎఫ్ అండర్-17 స్కూల్ గేమ్స్ రన్నింగ్ పోటీలలో పాత సింగరాయకొండ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.ఈ పోటీల్లో అద్భుత ప్రదర్శనతో పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.హెచ్. పద్మజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.బాలికల విభాగంలో 400 మీటర్ల రన్నింగ్‌లో రోహిణి శ్రీలక్ష్మి ్మ ద్వితీయ స్థానం, 3000 మీటర్ల రన్నింగ్‌లో సి.హెచ్. వైష్ణవి ద్వితీయ స్థానం, 1500 మీటర్ల రన్నింగ్‌లో రోహిణి శ్రీలక్ష్మి ్మ ద్వితీయ స్థానం సాధించారు.బాలుర విభాగంలో 3000 మీటర్ల రన్నింగ్‌లో పి. హర్షవర్ధన్ ప్రథమ స్థానం,1500 మీటర్లలో యం. చరణ్ తేజ ద్వితీయ స్థానం,3000 మీటర్లలో కూడా యం.చరణ్ తేజ ద్వితీయ స్థానం సాధించాడు.విద్యార్థుల కృషిని వ్యాయామ ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎం.డి. అన్వర్ ప్రశంసించారు.జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు సి.హెచ్. పద్మజ, సీనియర్ ఉపాధ్యాయుడు ఎల్. శ్రీనివాసరావు (ఎల్.ఎస్.ఆర్), స్టాఫ్ సెక్రటరీ ఎస్. సూర్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



# ఏడు మందికి సీఎం సహాయ నిధి చెక్కులు మంజూరు

**రాచర్ల,నవంబర్ 10, ప్రభాతవార్త**
అనారోగ్య పరిస్థితులతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఏడు మంది పేద ప్రజలకు రెండు లక్షల 56వేల 375 రూపాయలు సహాయ నిధి నిధులు మంజూరైనట్లు మండల టిడిపి అధ్యక్షులు కటిక యోగానంద్ సోమవారం తెలిపారు. అందుకు సంబంధించిన చెక్కులను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి బాధితులకు గిద్దలూరు ఎమ్మెల్యే గృహంలో అందజేశారు పదవ విడతలో భాగంగా ఈ నిధులు మంజూరైనట్లు తెలిపారు. మండలంలోని ఆకవీడుకు చెందిన కాటిపోగు మరియమ్మకు రూ.25,541, పరుచూరి రంగ లక్ష్మమ్మకు రూ.20,524, కాకునూటి విజయకుమార్ రెడ్డికి రూ.45వేలు, రాచర్లకు చెందిన షేక్ షమీమున్‌కు రూ.90,306లు, కోట రమణారెడ్డికి రూ.10వేలు, అనుమలవీడు గ్రామానికి చెందిన మబ్బు ఆగ్నేష్‌కు రూ.23,920లు రామాపురానికి చెందిన అన్నపురెడ్డి శివ పూజిత అనే చిన్నారికి రూ.41,084లు చెక్కులను అందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## పిడుగు శివారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన అప్పిశెట్టి

**గిద్దలూరురూరల్,నవంబర్ 10,ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన పిడుగు శివారెడ్డికి భారతీయ జనతాపార్టీ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయశంకర్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ పార్టీ అధినాయకుల ఆశీస్సులతో రాష్ట్రస్థాయి డైరెక్టర్‌గా నియమితులు కావడం శుభ పరిణామని ఇలాంటి పదవులు భవిష్యత్తులో మరెన్నో పొంది ప్రజలకు మంచి సేవ చేయాలని అందుకు కలియుగ వెంకటేశ్వరుడు మీకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు అప్పిశెట్టి ఉదయ శంకర్ తెలిపారు.



# నారాయణస్వామి ఆదాయం రూ.3.45 లక్షలు

**సీఎస్‌పురం, నవంబర్ 10, ప్రభాతవార్త**
మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి వారి ఆలయానికి ఆదివారం రూ.3,45,943 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో ఎన్‌జీఆర్ నరసింహులు సోమవారం తెలిపారు. స్వామివారి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,19,490 లడ్డు ప్రసాదాలు అమ్మకం ద్వారా రూ.36,960, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.1,05,528, మహా ప్రకార నిర్మాణానికి రూ.58,449, స్వామివారికి శ్రీ పాద కానుకల కింద రూ.15వేలు, పంచామృతాభిషేకానికి విరాళంగా రూ.10,516 వచ్చినట్లు వారు తెలిపారు.

7_7.qxd 11/10/2025 11:57 PM Page 1



## సీఎం చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలి

**- టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి**



**హనుమంతునిపాడు, నవంబర్ 10, ప్రభాతవార్త**
నేడు పీసీపల్లి మండలం లింగన్నపాలెం గ్రామం నందు జరుగు ఎంఎస్ఎం ఈ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రమైన హనుమంతునిపాడు గ్రామం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ఎం ఈ పార్కు ఏర్పాటు ద్వారా పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల నుంచి కేఎస్ఎస్ సభ్యులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్, క్లస్టర్ కన్వీనర్, గ్రామ పార్టీ, మండల పార్టీ, నియోజక పార్టీ, జిల్లా పార్టీ, రాష్ట్ర వివిధ హోదాల్లో ఉన్న అనుబంధ సంఘ నాయకులు, మహిళా కమిటీ సభ్యులు విధిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో హనుమంతునిపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు తాతిరెడ్డి వీర నారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి గాయం తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కుందురు నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు కూరకు వెంకట్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు బాలసాని కోటయ్య, మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, మండల యూనిట్ ఇన్‌చార్జి రాజా రామిరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కత్తి తిరుపాలు, సొసైటీ విండో డైరక్టర్ వేశపోగు రాజేష్, నిర్వాహక కార్యదర్శి చీకటి వెంకట సుబ్బయ్య, కార్యదర్శి మాలపాటి తిరుపతిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు కోటపాటి శేషయ్య, గాయం రామిరెడ్డి, దొడ్డిచింతల సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ కూడలి దశరధ, గంగిరెడ్డి రమేష్‌రెడ్డి, హనుమంతునిపాడు వైస్ ప్రెసిడెంట్ కత్తి కిషోర్, మాజీ ఏఎంసీ డైరక్టర్ కొండేపోగు రాబర్ట్, ఉమ్మనపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు యలనాటి చిన్న కోటయ్య, ఎఫ్ఏ కేతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- కనిగిరి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు బాలసాని కోటయ్య**



**హనుమంతునిపాడు, నవంబర్ 10, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం లక్ష్మక్కపల్లి పంచాయతీలో గల లింగన్నపాలెం గ్రామంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నేడు అనగా మంగళవారం ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొని పార్కుని ప్రారంభించడం జరుగుతుందని అన్ని మండలాల నుంచి కేఎస్ఎస్ సభ్యులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్, క్లస్టర్ కన్వీనర్, ఎస్సీ నాయకులు, గ్రామ పార్టీ, మండల పార్టీ, నియోజకవర్గ పార్టీ, జిల్లా పార్టీ, రాష్ట్ర పార్టీ వివిధ హోదాల్లో ఉన్న అనుబంధ సంఘ నాయకులు, మహిళా కమిటీ సభ్యులు విధిగా పాల్గొని ఈ కార్యక్రమానికి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశానుసారం కనిగిరి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు బాలసాని కోటయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## జగనన్న కాలనీలో విద్యుత్ తీగలు తొలగింపు అన్యాయం

**- వార్త కథనానికి స్పందించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**

**- అధికారులకు వినతిపత్రం అందజేసిన వైసీపీ నాయకులు**

వార్త ప్రభావం



**పుల్లలచెరువు, నవంబర్ 10, ప్రభాతవార్త**
పుల్లలచెరువులోని జగనన్న కాలనీలో విద్యుత్ వైర్లు తొలగింపుపై ఆదివారం వార్త పత్రికలో వచ్చిన కథనానికి సోమవారం యర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ స్పందించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎక్కడైనా జగనన్న కాలనీలలో ఇలాగునే విద్యుత్ పరికరాలు తొలగింపు కొనసాగితే వినతిపత్రాలను ఇవ్వాలని కోరామన్నారు. అంతే కాకుండా ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. నిజంగా ఇది ప్రభుత్వం జీవో ఇచ్చిన తీరైతే మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి దీనిపై భారీ ఎత్తున ఉద్యమం చేపడతామని అన్నారు. పుల్లలచెరువు మండల కన్వీనర్ దోమలు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ వైర్లు తొలగింపు నిలిపివేయకుంటే తమ నాయకులతో కలిసి విద్యుత్ శాఖ అధికారులకు అర్జీ ఇవ్వనున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు తోడుగా నిలిచి నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. అంతే కాకుండా ఆ ప్లాట్లలో విద్యుత్ స్తంభాలు వేసి తీగలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాన్ని ఒక్కసారిగా అధికార పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా భావించి, పేదల ఇళ్ళ స్థలాలలోని విద్యుత్ వైర్లను తొలగించడం అన్యాయమని ఆయన మండి పడ్డారు. కాబట్టి ఈ తొలగింపును నిలిపివేసి, ఎప్పటిలాగే విద్యుత్ తీగలను ఉంచాలని ఆయన సంబంధిత అధికారులను కోరారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజలకు మంచి చేయండి కానీ వారికి అన్యాయం చేయడం, కడుపు కొట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొర్లకుంట జానకి రఘు, సీపీఎం కార్యదర్శి జీవీ గురునాధం, తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 20వ ఏపీ మారిటైం ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌పై సమీక్షా సమావేశంలో పాల్గొన్న సత్య



**టంగుటూరు, నవంబర్ 10, ప్రభాతవార్త**
మంగళగిరిలోని మారిటైం బోర్డు కార్యాలయం లో 20వ ఏపీ మారిటైం ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పై రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్, మారిటైం బోర్డు సీఈఓ అభిషేక్ కుమార్, ఏపీ మారిటైం బోర్డు చీఫ్ ఇంజనీర్ జీవీ రాఘవరావు, ఫిషరీస్ కమీషనర్ రామ్ శంకర్ నాయక్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో చర్చకు వచ్చిన అంశాల పురోగతిని అధికారులు వివరించారు. మొంథా సైక్లోన్ సమయంలో జరిగిన నష్టపరిహారం మత్స్యకారులను ఆదుకునేందుకు 26 బోట్లకు అందించిన రూ.72 లక్షల నష్టపరిహారానికి మారిటైం బోర్డు ఆమోదం తెలిపింది. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత దృష్టిలో పెట్టుకుని ఆధునాతన చేయడంతో పాటు పోలీసు రక్షణ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కార్తీక మాసం వంటి ప్రత్యేక సందర్భాల్లో బీచ్ సందర్శనకు వచ్చే ప్రజల భద్రత దృష్టిలో పెట్టుకుని టూరిస్ట్ గార్డ్స్ బాయ్స్‌ను నియమించాలని నిర్ణయించారు. తుఫాన్ వల్ల నష్టపోయిన ఆక్వా రైతులను ఆదుకునేందుకు క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించాలని ఆదేశించారు.

## 3వ కార్తీక సోమవారం కార్తీక దీపాలంకరణ సరస్వతి పూజ కార్యక్రమం



**టంగుటూరు, నవంబర్ 10, ప్రభాతవార్త**
తూర్పు నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కార్తీక మాసం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన దీపాలంకరణ సరస్వతి పూజ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు ఎన్వీ సుధారాణి ద్వారా దీపోత్సవం సరస్వతి పూజ పాఠశాల విద్యార్థుల ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పి.సురేష్, రామాంజనేయులు, నాసరయ్య ఉపాధ్యాయులు చింతపల్లి, ఎస్.మాధురి, నిర్మలదేవి, ఉమాదేవి, ఈశ్వరమ్మ, జ్యోతి సరస్వతి, రాజ్యలక్ష్మీ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ



**టంగుటూరు, నవంబర్ 10, ప్రభాతవార్త**
బుధవారం నాడు కొండపి నియోజకవర్గ కొండపి మండలంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ నాయకత్వంలో జరగబోయే మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించిన టంగుటూరు మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు చింతపల్లి హరిబాబు. ఈ కార్యక్రమంలో కొండపి నియోజకవర్గం మాజీ ఎఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, మండల యూత్ అధ్యక్షులు దేవరపల్లి వరుణ్, వాణిజ్య విభాగ అధ్యక్షులు పేరం కమలాకర్, సీనియర్ నాయకులు బొద్దు రవీంద్ర, వమిడి హరికృష్ణ, రాజు, శిఖ సుబ్బారావు, రావినూతల మనోహర్, కార్యకర్తలు దేశిరెడ్డి, పవన్, రసూల్, రాజశేఖర్, ఆకాష్, అశోక్, అభిమానులు పాల్గొన్నారు.

## నేడు అద్దంకి పట్టణంలో విద్యుత్‌కు అంతరాయం

**అద్దంకి నవంబర్ 10, ప్రభాతవార్త**
అద్దంకి టౌన్ సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు మంగళవారంఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిఇ ఎం.దామోదరం తెలిపారు. టవర్ లైన్స్‌పై కొత్త వైరు ఏర్పాటు చేసే పని నిర్వహిస్తున్న నేపధ్యంలో రవి బార్ అండ్ రెస్టారెంట్ నుండి భవాని సెంటర్ వరకు రోడ్డుకు రెండు వైపులా, భాగ్యనగర్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

## మెడికల్ కాలేజిల ప్రవేటికరణపై 12న ప్రజా ఉద్యమం

**- అద్దంకి వైసిపి కార్యాలయంలో పోస్టర్ అవిష్కరణ**





**అద్దంకి , నవంబరు 10,ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వం మెడికల్ కాళాశాలను ప్రవేటికరణ చేస్తుందని దీనిపై ప్రజా ఉద్యమం వైసిపి చేపట్టింది. అందులో భాగంగా ఇప్పటికే పలు స్థాయిలలో ఉద్యమాలను నిరసనలను చేపట్టారు. ఈనెల 12న అద్దంకి నియోజకవర్గంలో ప్రజా ఉద్యమాన్ని నిర్వహించాలని పార్టీ అధిస్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ నాయకత్వం లో ఉద్యమ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సోమవారం స్ధానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధా కృష్ణ మూర్తితోపాటు రఘురామగుప్తా, గుంజి కోటేశ్వర రావు, ధర్మవరపు భాస్కర్, పి.చంద్రశేఖర్, నాయుడు, భువనేశ్వరి, మానికొండ నాగరాజు, ఉడత్తు సురేష్,రామకోటి, చిరంజీవి, కన్నెబోయిన బాల వీరయ్య, ప్రవీణ్, ముత్తవరపు రమణయ్య, వైకుంఠ రవి, తదితరులు వున్నారు.

## పలు ఆలయాల్లో ఘనంగా కార్తీకమాస మూడవ సోమవారం వేడుకలు





**సంతనూతలపాడు, నవంబర్ 10, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట, సంతనూతలపాడు తదితర కేంద్రాలలోని శ్రీ రామలింగేశ్వరస్వామి, త్రిపురాంతక స్వామి తదితర ఆలయాలలో సోమవారం నాడు ఘనంగా కార్తీక మాస మూడవ సోమవారం వేడుకలు జరిగింది. పేర్నమిట్టలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో పేర్నమిట్ట సాయి కృష్ణ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకములు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు సోమరాజుపల్లి అనిల్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండోమెంట్, దాతలు ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబు శర్మ ఆధ్వర్యంలో స్వామి వాళ్లకు అభిషేకాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎండోమెంట్ ఈవోలు ప్రసన్న లక్ష్మీ, నారాయణరెడ్డి తదితరులు ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో ఈ కార్తీక మాస మూడవ సోమవారం వేడుకల్లో పాల్గొని దీపారాధనలు వెలిగించి తదుపరి స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను సేకరించారు.

## వైసీపీ ప్రజా ఉద్యమం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**- 12వ సంతనూతలపాడులో జరిగే నియోజకవర్గం నిరసన ర్యాలీని జయప్రదం చేయాలి**



**సంతనూతలపాడు, నవంబర్ 10, ప్రభాతవార్త**
ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న బుధవారం ఉదయం 10గంటలకు సంతనూతలపాడు కేంద్రంలో నియోజకవర్గ స్థాయిలో జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం నాడు సంతనూతలపాడులో జరిగిన ఒక కార్యక్రమంలో వైఎస్సార్ ప్రజా ఉద్యమం వాల్ పోస్టర్‌ను వైసీపీ సంతనూతలపాడు నియోజకవర్గ పరిశీలకులు బొట్ల రామారావు, సంతనూతలపాడు మండల వైసీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు దుంపా యల్లమందారెడ్డి తదితరులు ఆవిష్కరించారు. ఈ నెల 12వ తేదీన ఉదయం 10గంటలకు సంతనూతలపాడు వైసీపీ కార్యాలయం నుండి నియోజకవర్గ స్థాయిలో ర్యాలీ ప్రారంభమై, తదుపరి సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయంలో దీనిపై వినతిపత్రం అందజేయనున్నట్లు మండల వైసీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. మాజీ మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో సంతనూతలపాడులో నియోజకవర్గ స్థాయిలో ఈ నిరసన ర్యాలీ జరగనున్నట్లు చెంచిరెడ్డి వెల్లడించారు. నియోజకవర్గ పరిశీలకులు బొట్ల రామారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల నుండి ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు, అభిమానులు ఈ నిరసన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొని దీనిని జయప్రదం చేయాల్సిందిగా చెంచిరెడ్డి కోరారు. వైఎస్సార్ ప్రజా ఉద్యమం వాల్‌పోస్టర్ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు షేక్ రంతుల్లా, వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దుంపా అజయ్‌రెడ్డి, జిల్లా వైసీపీ వాలంటరీ వింగ్ కార్యదర్శి తన్నీరు ఆంజనేయులు, సంతనూతలపాడు మండల వైసీపీ యూత్ వింగ్ కార్యదర్శి కుంచాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ మోహన్‌రావు, నియోజకవర్గ వైసీపీ ట్రేడ్ యూనియన్ చైర్మన్ కొత్తపల్లి వెంకట సుబ్బయ్య, వైసీపీ నాయకులు షేక్ మస్తాన్ వలి, కుంచాల నాగాంజనేయులు, కే.లక్ష్మణ్, వల్లపు శ్రీను, కరుకు సుబ్బారావు, షేక్ అల్లాబక్షు, గౌసాని, కాలేశా, బాబు, కరిముల్లా, ఏ.వెంకట సుబ్బయ్య, దుంపా వెంకారెడ్డి, శీలం అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిలిస్టు మృతి



**సంతనూతలపాడు, నవంబర్ 10, ప్రభాతవార్త**
సంతనూతలపాడు సమీపంలోని కామేపల్లివారిపాలెం వెళ్లే రహదారి చిన్న చెరువు అలుగు ప్రాంతంలో ప్రమాదవశాత్తు మోటార్ సైకిలిస్ట్ తన్నీరు కోటేశ్వరరావు(55) మృతి చెందారు. కోటేశ్వరరావు గత తొమ్మిది సంవత్సరాల నుండి సంతనూతలపాడు వడ్డెరపాలెంలో తాత్కాలికంగా నివాస ముంటున్నారు. ఇతను స్వగ్రామం గుంటూరు జిల్లా పెద్దనందిపాడు అయితే పనులు లేకపోవడంతో అడపా దడపా ఇంటి సామాగ్రిని కొంచెం కొంచెం తన స్వగ్రామానికి తరలిస్తున్నాడు. ఇందులో భాగంగా కోటేశ్వరరావు తన మోటారు సైకిల్‌పై ముందు వైపున గ్యాస్ సిలిండర్, వెనుకవైపున ఇంటి సామాగ్రిని కొంత పెట్టుకొని సోమవారం యోకో జామున గుంటూరు జిల్లా పెద్దనందిపాడుకు తరలివెళ్తున్నాడు. సంతనూతలపాడులోని కామేపల్లి వారి పాలెం రహదారి వద్ద గల చిన్న చెరువు అలుగు ప్రాంతంలో ఒక్క సారిగా సిలిండర్ ఒరిగి మోటార్ సైకిల్ పడిపోయింది. ఈ ప్రమాదంలో కోటేశ్వరరావు అలుగు వద్ద బ్రిక్స్‌కు తన తల కొట్టుకుని తీవ్ర గాయాలు అయ్యాడు. తదుపరి ఇంతలో వెనుకగా వస్తున్న తన కుమారుడు శ్రీనివాసరావు ఈ సంఘటన చూసి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. తీవ్ర గాయాలకు గురైన కోటేశ్వరరావును ఆటోలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఒంగోలు రిమ్స్‌లో కోటేశ్వరరావు మృతి చెందారు. కోటేశ్వరరావు కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ తిరుమల రాజు దీనిపై కేసు నమోదు చేశారు.

## వైద్యకళాశాలల ప్రైవేటీకరణ కుట్రలను అడ్డుకుందాం



**సీఎస్‌పురం, నవంబర్ 10, ప్రభాతవార్త**
రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటీకరణ చేసి పేదలకు ఉచిత వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కుతంత్రాలు అడ్డుకుందామని పార్టీ సీనియర్ నాయకులు పెరుగు సుబ్బారామయ్య, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ షేక్ గౌస్ అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ప్రజాభిప్రాయం సేకరణలో భాగంగా సోమవారం కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం మండలంలోని చెన్నపునాయునిపల్లె గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో, పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలనే సంకల్పంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర సహకారంతో ప్రతి జిల్లాలకు ఒక వైద్యకళాశాల ఉండాలనే లక్ష్యంతో నూతనంగా 17 కళాశాలలను మంజూరు చేయించి నిర్మాణాలు చేపట్టారన్నారు. వీటిలో కొన్ని పూర్తయిన మరికొన్ని వివిధ దశల్లో ఉండగా వీటిని పీపీపీ పద్దతిలో ప్రైవేటుకు అప్పగించడం సరికాదని ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెరుగు సుబ్బరామయ్య, యనమల పెద్ద సుబ్బయ్య, నాగరాజు, షేక్ నాయబ్ రసూల్, నారిశెట్టి వెంకట సుబ్బయ్య, యనమల రఘురామయ్య, చాగా చెంగాలయ్య, చింతలపూడి తిరుపతయ్య, గంగిపోగు రమేష్, నాగమ్మ, దేవమ్మ, లక్ష్మీపోగు మరియదాసు, పి.మరియదాసు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్తీక సోమవారం సందర్భంగా బైరవకోనలో భక్తుల సందడి







**సీఎస్‌పురం, నవంబర్ 10, ప్రభాతవార్త**
పవిత్ర కార్తీక మాసం సందర్భంగా మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం బైరవకోన క్షేత్రనికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, కాలబైరవ, నగరేశ్వర ఆలయాల్లో నిర్వహించిన విశేష పూజల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అదే విధంగా జలపాతం వద్ద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. జలపాతం వద్ద యువత, భక్తులు ఉత్సాహంగా గడిపారు ఆలయ ఈవో డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్ సుందర్‌రాజుల ఆధ్వర్యంలో భక్తులకు వసతులు, అన్నప్రసాదం సమకూర్చారు.

## నూతన తరగతి గదికి శంకుస్థాపన



**వేటపాలెం, నవంబర్ 10, ప్రభాతవార్త**
మండలంలోని దేశాయిపేట పంచాయతీ నీలకంటపురంలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాల ప్రాంగణంలో సర్వశిక్ష అభియాన్ కింద మంజూరు చేయబడిన నూతన తరగతి గది 13 లక్షల వ్యయంతో నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.స్వప్న, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.శివయ్య, కాంట్రాక్టర్ కొండలరెడ్డి, గ్రామ పెద్దలు, డి.వెంకట సుబ్బారావు, పి.వెంకట సుబ్బారావు(బుల్లియ్య), ఒలుకుల వరప్రసాద్‌రావు, పి.సుబ్బారావు, పి.హనుమంతరావు పాల్గొన్నారు.

## సీఎం రాక ఏర్పాట్లను పరిశీలించిన ఇంటూరి

**- యారవ, హాజీ గౌస్, నాయబ్**

**కనిగిరి, నవంబర్ 10, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం లింగన్నపాలెం గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న రాష్ట్ర అభివృద్ధి ప్రదాత, సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్తున్న ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం లింగన్నపాలెం గ్రామానికి విచ్చేయుచున్న సందర్భంగా సభ స్థలాన్ని పరిశీలించిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావుతో పాటు పామూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి హాజీ గౌస్, రాజకీయ విశ్లేషకులు కోడిగుంపల నాయబ్ రసూల్, బూత్ ఇన్‌చార్జిలు మోబినా మౌలాలి, సలాం షేక్ ఖాజా మొద్దీన్, వారితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. 11/11/2025 మంగలవారం జరిగే కార్యక్రమాన్ని కనిగిరి నియోజకవర్గ ప్రజలు, కూటమి నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు అన్నారు.

## దోర్నాలలో సోమవారం బారులు తీరిన వాహనాలు

**- శ్రీశైలేశుని దర్శనానికి భక్తుల తాకిడి**



**పెద్దదోర్నాల, నవంబర్ 10, ప్రభాతవార్త**
కార్తీక సోమవారం సందర్భగా శ్రీశైలంలో శ్రీశైలేశుని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.ఈ మేరకు సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలతో పెద్దదోర్నాలలో ట్రాఫిక్ పెరిగి వాహనాలు బారులుగా నిలిచాయి. కార్తీక సోమవారం కావడంతో భక్తులు నది తీరాల్లో స్నానాలు చేసి దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో శ్రీశైలేశుని దర్శించుకోవడానికి బయలుదేరారు. పెద్ద ఎత్తున భక్తులు రావడంతో దోర్నాల కేంద్రం శ్రీశైలం రోడ్డు ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద వ్యాపారాలు కిటకిటలాడాయి.

## శ్రీశైలాన్ని కలుపుకొని మార్కాపురంను జిల్లాగా ప్రకటించాలి

**- కాటమరాజు జిల్లాగా నామకరణం చేయాలి**

**- రాష్ట్ర ఉద్యమ అధ్యక్షులు గుమ్మా యల్లేష్ యాదవ్ డిమాండ్**




**పెద్దదోర్నాల, నవంబర్ 10, ప్రభాతవార్త**
శ్రీశైలాన్ని కలుపుతూ మార్కాపురం జిల్లాగా ప్రకటించి జిల్లాకు కాటమరాజు జిల్లాగా నామకరణం చేయాలని రాష్ట్ర ఉద్య అధ్యక్షులు గుమ్మా యల్లేష్ యాదవ్ డిమాండ్ చేశారు. శ్రీశైలాన్ని మార్కాపురంలో కలపడం ద్వారా జిల్లాకు ఆదాయం ఉంటుందన్నారు. అలాగేకాటమరాజు ప్రకాశం జల్లాకు చెందిన 13వ శతాబ్దపు యోధుడు, దీనికి సంబంధించిన అనేక కథలు, శాసనాలు జిల్లాలో ఉన్నాయి. ఆయన ముఖ్యంగా కనిగిరిని పరిపాలించాడని చెబుతారు. కనిగిరి కోట, బావులు ఆయనతో ముడిపడి ఉన్నాయి. ప్రస్తుతం కూడా ఆయన పేరు మీద తిరునాళ్ల జరుగుతాయి. కావున చారిత్రక ప్రాధాన్యత కలిగిన కాటమరాజు పేరును జిల్లాగా నామకరణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యార్థులతో ఎమ్మెల్యే సాంబన్న ఆప్యాయ ముచ్చట్లు

**- విద్యార్థులతో ఎమ్మెల్యే ఆసక్తికర పరిణామాలు**

**- విద్యార్థుల మోములో చిరునవ్వులు**



**మార్టూరు, నవంబర్ 10, ప్రభాతవార్త**
అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో ఓ వివాహ వేడుకకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏదుబాటు నుంచి అన్నంబొట్లవారిపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు ఎమ్మెల్యే సాంబన్న చూసి పరుగులు తీస్తూ అక్కడికి చేరుకున్నారు. గుడ్ మార్నింగ్ సార్ అంటూ పిల్లలు సెల్యూట్ చేశారు. దీంతో ఎమ్మెల్యే ఏలూరి వేరి గుడ్ మార్నింగ్ అంటూ..ఒక్కొక్కరిని స్కూల్, ఊరు, తరగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఒక్కొరితో ఏ సబ్జెక్ట్ అంటే ఇష్టం.. ఏం గేమ్స్ ఆడుతారు అని తెలుసుకున్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్‌బాబు సారధ్యంలో విద్యలో పెను మార్పులు చేశారని.. నూతనంగా రంగుల యూనిఫాం తీసుకొచ్చారని ఎలా ఉందని అడిగారు. దీనికి వారు చాలా బాగుందని సమాధానం ఇచ్చారు. మరికొందరు నవ్వులతో వాతావరణాన్ని హాయిగా మార్చారు. ఎమ్మెల్యే విద్యార్థుల అభిరుచులు, వారి ఇష్టమైన సబ్జెక్టులు, గేమ్స్ భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారు అనే విషయాలను తెలుసుకున్నారు. పిల్లలు చెప్పిన సమాధానాలపై ఎమ్మెల్యే ప్రశంసలు పలికారు. చిన్నారుల ధైర్యం, మాట్లాడే తీరు, నాయకుడి ఎదుటను తమ అభిప్రాయాలు ధైర్యంగా చెప్పడం అక్కడి పెద్దలను ఆశ్యర్యపరిచింది. ఈ అనుహ్యామైన చర్చ కొన్ని నిమిషాల పాటు సాగి, అక్కడి వాతావరణం చిరునవ్వులు చిందించింది. తరం మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధం ఎలా ఉండాలో ఈ సమావేశం చక్కగా చూపించింది.

## ఇంట్లో నుంచి వెళ్లి కనిపించని యువకుడు

**- తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు**



**పుల్లలచెరువు, నవంబర్ 10, ప్రభాతవార్త**
మండలంలోని పడికిటివానిపల్లెలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంపత్ కుమార్ సోమవారం విలేకర్లకు తెలిపారు. మండలంలోని పిడికిటివానిపల్లెకు చెందిన పుచ్చకాయల నాగేంద్రబాబు తండ్రి వెంకటేశ్వర్లు 19 సంవత్సరాలు అనే వ్యక్తి ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం సుమారు 12 గంటల నుండి వారి ఇంటిలో నుండి కనిపించకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడని, అప్పటి నుండి అతని కుటుంబ సభ్యులు చుట్టు పక్కగ గ్రామాలలో దేవస్థానాల వద్ద ఎంత వెతికినా కనిపించకపోవడంతో 10వ తేదీన ఆ వ్యక్తి తండ్రి పుచ్చకాయల వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు. పైన తెలిపిన వ్యక్తి ఆచూకి తెలిస్తే పుల్లలచెరువు ఎస్సైకి సమాచారమందించాలని ఆయన అన్నారు.

## పొతకమూరి కుటుంబం మానవతా సేవ

### - స్నేహహస్తం ఆధ్వర్యంలో భోజన వసతి



**కనిగిరి, నవంబర్ 10, ప్రభాతవార్త**

కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో మానవతా విలువలకు నిదర్శనంగా స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద రోగులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. సోమవారం ఈ సేవా కార్యక్రమాన్ని దాతల సహకారంతో ట్రస్టు ప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా పొతకమూరి షేక్ లాల్ బి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు పొతకమూరి రహిమాన్ భాష, నజీర్ అహ్మద్ భాష ముందుకు వచ్చి పేదలకు ఉచిత భోజన సదుపాయాన్ని కల్పించారు. పేదల సహాయం చేయడం తమ కుటుంబ పరంపరలో భాగమని, సేవా కార్యక్రమం ద్వారా తమ తల్లికి అంజలి ఘటించామని వారు తెలిపారు. ట్రస్టు చైర్మన్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతుల కోసం ఎంతో మంది ఆశగా ఎదురు చూస్తున్నారు. ఒకరి జీవితంలో చిరునవ్వు పూయించగలిగితే అదే మానవతా సేవ. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ శుభ లేదా స్మరణీయ సందర్భాల్లో పేదలను గుర్తించి వారికి తోడ్పడే అలవాటు అలవర్చుకోవాలి అని ఆకాంక్షించారు. అలాగే, స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు సమాజ సేవలో ముందుండి పేదలు, రోగులు, అనాధలకు సహాయం అందిస్తోందని, ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పొతకమూరి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ వైద్య సిబ్బంది శంకర్, స్నేహహస్తం సభ్యులు శివశంకర్, మహమ్మద్ గౌస్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు. పేదలకు భోజన వసతి ఏర్పాటు చేసిన పొతకమూరి కుటుంబం సమాజిక సేవలో ఆదర్శంగా నిలుస్తుందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పొతకమూరి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ వైద్య సిబ్బంది శంకర్, స్నేహహస్తం సభ్యులు శివశంకర్, మహమ్మద్ గౌస్, రహమతుల్లా, తదితరులు పాల్గొన్నారు. పేదలకు భోజన వసతి ఏర్పాటు చేసిన పొతకమూరి కుటుంబం సామాజిక సేవలో ఆదర్శంగా నిలుస్తుందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

### - కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వైసిపి ఇన్చార్జి కెపి నాగార్జున రెడ్డి



**గిద్దలూరు, నవంబరు 10, ప్రభాతవార్త**

ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విధానాన్ని విరమించుకోవాలని మార్కాపురం మాజీ శాసనసభ్యులు, గిద్దలూరు వైసిపి సమన్వయకర్త కెపి నాగార్జున రెడ్డి అన్నారు. గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డులో వార్డు వైసిపి ముఖ్య నాయకులు పాలుగుళ్ల నరసింహ రెడ్డి, పాలుగుళ్ల తిరుపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కోటి సంతకాలు సేకరణ (రచ్చబండ) కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి కెపి నాగార్జున రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైసిపి నాయకులతో కలిసి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విధానానికి వ్యతిరేకంగా ప్రజల నుండి సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ ప్రధాన కార్యదర్శి సూర స్వామి రంగా రెడ్డి, నగర పంచాయతీ కన్వీనర్ మానం బాలి రెడ్డి, మండల కన్వీనర్ బత్తేం ఓబుల్ రావు,పోలేపల్లి శివ గోడి వెంకటేశ్వర రెడ్డి,బొప్పూరి మత్తయ్య, కుక్క సాంబశివరావు,షేక్ ఖాసీం, షేక్ బడేపీరా, పాలుగుళ్ల సుబ్బా రెడ్డి, కర్ర శివకోటి రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా కల్పిస్తుంది

### - లబ్ధిదారులకు చెక్కులు పంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు, నవంబరు 10, ప్రభాతవార్త**

అనారోగ్య పరిస్థితులతో ఆర్థికంగా సతమతమవుతున్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసానిస్తుందని ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక సమస్యలతో ఆరోగ్య చికిత్సకు ఇబ్బంది పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 10వ విడతలో 74 మందికి, రూ.32,26,235లు మంజూరు కాగా సోమవారం గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చిన తనకు తెలియజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తానని తెలిపారు. పేదల ఆరోగ్యానికే ఎన్డీయే కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిస్తుందని, ఎవరు అధైర్య పడొద్దని భరోసానిచ్చారు. ఎన్డీయే ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని, ఇప్పటి వరకు గిద్దలూరు నియోజకవర్గంలో 645మందికి రూ.6 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందచేశామని, పేదలకు మేలు చేయటమే తమ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పంచాయతీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవస్థానం అభివృద్ధికి సహకరిస్తాం

### - టిడిపి నాయకులు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి



**రాచర్ల నవంబర్ 10, ప్రభాతవార్త**

రాచర్లలోని అయ్యప్ప స్వామి దేవస్థానం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని గిద్దలూరు టిడిపి నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్ ఆధ్వర్యంలో రాచర్ల అయ్యప్ప స్వామి ఆలయంలో మాలధారులకు భిక్ష ఏర్పాటు చేయగా ఆయన అతిథిగా పాల్గొని భక్తులకు ఆయన చేతుల మీదుగా బిక్ష వడ్డించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయనను కోరగా తప్పకుండా సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, దాతలను, అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్ ఎంఈఓ వి గిరిధర్ శర్మ పశువైద్యాధికారి డి హరిబాబు, మండల మాజీ జెడ్పిటిసి కుప్ప రంగనాయకులు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర రెడ్డి, గిద్దలూరు మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, తాహెర్ బాషా, పఠాన్ సనావుల్లా ఖాన్, కళ్యాణ్ రెడ్డి, ఎంవి సాయి, భూపని చిన్న కాశయ్య, స్పందన విద్యాసంస్థల అధినేత పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి, తురిమెళ్ళ టిడిపి నాయకులు నారిశెట్టి కరుణాకర్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మరో తుఫాను.. మళ్లీ ఏపీలో వర్షాలు!



**దొనకొండ,నవంబర్ 10,ప్రభాతవార్త**

మొంథా తుఫాను విధ్వంసం నుంచి కోలుకోక ముందే రాష్ట్రాన్ని మరో ముంపు ముప్పు వెంటాడుతుంది ఈ నెల 19/20వ తేదీన బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఇస్రో వాతావరణం శాఖ నిపుణులు వెల్లడించారు. ఇది తుఫానుగా బలపడి ఈ నెల 25 నాటికి తీరం దాటవచ్చని దీని ప్రభావంతో కోస్తా జిల్లాలపై భారీ వర్షా ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.అలాగే మరో నాలుగు రోజుల్లో శ్రీలంక సమీపంలో అల్పపీడనం ఏర్పడుతుందని దీని ప్రభావంతో ఏపీ రాష్ట్రంలో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలియజేశారు.

## PMAY-గ్రామీణ్ పథకం దరఖాస్తు గడువు పొడిగింపు

**దొనకొండ,నవంబర్ 10,ప్రభాతవార్త**

గ్రామాల్లో ఇళ్లు లేని పేదలకు కేంద్రం శుభవార్త చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (శిలీత్రి) గ్రామీణ్ పథకం దరఖాస్తు గడువును పొడిగించింది. నవంబర్ 5న గడువు ముగియగా.. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ నెల 30 వరకు పొడిగించింది. అర్హులు సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయంతో ఆవాస్+యాప్‌లో నమోదు చేసుకోవాలి. ఇంటి నిర్మాణానికి రూ.2.5 లక్షలు అందిస్తారు. అర్హులైన వారు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు

## ఒకే సారి 17 మెడికల్ కాలేజీలను శాంక్షన్ చేసిన చరిత్ర జగన్‌ది

### - ప్రైవేటు పరం చేస్తున్న ఘనత చంద్రబాబుది

### - ఈ నెల 17న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

### - వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి






**దర్శి, నవంబర్ 10, ప్రభాతవార్త**

మెడికల్ కాలేజీలా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 12వ తేదీన జరుగు ర్యాలీని జయప్రదం చేయాలని దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్ పార్టీ ఆఫీసులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూమెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో విద్యార్థులు, యువకులు మహిళలు ప్రజలు రాజకీయ పార్టీలతో కలిసి ఈ ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించి పేద విద్యార్థులకు మెడికల్ విద్యను అందించాలని దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టారని ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం కక్ష పూరితంగా జగన్ ప్రారంభించిన మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు దోచిపెట్టడానికి పూనుకొని మధ్య తరగతి ప్రజలకు విద్యను వైద్యాన్ని దూరం చేయాలని కుట్ర చేస్తుందని అన్నారు. కావున మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12వ తేదీ దర్శి పార్టీ ఆఫీసు నుంచి ఎమ్మార్వో ఆఫీసు వరకు జరుగు ర్యాలీలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా ఈ మధ్య కాలంలో వచ్చిన వరదలకు నష్టపోయిన పంటలు వేసిన రైతులని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒంగోలులోని రిమ్స్‌ని ప్రారంభించారని ఇప్పుడు పేదలు ఉపయోగించుకోవడం జరుగుతుందని ఆ విధంగా ఉపయోగపడాలి గాని మెడికల్ కాలేజీలని ప్రైవేటు పరం చేయడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, తాళ్లూరు మండల పార్టీ అధ్యక్షులు తూము వెంకట సుబ్బారెడ్డి, ముండ్లమూరు మండల పార్టీ అధ్యక్షులు చింత శ్రీనివాస్‌రెడ్డి, కురిచేడు మండల పార్టీ అధ్యక్షులు ఎన్నాబత్తుల సుబ్బయ్య, దొనకొండ ఎంపీపీ మురళి, కురిచేడు జడ్పీటీసీ ముసుం నాగిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి షేక్ సైదా, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దేవప్రసాద్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కొల్లా భాస్కర్, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, జిల్లా కార్యదర్శి సూదిదేవర అంజయ్య, ఇత్తడి దేవదానం, పంచాయతీ రాజ్ వింగ్ జిల్లా కార్యదర్శి బండి గోపాల్‌రెడ్డి, సర్పంచ్ కేసరి రాంభూపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మేడం మోహన్‌రెడ్డి, వేమిరెడ్డి చెన్నారెడ్డి, నాయకులు నల్లదిమ్మ రమణారెడ్డి, గోను వెంగల్‌రెడ్డి, కసుకుర్తి వెంకటరావు, కొడవటి జాన్, పనేం మజ్నువలి, కుంట అచ్చారావు, పాలెపోగు డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయు ప్రకాశం జిల్లా కమిటీ ఎన్నిక



**దర్శి, నవంబర్ 10, ప్రభాతవార్త**

దర్శి పీజీఎన్ కళ్యాణ మండపంలో జరుగుతున్న సీఐటీయు ప్రకాశం జిల్లా 13వ మహాసభలలో నూతన అధ్యక్షులుగా కాలం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ముప్పా రమేష్, కోశాధికారిగా పారా శ్రీనివాసరావులతో పాటు 23 మందితో జిల్లా ఆఫీసర్ బెరర్స్‌ని, మొత్తం 61 మందితో నూతన జిల్లా కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుందని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు ఈ రోజు విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా జీవీ కొండారెడ్డి, డీకేఎం రఫీ, తాండవ రంగారావు, పెంట్యాల కల్పన, బంకా సుబ్బారావు, ఈదర అన్నపూర్ణ, తంగిరాల మహేష్, టి.రాము, సీహెచ్ చిరంజీవి, కొర్రెపాటి శ్రీనివాసరావు. కార్యదర్శులుగా గంటెనపల్లి శ్రీనివాసులు, పీసీ కేశవరావు, టి.ఆవులయ్య, పల్లామల్లి ఆంజనేయులు, పందిటి రూబేన్, జి.రమేష్, ఉబ్బా ఆదిలక్ష్మి, రాయళ్ళ మాలకొండయ్య, మక్కెన పరిశుద్ధం, కోఆప్షన్ మొత్తం 23 మందితో నూతన ఆఫీసు బెరర్స్ ఎన్నికైనట్లు ఆయన ప్రకటించి కార్మిక, ఉద్యోగ, స్కీం వర్కర్స్ సమస్యలు, హక్కులపై సమరశీల పోరాటాలు చేయాలని తాండవ రంగారావు మాట్లాడుతూ మహాసభల నిర్వహణకు దర్శి పట్టణ ప్రజలు, దాతలు కార్మిక ఉద్యోగులు, సహాయ సహకారాలు అందించారన్నారు. గత నెల రోజులుగా దర్శి నియోజకవర్గ కమిటీ సీఐటీయు కార్యకర్తలతో 13 విభాగాలుగా ఏర్పడి కుటుంబాలతో సహా అందరూ శ్రమించిందని అందరికి ధన్యవాదాలు తీర్మాణాన్ని ప్రవేశపెట్టగా మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది.

## కోటిసంతకాల సేకరణ కార్యక్రమం



**దర్శి, నవంబర్ 10, ప్రభాతవార్త**

పొదిలి రోడ్డు గాంధీ నగర్‌లో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జోనల్ ప్రెసిడెంట్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు జింకల సుబ్బరామిరెడ్డి, కుందురు నరసింహారెడ్డి, కృష్ణమాచారి, వనిపెంట నారాయణరెడ్డి, పప్పుల ఆదినారాయణరెడ్డి, దుగ్గిరెడ్డి, నాగేంద్రరెడ్డి, పాల్గొన్నారు. పొదిలి రోడ్డు గాంధీనగర్‌లో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జోనల్ ప్రెసిడెంట్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జింకల సుబ్బరామిరెడ్డి, కుందురు నరసింహారెడ్డి, కృష్ణమాచారి, వనిపెంట నారాయణరెడ్డి, పప్పుల ఆదినారాయణరెడ్డి, దుగ్గిరెడ్డి నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్‌లో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



**దర్శి, నవంబర్ 10, ప్రభాతవార్త**

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ సమావేశం దర్శిలోని ప్రజా సంఘాల కార్యాలయంలో గాలి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న పంటల రైతులుని ఆదుకోవాలన్నారు. అందువలన కేంద్ర బృందం పశ్చిమ ప్రాంతంలో కూడా పర్యటించాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పంట ఏడుకొండలు, కమిటీ సభ్యులు గంగినేని సత్యనారాయణ, రాయపూడి వెంకటేశ్వర్లు, మీరావలి కోటయ్య, ఆదినారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 100శాతం ఉత్తీర్ణత పాఠశాలల లక్ష్యం

### - కే.శివకుమార్



**వేటపాలెం, నవంబర్ 10, ప్రభాతవార్త**

బాపట్ల జిల్లా గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమీషనర్ కే.శివకుమార్ సాధారణ తనిఖీలో భాగంగా వేటపాలెం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సోమవారం సందర్శించారు. పాఠశాలలోని సమ్మెటివ్ -1 పరీక్షా గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు పదో తరగతి విద్యార్థుల 100 రోజుల కార్యచరణ ప్రణాళిక సమర్థవంతంగా నిర్వహించడం, విద్యార్థుల అపార్ ఐడీ 100 శాతం నమోదు, ఈఈఎంటీ పరీక్ష రిజిస్ట్రేషన్ గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. గతంలో పదవ తరగతి ఉత్తీర్ణులు కానీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, ఉత్తీర్ణులు అయ్యే విధంగా చూడాల్సిందిగా కోరారు. 100 శాతం ఉత్తీర్ణత ధ్యేయంగా పాఠశాలలు ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ ఐ.పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సామాజిక, ఆర్థిక అసమానతలతో న్యాయం దూరం కారాదు..



**ఒంగోలు, ప్రభాతవార్త**

సామాజికంగా అసమానతలతో కానీ ఆర్థికపరమైన వ్యత్యాసాల వల్ల గాని సమాజంలో ఎవరు న్యాయానికి దూరం కాకూడదని ఉద్దేశంతో న్యాయ సేవ అధికార సంస్థలు స్థాపించబడ్డాయని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సేవలను పొంది ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్స్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. సోమవారం ఒంగోలు పట్టణంలోని బాలాజీ నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అవతరణ కార్యక్రమం విద్యార్థులతో నిర్వహించుకోవడం ఎంతో ఆనందదాయకమని ప్రతి ఒక్క విద్యార్థి కూడా చిన్నతనం నుండే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండటం ద్వారా భవిష్యత్తులో రాబోయే ప్రమాదాలను గ్రహించవచ్చని తద్వారా క్రమబద్ధమైన జీవితాన్ని ఆచరించవచ్చని అన్నారు. దేశ స్థాయిలో నల్సా మరియు రాష్ట్రస్థాయిలో సల్సా జిల్లాని స్థాయిలో డి. ఎల్ ఎస్. ఏ, మండల స్థాయి కమిటీలు ఉన్నాయని చట్టపరమైన సమస్యల పరిష్కారం కోసం వీటిని ఆశ్రయించి తగిన విధంగా పరిష్కారం పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రసన్న మరియు అధ్యాపక అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం



**కొత్తపట్నం నవంబర్ 10 ప్రభాతవార్త**

కొత్తపట్నంలోని కళామందిరం వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మేరకు ఈనెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతి గ్రామం నుండి నాయకులు కార్యకర్తలు పాల్గొనే విధంగా బాధ్యతలు తీసుకోవాలని తెలియజేశారు. మండలంలోని అన్ని గ్రామాల పార్టీఅధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పిటిసి, వైఎస్ఆర్ సీపీ నాయకులు ,యూత్ కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు అందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులుగా కఫిల్ బాషా



**ఒంగోలు, నవంబర్ 10, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులుగా షేక్ కఫిల్ బాషాను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ నియమించింది. ఈ మేరకు సోమవారం వివిధ కార్పొరేషన్ డైరెక్ట్ లతోపాటు మైనార్టీ కమిషన్ డైరెక్టర్లను ప్రభుత్వం ప్రకటించింది. ఒంగోలు నగరానికి చెందిన కఫిల్ బాషా గతంలో ఒంగోలు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడిగా, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా పదవులను నిర్వహించారు. తెలుగుదేశం పార్టీకి నిబద్ధత కలిగిన కార్యకర్తగా.. నాయకుడిగా ఎన్నో సేవలను అందించారు. కఫిల్ బాషా సేవలను గుర్తించిన ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు గా ఆయన పేరును సిఫార్సు చేశారు. ఎమ్మెల్యే దామచర్ల కు కృతజ్ఞతలు రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులుగా నియామకం కొరకు తన పేరును సిఫార్సు చేసి సహకరించిన ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కు కఫిల్ భాష కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా మైనారిటీల సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం, వారి హక్కుల కోసం పాటుపడతానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ



**చీమకుర్తి ,ప్రభాతవార్త**

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఈరోజు చీమకుర్తి మండల వైఎస్సార్సీపీ కార్యాలయం నందు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా ఈనెల 12న తలపెట్టిన నిరసన కార్యక్రమానికి సంబందించిన ఖిప్రజా ఉద్యమంఖి పోస్టర్ ను మండల పార్టీ నాయకులు అందరూ కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్ బాబు, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్ పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్రరావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ చల్లా అంకులు, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తెల్ల మేకల గాంధీ, జిల్లా పార్టీ కార్యదర్శి కూడాలి మాలకొండయ్య, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు బొడ్డు కోటేశ్వరరావు, చీమకుర్తి పట్టణ బూత్ కమిటీ అధ్యక్షులు సోమా శేషాద్రి, మున్సిపల్ కౌన్సిలర్లు గేమగిరెడ్డి ఇందిరా సుందరరామిరెడ్డి, పాటిబండ్ల గంగయ్య, కె. వి. సుబ్బారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు చీదర్ల శేషు, తదితరులు పాల్గొన్నారు,..

## మోడల్ కాలేజీ అక్రమాలపై నిగ్గు తేల్చండి

### - ప్రిన్సిపాల్ జే.సరల, వైస్ ప్రిన్సిపాల్ జి.శామ్యూల్ జాన్‌లపై చర్యలు తీసుకోండి

### - సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ



**చీరాల, నవంబర్ 10, ప్రభాతవార్త**

చీరాల మండలం ఈపురుపాలెం ఆంధ్రప్రదేశ్ మోడల్ కాలేజీ అండ్ హైస్కూల్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ అవినీతి అక్రమాలపై సమగ్రంగా విచారణ జరిపి కఠినంగా చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా సీపీఐ కార్యదర్శి తన్నీరు సింగరకొండ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో విద్యార్థులతో పాటు కలెక్టర్‌ను కలిసిన ఆయన మోడల్ కాలేజీ అక్మాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల నుండి చట్ట విరుద్ధంగా వేల రూపాయలు ఫీజులు పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, కాలేజీ, హైస్కూల్ మొత్తం విద్యార్థులు రోజువారి 150 మంది మాత్రమే మిడ్డే మిల్స్ వినియోగించుకున్నప్పటికీ, భోజన వసతి పేరుతో 470 మంది విద్యార్థులను లెక్క చూపిస్తూ ప్రజాధనం లూటీ చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడల్ కాలేజీ విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై అధికారులకు ఫిర్యాదు చేశామని విద్యార్థులను బెదిరిస్తూ మీ భవిష్యత్తు మా చేతుల్లో ఉందని మా చేత నిర్భంధంగా వారికి అనుకూలంగా లెటర్స్ వ్రాయించుకొని మమ్మల్ని వేదింపులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు.







సంతపేట సాయి మందిరంలో అంగరంగ వైభవంగా బ్రహ్మశ్రీ దక్షిణామూర్తి ఆధ్వర్యంలో శివకళ్యాణం నిర్వహించారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి శివ కళ్యాణంలో పాల్గొన్నారు. అళహరి చెంచలరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

11-11Pg5 9_11-11Pg5.qxd 10/Nov/25 9:57 PM Page 1



### భారత్ సరిహద్దుల చుట్టూ

# పాక్ ఉగ్ర కేంద్రాలు!



**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారత్ చుట్టూ ఉగ్రవాదాన్ని విస్తరించేందుకు పాకిస్థాన్ కుట్రలు పన్నుతుందని భారత నిఘా వర్గాలు గుర్తించాయి. భారత సరిహద్దు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉగ్ర నివాసాలు, శిక్షణ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్, నేపాల్ సరిహద్దులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉగ్ర స్థావరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు భారత ఇంటెలిజెన్స్‌ను ఉటంకిస్తూ ఆంగ్ల మాధ్యమ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ కార్యకలాపాలు మరింత వేగవంతమైనట్లు తెలుస్తోంది. ఉగ్రవాద శిక్షణ పొందే వారి కోసం బంగ్లాదేశ్, నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో కొత్త శిక్షణ శిబిరాలు, నివాస సముదాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. సరిహద్దులోని రాష్ట్రాల్లో ఇటీవల ఉగ్రవాద సంస్థలకు చెందిన వారిని అరెస్టు చేయగా, వారి విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను పెంచినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. పొరుగు దేశాల్లో విదేశీ నిధులతో ఏర్పాటవుతున్న పలు ప్రాజెక్టులపై కూడా నిఘా ఉంచినట్లు పేర్కొన్నాయి. లష్కరే తోయిబా, జైష్ ఏ మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలు నేపాల్‌లో తమ సంస్థలను విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆల్‌ఖైదా, ఐసిస్ గత ఐదు నెలలుగా బంగ్లాదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాయని తెలిపాయి. ఇందులో భాగంగా పాక్‌లోని పలు ప్రాంతాల నుంచి బంగ్లాదేశ్‌కు, నేపాల్‌కు నిరంతర వలసలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నాయి. ఆయా దేశాల్లో ఉగ్రవాద శిబిరాల నిర్మాణాలకు, నిర్వహణకు అవసరమైన నిధులను తుర్కియే సమకూరుస్తున్నట్లు సమాచారం. ఢాకాలోని జమాత్‌ఈఇస్లామీ కార్యాలయం పునరుద్ధరణకు టర్కీ నిఘా సంస్థ నిధులు సమకూర్చినట్లు కూడా ఈ నిఘా వర్గాలు వెల్లడించాయి.



# బీహార్‌లో మలి విడత పోలింగ్ నేడే

**- 122 అసెంబ్లీ నియోజకవర్గాలు.. 1,302 మంది అభ్యర్థులు - 3.70 కోట్ల మంది ఓటర్లు.. 45,399 పోలింగ్ కేంద్రాలు - 4 లక్షల మంది పోలీసులు, పారామిలటరీ బలగాలతో భద్రత - బరిలో పలువురు మంత్రులు, లెజిస్లేటివ్ లీడర్లు, పిసిసి చీఫ్ - 7 రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ స్థానాలకూ పోలింగ్..**

**న్యూఢిల్లీ, నవంబరు 10:** బీహార్ ఎన్నికల రెండవ మరియు చివరి దశ విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. 122 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం పోలింగ్ జరుగనుంది. నితీష్ కుమార్ ప్రభుత్వంలోని అరడజనుకు పైగా మంత్రులు సహా 1,302 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. 3.70 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్‌కు సంబంధించిన ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. తూర్పు, పశ్చిమ చంపారన్, సీతామర్హి, మధుబాని, సుపాల్, అరారియా, కిషన్‌గంజ్ తదితర జిల్లాలు నేపాల్ సరిహద్దులో ఉన్నందున కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. 4 లక్షలకు పైగా పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించారు. ఇక సీమాంచల్ ప్రాంతంలో ముస్లిముల ప్రాబల్యం అధికం. ఇక్కడ వారిదే నిర్ణయాత్మక ఓటు. మైనారిటీ ఓట్లపై ఆధారపడిన ఇండియా కూటమి, చొరబాటుదారులను రక్షిస్తోందంటూ ఆరోపిస్తున్న ఎన్‌డిఏ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రముఖ అభ్యర్థులలో జెడియు సీనియర్ నాయకుడు, రాష్ట్ర మంత్రివర్గంలో అత్యంత సీనియర్ సభ్యుడు బిజేంద్రప్రసాద్ యాదవ్ ఉన్నారు. ఆయన రికార్డు స్థాయిలో 8వ సారి తన సుపాల్ స్థానాన్ని నిలుపుకోవాలని చూస్తున్నారు. మరో మంత్రి, బిజెపి అభ్యర్థి ప్రేమ్‌కుమార్ పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. 1990 నుండి గయా నుండి ఏడుసార్లు గెలుపొందారు. ఈసారి మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీరితోపాటు బిజెపికి చెందిన రేణు దేవి (బెట్టయ్య), నీరజ్‌కుమార్ సింగ్ 'బబ్లూ' (ఛాతాపూర్), జెడియుకు చెందిన లేషి సింగ్ (ధమ్దహా), షీలా మండల్ (ఫుల్పరాస్), జామా ఖాన్ (చెయిన్‌పూర్) ఉన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి తార్కిషోర్ ప్రసాద్, వరుసగా ఐదోసారి కతిహార్ స్థానాన్ని నిలుపుకోవాలని చూస్తున్నారు. కతిహార్ జిల్లాలో బలరాంపూర్, కద్వా అసెంబ్లీ స్థానాలు కూడా ఉన్నాయి. ఇక్కడి సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతలు మెహబూబ్ ఆలం, షకీల్ అహ్మద్ ఖాన్ హ్యాట్రిక్ విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్‌డిఏ భాగస్వామి పక్షాలు కేంద్ర మంత్రి జితిన రామ్ మాంఝి నేతృత్వంలోని హిందూస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఎఎం), రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహ రాష్ట్రీయ లోక్ మోర్చాకు బలపరీక్షగా కూడా చూస్తున్నారు. ఈ రెండు పార్టీలు చెరో ఆరు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. హెచ్ఎఎం పోటీ చేసిన ఆరుస్థానాలకూ రెండో దశలో ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో నాలుగు ఇమామ్‌గంజ్, బారాచట్టి, టికారి, సికంద్రాలు ప్రస్తుతం పార్టీ ఆధీనంలో ఉన్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ తమ అదృష్టాన్ని పరీక్షించుకునే అవకాశమిచ్చింది. గత ఏడాది గయా నుండి లోక్‌సభకు ఎన్నికయ్యే వరకు మాంఝి ఇమామ్‌గంజ్ స్థానాన్ని కలిగి ఉన్నారు. తరువాత జరిగిన ఉప ఎన్నికలో దానిని అతని కోడలు దీప విజయం సాధించారు. దీపా తల్లి జ్యోతి దేవి బారాచట్టి నుంచి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇక ఆర్ఎల్ఎం అభ్యర్థులలో కుష్వాహ భార్య స్నేహలత ససారాం నుంచి, అతని విశ్వాసపాత్రుడు మాధవ్ ఆనంద్ మధుబని నుంచి తమ భవితవ్యం తేల్చుకోనున్నారు. మరో ముఖ్యమైన అభ్యర్థి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ కుమార్, ఆయన వరుసగా రెండోసారి 'కుటుంబ' నుంచి గెలుపొందాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఓటర్లు ఎవరు వైపు మొగ్గు చూపుతారో నవంబరు 14 కౌంటింగ్ రోజున తేలనుంది. బీహార్‌తోపాటు ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉప ఎన్నిక జరుగనుంది. ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జమ్మూకాశ్మీర్‌లోని బుద్గామ్, నగ్రోటా, అంటా (రాజస్థాన్), ఘట్‌శిలా (జార్ఖండ్), జూబ్లీహిల్స్ (తెలంగాణ), టర్న్ టరన్ (పంజాబ్), డంపా (మిజోరం), నువాడ (ఒడిశా) నియోజకవర్గాల్లోనూ మంగళవారం పోలింగ్ జరుగనుంది. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేశారు.

## కోల్‌కతాలో స్పైస్‌జెట్ అత్యవసర ల్యాండింగ్

**కోల్‌కత్తా, నవంబరు 10:** ముంబై నుంచి కోల్‌కతా వెళ్తున్న స్పైస్‌జెట్ విమానానికి త్రుటిలో ప్రమాదంతప్పింది. విమానం గాల్లో ఉండగా ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో కోల్‌కతా విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది అంతా సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. స్పైస్‌జెట్‌కు చెందిన ఎస్‌జీ 670 విమానం ఆదివారం రాత్రి ముంబై నుంచి కోల్‌కతాకు బయలుదేరింది. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ కోసం కిందకు దిగుతున్న సమయంలో, విమానంలోని ఒక ఇంజిన్ విఫలమైనట్లు పైలట్లు గుర్తించారు. వెంటనే వారు అప్రమత్తమై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)కు సమాచారం అందించారు. పైలట్ల నుంచి సమాచారం అందగానే విమానాశ్రయ అధికారులు వెంటనే ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. అగ్నిమాపక, సహాయక బృందాలను రన్‌వే వద్ద సిద్ధంగా ఉంచారు. రాత్రి 11:38 గంటలకు విమానం సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత ఫుల్ ఎమర్జెన్సీని ఉపసంహరించుకున్నట్లు ఓ అధికారి తెలిపారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా విమానం నుంచి కిందకు దించారు. ఈ ఘటనపై స్పైస్‌జెట్ సంస్థ ఈ ఉదయం ఒక ప్రకటన విడుదల చేసింది. కోల్‌కతాలో ల్యాండింగ్ సమయంలో తమ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తిన మాట వాస్తవమేనని, అయితే విమానం సురక్షితంగా ల్యాండ్ అయిందని తెలిపింది. "ప్రయాణికులు, సిబ్బంది అందరూ సాధారణంగానే విమానం నుంచి కిందకు దిగారు" అని స్పైస్‌జెట్ ప్రతినిధి వివరించారు. ప్రస్తుతం విమానాన్ని ఇంజినీరింగ్ బృందాలు క్షుణ్ణంగా పరీక్షిస్తున్నాయని సంస్థ పేర్కొంది.

# విద్యాసంస్థల్లో వందేమాతరం పాడాల్సిందే

**- ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్**



**గోరఖ్‌పూర్, నవంబరు 10:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అన్ని విద్యాసంస్థల్లో వందేమాతరం గీతం ఆలపించాల్సిందేనని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. ప్రతి పాఠశాల, విద్యా సంస్థలో 'వందేమాతరం' పాడటం తప్పనిసరి చేస్తామన్నారు. గోరఖ్‌పూర్‌లో సోమవారం ఏక్తా యాత్ర కార్యక్రమంలో సిఎం యోగి మాట్లాడుతూ, ఈ చర్య భారత మాత, మాతృభూమి పట్ల పౌరులలో భక్తి భావాలను ప్రేరేపిస్తుందన్నారు. జాతీయ గీతం వందేమాతరం పట్ల ప్రతి పౌరుడిలో గౌరవ భావం ఉండేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సిఎం ఆదిత్యనాథ్ వివరించారు. ఇలా ప్రతీ పాఠశాలలో జాతీయ గేయాన్ని పాడటం ద్వారా.. పిల్లలకు చిన్ననాటి నుంచే దేశభక్తితో పాటు జాతీయ గేయంపై గౌరవభావం వంటివి అలవడతాయన్నారు. వందేమాతరంను వ్యతిరేకించే వారు దేశ ఐక్యత, సమగ్రతను అవమానించినట్టేనని ఈ సందర్భంగా యోగి అన్నారు. దేశంలో నివసించే ప్రతి పౌరుడూ విధేయతగా, ఐక్యత కోసం పనిచేయాలని కాంక్షిస్తున్నట్టు ఆయన చెప్పారు. కులం, ప్రాంతం, భాషల పేరుతో సమాజాన్ని విభజించే వంటి అంశాలను గుర్తించి ఎప్పటికప్పుడు వాటిని వ్యతిరేకించాలని యోగి సూచించారు. ఇలాంటి విభజనలు కొత్త జిన్నాలను సృష్టించే కుట్రలో భాగమని అని ఆయన చెప్పుకొచ్చారు. దేశంలో నూతన జిన్నాలకు తెరలేపకుండా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.



# జడ్జిలపై ఆరోపణలు చేయడం ఫ్యాషనైపోయింది

**- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్**

**న్యూఢిల్లీ, నవంబరు 10:** జడ్జిలపై ఆరోపణలు చేయడం ఇటీవల ట్రెండ్‌గా మారిపోయిందని, ఇది న్యాయ వ్యవస్థకు మంచిది కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అభిప్రాయపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రానప్పుడు న్యాయవాదులు ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై సిజె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి పద్ధతులను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఎన్. పెద్దిరాజు అనే వ్యక్తిపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా సీజేఐ సోమవారం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మోషుమి భట్టాచార్యపై పెద్దిరాజు తీవ్రమైన ఆరోపణలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసింది. అయితే, పిటిషనర్ పెద్దిరాజు చెప్పిన క్షమాపణను సదరు న్యాయమూర్తి అంగీకరించారని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోర్టుకు తెలిపారు. దీంతో ధర్మాసనం ఈ కేసును మూసివేసింది. అయినప్పటికీ, ఈ ధోరణిపై చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "న్యాయస్థానానికి సేవకులుగా ఉండే న్యాయవాదులకు కోర్టు పట్ల ఒక బాధ్యత ఉంటుంది.

శిక్షించడంలో కాదు, క్షమాపణ చెప్పినప్పుడు క్షమించడంలోనే చట్టం గొప్పతనం ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న హైకోర్టు న్యాయమూర్తే క్షమాపణను అంగీకరించారు. కాబట్టి తాము ఈ కేసును ముందుకు తీసుకెళ్లడం లేదు. అయితే, న్యాయమూర్తులపై ఆరోపణలు చేసే పిటిషన్లపై సంతకాలు చేసే ముందు న్యాయవాదులు చాలా జాగ్రత్తగా ఉండాలి" అని సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఈ నెల 23న పదవీ విరమణ చేయనున్న సిజెఐ బిఆర్ గవాయ్, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి చర్యల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.



# కెంపెగౌడ ఎయిర్‌పోర్టులో ముస్లింల నమాజ్

### తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసిన బిజెపి


**బెంగళూరు, నవంబరు 10:** కర్ణాటకలో మరో కొత్త వివాదం రాజుకుంది. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో కొందరు నమాజ్ చేయడంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హై సెక్యూరిటీ జోన్‌లో ఇలాంటి వాటికి ఎలా అనుమతి ఇచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పష్టతనివ్వాలని డిమాండ్ చేసింది. ఈ ఘటన కెంపెగౌడ విమానాశ్రయంలోని టెర్మినల్ 2లో జరిగినట్లు బీజేపీ అధికార ప్రతినిధి విజయ్ ప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన ఫోటో, వీడియోను ఆదివారం రాత్రి ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "హై సెక్యూరిటీ జోన్‌లో నమాజ్ చేయడానికి వీరు ముందస్తు అనుమతి పొందారా ఇది అత్యంత సున్నితమైన ప్రాంతంలో తీవ్రమైన భద్రతా సమస్య కాదా అని ఆయన ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ నిబంధనల ప్రకారం అనుమతి తీసుకుని పథ సంచలన్ నిర్వహిస్తే అభ్యంతరం చెప్పే ప్రభుత్వం, ఇలాంటి కార్యకలాపాలను ఎందుకు చూసీచూడనట్లు వదిలేస్తోందని ఆయన విమర్శించారు. టెర్మినల్ 2లో భారీ భద్రత ఉంటుంది. కానీ పోలీసులు గానీ, ఇతర సిబ్బంది గానీ వారిని ఆపడానికి ప్రయత్నించలేదు. ఇది ఒక వర్గాన్ని సంతృప్తిపరిచే కాంగ్రెస్ ప్రభుత్వ తీరును స్పష్టం చేస్తోంది. ఈ చర్యను సీఎం, ఐటీ మంత్రి సమర్థిస్తారా అని విజయ్ ప్రసాద్ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, బహిరంగ ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రైవేటు సంస్థలు అనుమతి తీసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశం కేవలం ఆర్ఎస్ఎస్‌ను లక్ష్యంగా చేసుకున్నది కాదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల స్పష్టం చేశారు. ఆ ఉత్తర్వుల్లో మేము ఎక్కడా ఆర్ఎస్ఎస్ పేరును ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. ఏ సంస్థ అయినా కార్యక్రమం నిర్వహించాలంటే జిల్లా అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. దాన్ని వారు ఆర్ఎస్ఎస్ గురించి అనుకుంటే మేమేం చేయగలమనివ్యాఖ్యానించారు.

# ఆధార్ కస్టమర్ల కోసం కొత్త మొబైల్ అప్లికేషన్!

**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) ఆధార్ వినియోగదారుల కోసం మరో కొత్త మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్‌లోనే ఆధార్ వివరాలను సురక్షితంగా భద్రపరచుకోవడంతో పాటు, అవసరమైన సమాచారాన్ని సులభంగా పంచుకునేందుకు ఈ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు యూఐడీఏఐ తెలిపింది. ఈ కొత్త యాప్‌తో ఇకపై భౌతికంగా ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని, ఇది పూర్తిస్థాయి పేపర్‌లెస్ అనుభవాన్ని అందిస్తుందని పేర్కొంది. ఈ యాప్‌లో పలు ఆకర్షణీయమైన ఫీచర్లను పొందుపరిచారు. ముఖ్యంగా, ఒకే డివైజ్‌లో కుటుంబ సభ్యులందరి ఆధార్ వివరాలను కూడా భద్రపరచుకునే వెసులుబాటు కల్పించారు. వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫేస్ అథెంటికేషన్ ద్వారా లాగిన్ అయ్యే సౌకర్యం కల్పించారు. మన ఆధార్ వివరాలను ఇతరులతో పంచుకోవాల్సి వచ్చినప్పుడు, కేవలం అవసరమైన సమాచారాన్ని మాత్రమే పంపే అవకాశం కూడా ఉంది. బయోమెట్రిక్ వివరాలను లాక్ లేదా అన్‌లాక్ చేసుకునే ఆప్షన్, ఆధార్ కార్డు చివరిసారిగా ఎక్కడ ఉపయోగించారో తెలుసుకునే హిస్టరీని చెక్ చేసుకునే సౌకర్యం కూడా ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఎంఆధార్ యాప్‌కు ఇది ప్రత్యామ్నాయం కాదని యూఐడీఏఐ స్పష్టం చేసింది. ఎంఆధార్‌లో లభించే డిజిటల్ కార్డు డౌన్‌లోడ్, పీవీసీ కార్డు ఆర్డర్, మొబైల్/ఈ మెయిల్ వెరిఫికేషన్ వంటి సేవలు ఈ కొత్త యాప్‌లో ఉండవు. కేవలం ఆధార్ డేటాను సురక్షితంగా నిల్వ చేయడం, షేర్ చేయడం కోసమే దీనిని తీసుకొచ్చారు. ఆండ్రాయిడ్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐఫోన్ యూజర్లు యాపిల్ యాప్ స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాక, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఓటీపీ, ఫేస్ అథెంటికేషన్ పూర్తి చేయాలి. అనంతరం, భద్రత కోసం ఒక పిన్ నంబర్‌ను సెట్ చేసుకుని యాప్‌ను ఉపయోగించడం ప్రారంభించవచ్చు. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సేవలు మరింత సులభంగా, సురక్షితంగా మారతాయని అధికారులు భావిస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### దగ్గుమందు తయారీకి మార్గదర్శకాలు



**న్యూఢిల్లీ, నవంబర్ 10:** కోల్డ్‌రిఫ్ దగ్గుమందు వల్ల ఆయా రాష్ట్రాల్లో చిన్నారులు మృతి చెందిన ఘటన కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఔషధ తయారీదారులకు కేంద్ర ప్రభుత్వం అల్టిమేటం ఇచ్చింది. జనవరి ఒకటి నాటికి అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. లేకపోతే కంపెనీలు మూసుకోవాల్సిందేనని హెచ్చరించింది. ఈ మేరకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆదేశాలు జారీ చేసింది. జనవరి ఒకటి నాటికి ఔషధ తయారీ సంస్థలు గ్లోబల్ గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్‌కు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ తేదీలో ఎలాంటి పొడిగింపులు ఉండవని తేల్చి చెప్పింది. భారత్‌లో తయారైన కొన్ని దగ్గుమందుల వల్ల స్వదేశంతో పాటు విదేశాల్లో పిల్లల మరణాలు సంభవించిన సంగతి తెలిసిందే. భారత్ నుంచి ఎగుమతి అయిన ఈ మందుల వల్ల గాంబియా, ఉజ్బెకిస్థాన్ దేశాల్లో చిన్నారులు మృతి చెందారు.

### భారత్‌లో అమెరికా రాయబారిగా సెర్గియోగోర్



**వాషింగ్టన్, నవంబరు 10:** భారత్‌లో అమెరికా కొత్త రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా పాల్గొననున్నారు. సోమవారం జరగనున్న ఈ కార్యక్రమానికి ట్రంప్ హాజరవుతారని వైట్‌హౌస్ ఆదివారం ఒక ఈమెయిల్‌లో అధికారికంగా ధ్రువీకరించింది. ట్రంప్‌కు అత్యంత సన్నిహితులలో ఒకరిగా పేరున్న సెర్గియో, ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే న్యూఢిల్లీలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కేవలం 38 ఏళ్ల వయసున్న సెర్గియో గోర్, భారత్‌లో అమెరికా రాయబారిగా పనిచేయనున్న అత్యంత పిన్న వయస్కుడిగా నిలవనున్నారు. గతంలో వైట్‌హౌస్‌లో ప్రెసిడెన్షియల్ పర్సనల్ ఆఫీస్ డైరెక్టర్‌గా సేవలందించారు.

### ప్రముఖ తమిళనటుడు అభినయ్‌కింగర్ మృతి



**చెన్నై, నవంబరు 10:** తమిళ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటుడు అభినయ్ కింగర్ ఈ ఉదయం కన్నుమూశారు. గత కొన్నేళ్లుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో కోలీవుడ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. అరుముగ్, ఆరోహణం, సక్సెస్ వంటి పలు చిత్రాల్లో నటించి అభినయ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన చివరిసారిగా వల్లవనుక్కు పుల్లుం ఆయుధం అనే చిత్రంలో కనిపించారు. అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో నటనకు పూర్తిగా దూరమై చికిత్స తీసుకుంటున్నారు. మరణాన్ని ముందే ఊహించినట్లుగా మూడు నెలల క్రితం అభినయ్ ఒక వీడియోను విడుదల చేశారు. అందులో తాను కేవలం ఏడాదిన్నర మాత్రమే జీవిస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు.

### ఆస్ట్రేలియాలో మైనర్లకు సోషల్ మీడియా

**కాన్‌బెర్రా, నవంబరు 10:** పిల్లల ఆన్‌లైన్ భద్రతను పరిగణనలోనికి తీసుకుని ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రధాననిర్ణయాన్ని ప్రకటించింది. దేశవ్యాప్తంగా 16 సంవత్సరాలలోపు వయసున్న పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం విధిస్తున్నట్లు ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు. ఈ కొత్త నిబంధన ఈ ఏడాది డిసెంబర్ 10వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు 'ఆన్‌లైన్ సేఫ్టీ అమెండ్‌మెంట్ (సోషల్ మీడియా మినిమమ్ ఏజ్) బిల్ 2024' పేరుతో ప్రభుత్వం ఒక కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం 16 ఏళ్లలోపు మైనర్లు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, స్నాప్‌చాట్, ఎక్స్ (గతంలో ట్విట్టర్), యూట్యూబ్, రెడ్డిట్, కిక్ వంటి ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో అకౌంట్లు తెరవడం లేదా వాటిని వినియోగించడం చట్టవిరుద్ధం అవుతుంది.

### అనుమానాస్పద స్థితిలో మోడల్ మృతి

**భోపాల్, నవంబరు 10:** అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన ఒక మోడల్‌ను ఆమె ప్రియుడు ఆసుపత్రిలోనే వదిలేసి వెళ్లిపోయాడు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. 27 ఏళ్ల ఖుష్బూ అహిర్వార్ అలియాస్ ఖుషీ వర్మ కాలేజీ చదువును మధ్యలో మానేసింది. మోడల్‌గా ఆమె చేస్తున్నది. పలు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కూడా చేసింది. 'డైమండ్ గర్ల్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పోస్టులతో ఆమె పాపురల్ అయ్యింది. కాగా, మోడల్ గత మూడేళ్లుగా భోపాల్‌లో నివసిస్తున్నది.

## సుంకాల రాబడుల్లో ప్రతి అమెరికన్‌కు 2 వేల డాలర్లు

### అమెరికన్లకు ట్రంప్ తీపి కబురు

**వాషింగ్టన్, నవంబరు 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దూకుడైన టారిఫ్ విధానాన్ని సమర్థించుకుంటూ సంచలన ప్రకటన చేశారు. తన ప్రభుత్వం టారిఫ్ పన్నుల ద్వారా వసూలు చేస్తున్న ఆదాయం నుంచి త్వరలోనే ప్రతి అమెరికన్‌కు కనీసం 2వేల డాలర్ల చొప్పున పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, అధిక ఆదాయం ఉన్న సంపన్నులకు ఈ పథకం వర్తించదని ఆయన స్పష్టం చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా ఈ ప్రకటన చేశారు. తన టారిఫ్ విధానాన్ని విమర్శిస్తున్న వారిపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టారిఫ్‌లను వ్యతిరేకించేవాళ్లు మూర్ఖులని ఘాటుగా వ్యాఖ్యానించారు. తన హయాంలోనే అమెరికా ప్రపంచంలోనే అత్యంత సంపన్న, గౌరవనీయమైన దేశంగా మారిందని, ద్రవ్యోల్బణం దాదాపు లేదని, స్టాక్ మార్కెట్ రికార్డు స్థాయిలో ఉందని ఆయన చెప్పుకొచ్చారు. టారిఫ్ పన్నుల ద్వారా దేశానికి ట్రిలియన్ల కొద్దీ డాలర్ల ఆదాయం వస్తోందన్నారు.




# ఉగ్రవాదుల ఏరివేతలో తొమ్మిది మంది అరెస్ట్

**భారీ ఎత్తున ఆయుధాలు, సామగ్రి స్వాధీనం**

**శ్రీనగర్, నవంబరు 10:** జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు భారీ ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌ను చేపట్టాయి. లోయ వ్యాప్తంగా పలు జిల్లాల్లో విస్తృతంగా నిర్వహిస్తున్న సోదాల్లో భాగంగా నిన్న ఒక మహిళ సహా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్ నేడు కూడా కొనసాగుతోంది. ఉగ్రవాదుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇంటెలిజెన్స్ వర్గాల నివేదికల ప్రకారం ఎత్తైన పర్వత ప్రాంతాల్లో క్రియాశీలంగా ఉన్న ఉగ్రవాదులు శీతాకాలం సమీపిస్తుండటంతో మైదాన ప్రాంతాల్లో సురక్షితమైన ఆశ్రయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. రాంబన్, కిష్త్వార్, దోడా, కథువా, రియాసి, పూంచ్, రాజౌరి జిల్లాల్లోని డజన్ల కొద్దీ ప్రదేశాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ దాడులు, సోదాలు సోమవారం కూడా నిరంతరాయంగా కొనసాగాయి. అనుమానిత స్థావరాలపై భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఉగ్రవాదుల ప్రణాళికలను భగ్నం చేసి, వారిని ఏరివేయడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ జరుగుతోంది. అదుపులోకి తీసుకున్న నిందితులపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) సెక్షన్లు 13, 28, 38, 39 కింద, అలాగే ఆయుధాల చట్టంలోని సెక్షన్ 7/25 కింద కేసులు నమోదు చేశారు. లోయలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి ప్రయత్నాన్నైనా అడ్డుకునేందుకు భద్రతా బలగాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాయి. నిషేధిత ఉగ్రవాద సంస్థలు జైష్ ఏ మొహ్మద్, అన్సార్ ఘజ్వత్ ఉల్ హింద్‌తో సంబంధం ఉన్న ఓ అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌ను జమ్మూ కశ్మీర్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో పలువురు కీలక అనుమానిత ఉగ్రవాదులను అరెస్టు చేయడంతో పాటు భారీగా ఆయుధాలు, మందుగుండు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్టోబర్ 19న శ్రీనగర్‌లోని బున్‌పోరా, నౌగామ్‌లో పోలీసులు, భద్రతా దళాలను హెచ్చరిస్తూ జైష్ ఏ మహ్మద్ పోస్టర్‌లు వెలిశాయి. ఆ తర్వాత పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెట్‌వర్క్‌లో పలువురు విద్యావంతులతో పాటు, ప్రొఫెషనల్స్ ఉన్నారని.. విదేశీయ పరిచయాల ద్వారా పని చేస్తున్నట్లుగా తేలింది.

11-11pg6exHMNWJQE 10_11-11pg6exHMNWJQE.qxd 10/Nov/25 10:21 PM Page 1



# మెడికల్ కాలేజీల ఫీజులు ఖరారు

విజయవాడ, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రైవేటు అన్‌ఎయిడెడ్ ప్రొఫెషనల్ వైద్య, దంత వైద్య కళాశాలల్లో సూపర్ స్పెషాలిటీ, పీజీ, యూజీ కోర్సులకు 202526 విద్యా సంవత్సరానికి ఫీజుల్ని ప్రభుత్వం ఖరారు చేసింది. 202023 బ్లాక్ పీరియడ్‌లో ఉన్న ఫీజుపై యూజీ కోర్సులకు 10శాతం, సూపర్ స్పెషాలిటీ, పీజీ కోర్సులకు 15శాతం చొప్పున పెంపును తాత్కాలికంగా ఆమోదించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ మూడు వేర్వేరు ఉత్తర్వులిచ్చింది. సుప్రీంకోర్టు, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల తుది తీర్పునకు లోబడి ఈ ఫీజు నిర్ణయం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. సూపర్ స్పెషాలిటీ కోర్సులకు వచ్చేసరికి జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, కాటూరి మెడికల్ కాలేజీ, నారాయణ మెడికల్ కాలేజీ, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, డాక్టర్ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్య కళాశాలలకు రూ.17.25 లక్షలుగా ఫీజును నిర్ధారించింది. ఎంబీబీఎస్‌లో కేటగిరీల ప్రకారం ఫీజు వివరాలు గమనిస్తే ఏకేటగిరీ ఫీజు రూ.16,500, బీకేటగిరీ ఫీజు రూ. 13.20 లక్షలు (మేనేజ్‌మెంట్ కోటా), సీ కేటగిరీ ఫీజుగా రూ.39.60 లక్షలు (ఎన్ఆర్ఐ కోటా) నిర్ణయించారు. బీడీఎస్ (డెంటల్)కు వచ్చే సరికి ఏకేటగిరీ ఫీజు రూ. 14,300, బీకేటగిరీ ఫీజు: రూ.4.40 లక్షలు (మేనేజ్‌మెంట్ కోటా), సీ కేటగిరీ ఫీజు రూ.13.20 లక్షలు (ఎన్ఆర్ఐ కోటా)గా ఉంది. పీజీ కోర్సులకు మెడికల్ విభాగంలో ఫీజుల వివరాలను గమనిస్తే క్లినికల్ డిగ్రీ కోర్సులకు ఏ కేటగిరీ ఫీజు రూ.4,96,800 (కన్వీనర్ కోటా), బీ కేటగిరీ ఫీజు రూ.9,93,600 (మేనేజ్‌మెంట్), సీ కేటగిరీ ఫీజు రూ.57.50 లక్షలు (ఎన్ఆర్ఐ/ ఇన్‌స్టిట్యూషనల్)గాను నిర్ణయించారు. ఇక పారా క్లినికల్ డిగ్రీ కోర్సులకు ఏ కేటగిరి ఫీజుగా రూ.1,55,250 (కన్వీనర్), బీ కేటగిరీ ఫీజుగా రూ.3,10,500 (మేనేజ్‌మెంట్), సీ కేటగిరీ ఫీజుగా రూ.17.25 లక్షలు (ఎన్ఆర్ఐ/ ఇన్‌స్టిట్యూషనల్), ప్రీ క్లినికల్ డిగ్రీ కోర్సులు ఏ కేటగిరీ ఫీజుగా రూ.70,380 (కన్వీనర్), బీ కేటగిరీ ఫీజుగా రూ.1,40,760 (మేనేజ్ మెంట్), సీ కేటగిరీ ఫీజుగా రూ.9.20 లక్షలు (ఎన్ఆర్ఐ/ ఇన్‌స్టిట్యూషనల్) నిర్ణయించారు. డెంటల్ విభాగంలో క్లినికల్ డిగ్రీ కోర్సులకు ఏ కేటగిరీ ఫీజు రూ.3,41,550 (కన్వీనర్), బీ కేటగిరీ ఫీజు రూ.6,83,100 (మేనేజ్‌మెంట్), సీ కేటగిరీ ఫీజు రూ.13.80 లక్షలు (ఎన్ఆర్ఐ/ ఇన్‌స్టిట్యూషనల్)గా నిర్ణయించారు.

## వర్షపు నీటిని ఒడిసి పడదాం... జీవనాధారం పెంచుదాం

# అభివృద్ధికి బాటలు వేద్దాం

- యేటా 25 వేల చెరువులు పునర్నిర్మాణం
- వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: వర్షపు నీటిని ఒడిసి పడదాం.. జీవనాధారం పెంచుదాం అని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. వాటర్ షెడ్ మహోత్సవ్‌పై రెండు రోజుల జాతీయ సదస్సు గుంటూరులోని ఓ హోటల్లో సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరులో మూడవ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం మంచి పథకాలు అమలు చేస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి విజన్‌తో ఆ పథకాలను చక్కగా ఉపయోగించుకుని దేశంలోనే ఆదర్శంగా ఉండాలని, ముందు వరసలో నిలబడాలనే ఆశయంతో అడుగులు వేస్తున్నామని చెప్పారు. అభివృద్ధికి మన రాష్ట్రం, మన ప్రాంతం నుండి మంచి భాగస్వామ్యం ఉండాలని ఆశిస్తున్నానని తెలిపారు. జులై నుండి సెప్టెంబర్ వరకు మంచి వర్షాలు కురుస్తాయని, ఆ వర్షపు నీటిని ఒడిసి పట్టి అభివృద్ధికి, జీవనోపాధికి అడుగులు వేయాలని పేర్కొన్నారు. ప్రతి ఏడాది 1700 క్యూబిక్ మీటర్ల నీటి అవసరం ఉందని గుర్తించడం జరిగిందని, అంతకంటే తక్కువ నీరు ఉంటే నీటి కొరతగా పరిగణించడం జరుగుతుందని అన్నారు. నీటి భద్రత జాతీయ భద్రతగా ప్రధాని పరిగణిస్తున్నారని తెలిపారు. ఇందుకు గాను వాటర్ షెడ్ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నీటిని సద్వినియోగం చేసుకోవడం వల్ల వివిధ రంగాల్లో ఆరు రెట్ల ఉత్పాదకత సాధించవచ్చని చెప్పారు. రెండు, మూడు పంటలు వేసుకునే అవకాశం ఉందని, భూగర్భ జలాలు కనీసం మూడు మీటర్ల పెరుగుదల ఉంటుందని అన్నారు. 2021 నుంచి 26 సంవత్సరం వరకు వాటర్ షెడ్ 2.0ను రూ.13 వేల కోట్లతో అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం సమీకృత విధానంలో చేపట్టుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు మేథోమదనం జరగాల్సిన అవసరం ఉందని వివరించారు. శాఖల మధ్య సమన్వయం, సహకారం అవసరమని, అలా కాకపోతే అమలులో జాప్యం జరిగే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రజలకు, సమాజానికి అవగాహన లేకపోవడం వలన ప్రయోజనాలు కోల్పోయే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రభుత్వ పరంగా చేపట్టిన పనులు నిర్వహణ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవలసిన అవసరాన్ని గుర్తుచేశారు. వాటర్ షెడ్ పథకాల అమలు ప్రాధాన్యతను నొక్కి చెపుతూ కరువు తాండవించే ప్రాంతాలకు ఎక్కువ ప్రాధాన్యత అవసరం అన్నారు. ప్రతి ఏడాది కనీసం 25 వేల వరకు చెరువులు పునఃనిర్మాణం చేయుట వరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల భాగస్వామ్యం, సమన్వయం, అవగాహనతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని, జీవనోపాధులకు బాటలు వేయవచ్చని అన్నారు. వెంగళాయపాలెంలో వాటర్ షెడ్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ సరోవర్ క్రింద 21 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును ఆహ్లాదకరంగా తయారు చేయడమే కాకుండా చుట్టూ చక్కటి ఉద్యాన వనంగా తీర్చిదిద్దడం జరిగిందని, చిన్నారులకు క్రీడా పరికరాలను, యోగ, వ్యాయామం చేయుటకు అనుగుణంగా పనులను చేపట్టామని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

కేంద్ర ప్రభుత్వ భూ సంస్కరణల విభాగం కార్యదర్శి మనోజ్ జోషి మాట్లాడుతూ ప్రభుత్వం దేశంలో నలుమూలలకు నీటి వసతులు కల్పనకు వాటర్ షెడ్ ద్వారా నిధులు సమకూర్చుతుందన్నారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. కొన్ని రాష్ట్రాలు త్వరగా మంచి పనులు పూర్తి చేస్తున్నాయని ప్రశంసించారు.

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ నీటి వసతులను పునరుద్ధరణ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా "ఎన్స్యూరింగ్ వాటర్ సెక్యూరిటీ, నర్చరింగ్ వేస్ట్ లాండ్, ఎంపవరింగ్ రూరల్ లైవ్లి హుడ్స్" రాజస్థాన్" అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రెటరీ నితిన్ కడే, రాష్ట్ర పంచాయతీ రాజ్ సంచాలకులు మైలవరపు కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సి.పి.రెడ్డి, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గ్రామీణ అభివృద్ధి శాఖ వాటర్ షెడ్ విభాగం సంచాలకులు వై.వి.కె. షణ్ముఖ కుమార్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# మీడియా రిలేషన్స్ పోర్టల్ ప్రారంభం

విజయవాడ (గన్నవరం), నవంబరు 10 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న జర్నలిస్ట్‌లకు అక్రిడిటేషన్‌లు జారీచేసేందుకు మీడియా రిలేషన్స్‌పోర్టల్‌ను ప్రారంభించారు. సోమవారం అమరావతిలోని సచివాలయం ప్రచార విభాగంలో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర సమాచార శాఖా మంత్రి కె.పి.సారధి, సమాచారశాఖ సంచాలకులు కెఎస్.విశ్వనాథ్‌తో కలిసి మీడియారిలేషన్స్ పోర్టల్ (వెబ్‌సైట్)ను ప్రారంబించారు. రాష్ట్రంలోని వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్ట్‌లకు గతంలో మంజూరు చేసిన అక్రిడిటేషన్‌ల గడవు ఈనెలాఖరుతో ముగియనుండగా, 2026-27 రెండేళ్ళ కాలపరిమితితో కూడిన అక్రిడిటేషన్‌లు మంజూరు చేసేందుకు గానూ ఈవెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో అర్హత కలిగిన జర్నలిస్ట్‌లు ఈవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈపోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న జర్నలిస్ట్‌లు తమ ధరఖాస్తు ఏదశలో ఉందో తెలుసుకునేందుకు వీలుకలుగుతుంది. ఈపోర్టల్ గురించి ఇప్పటికే సమాచారశాఖ అధికారులకు అవగాహన కల్పించామని సంచాలకులు తెలిపారు. ఈపోర్టల్‌లో ధరఖాస్తు చేసుకునే విధి విధానాలను మంగళవారం ప్రకటిస్తామని ఆయన చెప్పారు.



# కలసి పని చేద్దాం.. పర్యాటక అభివృద్ధి సాధిద్దాం

**పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తే భరోసా కల్పిస్తాం: మంత్రి దుర్గేష్**

**విజయవాడ నుండి సింగపూర్ నాన్ స్టాప్ ఫ్లైట్ పోస్టర్ ఆవిష్కరణ**



విజయవాడ, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఆర్థిక పురోగతి, ఉపాధి అవకాశాలు, రాష్ట్రానికి ప్రాచుర్యం కల్పించడమే లక్ష్యంగా కలిసి దేశ, విదేశాల్లో పర్యటిద్దామని తద్వారా పర్యాటక పెట్టుబడులు సాధించి ఆకాశమే హద్దుగా పర్యాటకాభివృద్ధి చేద్దామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. సోమవారం విజయవాడలోని గుణదలలో ఓ హోటల్‌లో ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో టూరిజం స్టేక్ హోల్డర్లతో నిర్వహించిన చర్చా వేదికలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నవంబర్ 15న విజయవాడ నుండి సింగపూర్ ఇండిగో నాన్ స్టాప్ ఫ్లైట్ కు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. నూతన పర్యాటక రంగ పాలసీతో అభివృద్ధికి అడుగులు పడ్డాయని, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల భాగస్వామ్యంతో పర్యాటకం పరుగులు పెడుతుందని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. అందరికీ ఉపయోగపడేలా పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదాను కల్పించడంతో పాటు, సరికొత్త పర్యాటక పాలసీని తీసుకురావడం ఈ రంగ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఉపాధి కల్పించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని మంత్రి దుర్గేష్ అన్నారు. సరైన రీతిలో అభివృద్ధి చెందితే టూరిజం ద్వారా లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించడానికి వీలు కలుగుతుందన్నారు. రాష్ట్రానికి ఉన్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం పీపీపీ విధానంపై ఆధారపడిందని, ఆ దిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని భావిస్తుందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. పీపీపీ విధానంలో ఇన్వెస్టర్లు ముందుకొస్తే ప్రభుత్వం తరపున ల్యాండ్ పార్సల్, రాయితీలు, ప్రోత్సాహకాలు తదితర అవసరమైన సహకారం అందిస్తామన్నారు. మంచి గ్రూప్‌లతో టైఅప్ అవ్వాలని సూచిస్తూ ఆకాశమే హద్దుగా అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వ పరంగా ఏ ఇబ్బందులు లేకుండా సింగిల్ విండో విధానంలో త్వరితగతిన అనుమతులు జారీ చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పర్యాటక, ఆతిథ్య రంగాలకు స్వర్గధామమని, ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని, ఇన్వెస్టర్లకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీటీడీసీ చైర్మన్ డా. నూకసాని బాలాజి, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ, ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు పొట్లూరి భాస్కరరావు, సుబ్బారావు రావూరి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బి.రాజశేఖర్, ఏపీ హోటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వి.స్వామి, పలువురు పర్యాటక సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### విజయవాడ టు తిరుపతి కొత్తగా వందేభారత్

# ప్రయాణం ఇక 4.30 గంటలే!




విజయవాడ, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ నుంచి తిరుపతికి ఇకపై నాలుగున్నర గంటలే ప్రయాణ సమయం పట్టనున్నది.ఆ దిశలో విజయవాడ,తిరుపతి బెంగుళూరు మధ్యనడిచే వందేభారత్ రైలు అందుబాటులోకి రానున్నది. విజయవాడ బెంగళూరు మధ్య నడిచే వందే భారత్ రైలు ప్రతిపాదనలు గత మే నెలలోనే సిద్ధం అయ్యాయి. ఈ నెలాఖరులో ఈ వందేభారత్ రైలు ప్రారంభం కానుంది. విజయవాడ నుంచి బెంగళూరుకు కేవలం తొమ్మిది గంటల్లోనే చేరుకోవచ్చు. మొత్తం 8 బోగీలు, 7 ఏసీ చైర్‌కార్, ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ కలిగిన బెంగళూరు ట్రెయిన్ తిరుపతి వెళ్లే భక్తులకూ ఉపయోగపడనుంది. విజయవాడ బెంగళూరు ఈ వందే భారత్ ట్రైన్ మంగళవారం మినహా మిగతా అన్ని రోజుల్లో అందుబాటులో ఉంటుంది. విజయవాడలో తెల్లవారుజామున 5.15 గంటలకు బయలుదేరి తెనాలి, ఒంగోలు నెల్లూరు మీదుగా ఉదయం 9.45 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. అదే విధంగా చిత్తూరు, కాట్పాడి జంక్షన్, కృష్ణరాజపురం మీదుగా బెంగళూరు (ఎస్ఎంవిటీ)కి మధ్యాహ్నం 2.15గంటలకు చేరుతుంది. అంటే తిరుపతి వెళ్లే యాత్రికులు కేవలం నాలుగున్నర గంటల్లోనే విజయవాడ నుంచి చేరుకోవచ్చు. అదే విధంగా తిరుగు ప్రయాణంలో ఈ ట్రైన్ (20712) బెంగళూరులో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి కృష్ణరాజపురం, కాట్పాడి, జంక్షన్, చిత్తూరు మీదుగా సాయంత్రం 6.55గంటలకు తిరుపతి చేరుకుంటుంది. నెల్లూరు, ఒంగోలు, తెనాలి మీదుగా రాత్రి 11.45గంటలకు విజయవాడ చేరుకుంటుంది. విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లాలంటే ఇప్పటివరకు మచిలీపట్నం యశ్వంతపూర్ "కొండవీడు ఎక్స్‌ప్రెస్" మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంది. ఈ ట్రెయిన్ వారానికి మూడు రోజులు మాత్రమే నడుస్తుంది. ఈ నేపథ్యంలో త్వరలో రాబోయే వందే భారత్ ట్రైన్‌తో తక్కువ సమయంలోనే తిరుపతి సహా, నెల్లూరు, బెంగళూరు చేరుకోవచ్చు. విజయవాడ నుంచి మరో వందేభారత్ పట్టాలెక్కనుంది. ఇప్పటికే విజయవాడ నుంచి చెన్నై వరకు నడుస్తున్న వందేభారత్‌ను తాజాగా గుడివాడ, భీమవరం లో హాల్ట్ సౌకర్యం కల్పిస్తూ నర్సాపురం వరకు పొడిగించారు. తాజాగా విజయవాడ తిరుపతి బెంగళూరు రైలు ఈ నెలాఖరున ప్రారంభం కానుంది.

## చట్టబద్ధ దత్తత ఒక వరం

**మార్గదర్శకాలకు అనుగుణంగా దత్తత తీసుకోవడం శ్రేయస్కరం**

**ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలకు అనుగుణంగా ఈ ఏడాది నవంబర్ నెలలో దత్తతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని ఏన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రభుత్వాల మార్గదర్శకాలను అనుసరించి చట్టబద్ధంగా దత్తత తీసుకోవడం ఒక వరమని తెలిపారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి పింగళి వెంకయ్య హాల్‌లో దత్తత అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దత్తతకు సంబంధించి ఎట్టిపరిస్థితుల్లోనూ దళారీలను నమ్మవద్దని.. చట్టపరంగా దత్తత తీసుకోవడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవాల నుకుంటే సమగ్ర బాలల సంరక్షణ పథకం, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖను సంప్రదించవలసినదిగా తెలియజేయు చున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల దత్తత ఇతివృత్తంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీఆర్‌వో లక్ష్మీనరసింహం, డీఎంహెచ్‌వో సుహాసిని, డీసీపీవో రాజేశ్వరరావు, జాన్సన్ పాల్గొన్నారు.



# సినీఫక్కీలో గంజాయి పట్టివేత

**తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు**

తిరుపతి (చంద్రగిరి), నవంబర్ 10 ప్రభాతవార్త: చంద్రగిరి పోలీసుల సమర్థత, చాకచక్యం 32 కిలోల గంజాయి స్వాధీనంలో చక్కగా దోహదపడినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అభినందిస్తూ రివార్డులను ప్రకటించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పనపాకం పంచాయతీ, తువ్వచేనుపల్లి జాతీయ రహదారి వద్ద చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో చంద్రగిరి సిఐ సురేష్ కుమార్, పాకాల సిఐ సుదర్శన్, చంద్రగిరి ఎస్ఐ వై.అనిత, ఆర్‌సి పురం ఎస్ఐ భక్తవత్సలం బృందం ప్రత్యేక తనిఖీలలో 32 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగి ఒదన్నారు. తమకు లభించిన విశ్వసనీయ సమాచారంతో చంద్రగిరి డిఎస్పీని అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఒరిస్సా నుండి తమిళనాడుకు చెందిన పొన్నుస్వామి సెల్వరాజ్ అత్యంత పగడ్బంధీగా గంజాయిని తన కారులో దాచుకుని వెళుతుండగా పోలీసుల సాధారణ తనిఖీలో వెళ్ళడికాలేదన్నారు. అయితే లభించిన సమాచారంతో సంతృప్తి చెందని పోలీసులు మరోమారు పోలీస్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయించారు. ఈ క్రమంలో కారు డాష్ బోర్డ్, గేర్‌బాక్స్, టైర్ స్టెప్ బాగాలలో దాచిపెట్టిన గంజాయిని జాగిలం కనిపెట్టింది. ఆయ ప్రదేశాలలో తనిఖీ చేయగా 32.730 కిలోలు గంజాయి 27 ప్యాకెట్లు బయటపడినట్లు తెలిపారు. దీంతో కారునడుపుతున్న పొన్నుస్వామి సెల్వరాజ్ (43), శివగంగై జిల్లాకు చెందిన కలనివాసల్‌ను అరెస్ట్‌చేసి, గంజాయితో పాటు 2 మొబైల్స్‌ను సీజ్ చేయడం జరిగిందన్నారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, వినియోగం, విక్రయాలపై పోలీసుల ప్రత్యేక వుంచినట్లు ఎస్పీ తెలిపారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాలకుమత్తు పధార్థాల సరఫరాకు పాల్పడితే తీవ్రమైన సెక్షన్లతో కేసులు నమోదు చేస్తామన్నారు.

# యాభై కిలోమీటర్లకో పోర్టు

**పోర్టుల అభివృద్ధికి ప్రభుత్వ కార్యాచరణ**



విజయవాడ, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని సముద్ర తీరంలో విస్తృతంగా పోర్టులను అభివృద్ధి చేసే దిశలో ఏపీ ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. ఈ పోర్టులను ప్రధాన జాతీయ రహదారులను అనుసంధానం చేసే దిశలో చర్యలు చేపట్టనున్నది.దీని వలన రవాణా వ్యవస్థ అత్యంత బలీయం చేయనున్నది. ఇప్పటికే కోస్తల్ ఏరియా ఉన్న జిల్లాల్లో మారిటైం ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసింది.ఈ దిశగా పోర్టు సమీప ప్రాంతాల్లో (పోర్టు నుంచి 2 నుంచి 3 కి.మీ. వరకూ ఉన్న ప్రాక్సిమల్ జోన్‌లో) అవసరమైన మౌలిక సదుపాయాలను రూపుదిద్దేందుకు ప్రభుత్వం రూ. 1,220 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. ఈ క్లస్టర్ల కోసం పోర్టులకు సమీపంలో సహజంగా ఉన్న ఉప్పు భూములను వినియోగించుకుని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఈ భూములను రాష్ట్రానికి కేటాయించాలని, కేంద్రంలోని అంతర్గత వాణిజ్యం, పరిశ్రమల ప్రోత్సాహక శాఖను కోరింది. దీనికి అనుగుణంగా ఏపీ మారిటైం బోర్డు రోడ్‌మ్యాప్‌ను తయారు చేసింది.పోర్టు ఉన్న ప్రాంతాలకు సమీప గ్రామాలను అనుసంధానించి క్రమంగా నగరీకరణ చేయాలని నిర్ణయించింది. పోర్టుల నుంచి 2, 3కి.మీ. పరిధిలో రహదారులు, విద్యుత్ సదుపాయాలు, నీటి సరఫరా, ఇతర మౌలిక వసతులు అభివృద్ధిచేయడానికి 11 ప్రతిపాదనలు రూపొందించి, ఇవి సాగరమాల 2.0 పథకం కింద కేంద్ర ఆమోదానికి పంపిస్తున్నారు. మూలపేట పోర్టు రసాయన పరిశ్రమలు, వాటి అనుబంధ యూనిట్లకు తగిన మౌలిక వసతులు కల్పించనున్నారు. విశాఖపట్నం పరిధిలో విశాఖ చుట్టుపక్కల ఫార్మా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున, ఫార్మా, సముద్ర ఆధారిత వాణిజ్య పరిశ్రమలకు అనుకూలమైన క్లస్టర్ అభివృద్ధి చేయనున్నారు. రాంబిల్లి పరిధిలో నేవల్ కార్యకలాపాలకు ఉపయోగించనున్నారు. ఈ ప్రాంతంలో రక్షణరంగ పరిశ్రమల క్లస్టర్ ఏర్పాటు చేయాలని నిర్ణయం. కాకినాడ పరిధిలో ఇక్కడ ఇప్పటికే చమురు వెలికితీసే పరిశ్రమలు ఉన్నాయి. దీనికి అనుసంధానంగా పెట్రోలియం, లూబ్రికెంట్ ఆధారిత పరిశ్రమల క్లస్టర్ అభివృద్ధి. మచిలీపట్నం పరిధిలో విజయవాడ సమీపంలో ఉండటంతో, హెవీ ఇంజినీరింగ్, ఆటోమొబైల్ రంగానికి అనువైన పారిశ్రామిక మౌలిక వసతులు. రామాయపట్నం పరిధిలో ఇక్కడ బీపీసీఎల్ ప్రధానంగా రూ.లక్ష కోట్లు వ్యయంతో చమురు శుద్ధి కర్మాగారం స్థాపించనుంది. కృష్ణపట్నం: తిరుపతి సమీపంలో ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఉన్నాయి. రాయలసీమలో ఉన్న పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు అనుసంధానంగా పరిశ్రమ క్లస్టర్ అభివృద్ధి. దుగరాజపట్నం: ఇక్కడ షిప్ బిల్డింగ్, ఓడల రిపేర్, నిర్వహణ, ఓవర్‌హాలింగ్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసే దిశగా క్లస్టర్ ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, కృష్ణపట్నం వంటి ప్రధాన ఓడరేవులు ఉన్నాయి. ఇవే కాకుండా రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ సెజ్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. రక్షణ అవసరాల కోసం రాంబిల్లి వద్ద నావల్ ఆపరేషన్లకు అనుకూలంగా మరో పోర్టును అభివృద్ధి చేస్తున్నారు. భవిష్యత్తులో నక్కపల్లి, దుగరాజపట్నం ప్రాంతాల్లో కూడా ఓడరేవుల ఏర్పాటు ప్రధాన లక్ష్యంగా ఉంది. ఈ విధంగా ప్రతి 50 కి.మీ. దూరంలో పోర్టు, ఫిషింగ్ హార్బర్, సముద్ర ఆధారిత పారిశ్రామిక యూనిట్లు ఏర్పడే విధంగా ప్రణాళిక సిద్ధమవుతోంది. దీంతో వాణిజ్యం విస్తృతంగా పెరగడమే కాకుండా, తీర ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుంది.

# పట్టపగలు కొత్తపేటలో దారుణం

**నగల దోపిడీలో వృద్ధురాలు మృతి**



కల్లూరు, నవంబరు 10 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి (కొత్తపేట)లో సోమవారం మధ్యాహ్నం దారుణం చోటుచేసుకుంది. బంగారు నగలు దోపిడీలో వృద్ధురాలు మృతి చెందడం మరో వృద్ధురాలకు గాయాలు కావడం జరిగింది. గ్రామస్తులు పోలీసుల కథనం మేరకు. కొత్తపేటలో దామలచెరువు మార్గంలో కళావతమ్మ నివసిస్తున్నది. ఈ గృహంలో పై భాగంలో విమలమ్మ (75) కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నది. సోమవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటకు వెళ్లడంతో విమలమ్మ కింద కాపురం ఉంటున్న కళావతమ్మ ఇంటికి వచ్చి కబుర్లు చెప్పుకుంటున్నారు. బయటకు వెళ్లిన విమలమ్మ కుటుంబ సభ్యులు రెండు గంటల తర్వాత తిరిగి ఇంటికి రావడం ఇంటిలో విమలమ్మ లేకపోవడంతో కింద కళావతమ్మ ఇంటికి రాగా తలుపు వేసి ఉండడం జరిగింది. కుటుంబ సభ్యులు తలుపు తీసి చూడగా విమలమ్మ కింద పడిపోయి ఉండడం కళావతి చెవులు నుంచి రక్తం కారుతూ ఉండడంతో అది చూసి వారు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని విమలమ్మను తట్టి లేపగా లేవకపోవడంతో కంగారపడి చూడగా విమలమ్మ మృతి చెందినట్లు గుర్తించారు. కళావతమ్మ భయముతో వణికిపోతూ ఉండడం విషయాలు చెప్పలేకపోయింది. అయితే విమలమ్మ కళావతమ్మ దగ్గర ఉన్న బంగారు నగలు కనబడకపోవడం గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానికులు గుర్తు తెలియని వ్యక్తులు నగలు కోసం వచ్చి దారుణానికి ఒడి కట్టినట్లు గుర్తించి కల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కల్లూరు సిఐ జయరామయ్య, కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన కళావతమ్మను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. విమలమ్మ మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. చిత్తూరు డిఎస్పి సాయినాథ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. నగల కోసమే గుర్తు తెలియని వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిసింది. కొత్తపేట ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడం విశేషం. ఈ విషయమై డిఎస్పి సాయినాథ్ స్థానిక పోలీసులను ఆరా తీశారు. పట్టపగలు మిట్ట మధ్యాహ్నం రోడ్డు పక్కన ఉన్న గృహంలో ఇంత దారుణం జరగడం కొత్తపేటలో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మండల వ్యాప్తంగా ఈ సంఘటన సంచలనం కలిగించింది.

11-11P g7exHMNWJQE 11_11-11P g7exHMNWJQE.qxd 11/Nov/25 12:47 AM Page 1



# తుపాను నష్టం అర్థం చేసుకున్నాం కేంద్రానికి నివేదిస్తాం

### - ఒంగోలు జిల్లా అధికారులకు కేంద్ర బృందం భరోసా



ఒంగోలు, నవంబరు 10 ప్రభాతవార్త (ప్రతినిధి): మొంథా తుపాను వలన ప్రకాశం జిల్లాకు కలిగిన నష్టాన్ని అర్థం చేసుకోగలమని కేంద్ర బృందం తెలిపింది. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం గురించి ప్రభుత్వానికి నివేదిస్తామని భరోసా ఇచ్చింది. ఈ తుపాను వలన జిల్లాలో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులతో నియమించిన కమిటీ సోమవారం జిల్లాలో పర్యటించింది. పి.పౌసుమి బసు, మహేష్ కుమార్, శశాంక్ శేఖర్ రాయ్, సాయి భగీరథ్‌లతో పాటు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ కూడా వచ్చారు. ముందుగా ఒంగోలు నగరంలోని ఎన్ఎస్పి గెస్ట్ హౌస్‌కు రాగా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణ, డిఆర్ఓ బి.చిన ఓబులేసు స్వాగతం పలికారు. ఈ నష్టాన్ని తెలిపేలా గ్రీవెన్స్ హాలులో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను కేంద్ర బృందం వీక్షించింది. వీటికి సంబంధించిన వివరాలను స్వయంగా కలెక్టర్ వారికి వివరించారు. జిల్లాలో ప్రధానంగా వ్యవసాయము దాని అనుబంధ రంగాలు, రోడ్లు భవనాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, పంచాయతీరాజ్ రోడ్లు, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, పశుసంవర్ధక శాఖలతో పాటు ఒంగోలు నగరం పైనా ఈ తుపాను తీవ్ర ప్రభావం చూపినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం తుపానుకు ముందు పరిస్థితి ఏ విధంగా ఉన్నదీ, తుపాన్ సమయంలో ఎలాంటి పరిస్థితి తలెత్తిందీ, తుపాను తర్వాత పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు తీసుకున్న చర్యలను తెలియజేసేలా ప్రత్యేకంగా రూపొందించిన వీడియోను కూడా కేంద్ర బృందం వీక్షించింది.

ఈ తుపాను వల్ల రైతుల తోపాటు చేపలు, రొయ్యల చెరువులు సాగుచేస్తున్న వారు కూడా తీవ్రంగా నష్ట పోయినట్లు ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ కేంద్ర బృందానికి తెలిపారు. అల్లూరు, కొప్పోలు రొయ్యల చెరువులను కేంద్ర బృందం పరిశీలిస్తుండగా తుపాన్ సమయంలో నెలకొన్న పరిస్థితి, వీటి సాగుదారులు నష్టపోయిన విధానాన్ని వారు వివరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను బృందానికి అందజేశారు.

ఇతర రంగాలపై చూపిన నష్ట ప్రభావాన్ని కూడా వారు వివరించారు. పరిస్థితిని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి బాధితులను ఆదుకునేలా అవసరమైన సహాయం అందించేలా చూడాలని కోరారు.

కేంద్ర బృందం అల్లూరులోని వరి పొలాలను సందర్శించింది. నీరు నిలిచిపోవడం వలన వేర్లతో సహా కుళ్లిపోయిందని రైతులు వాపోయారు. అంతా అనుకూలిస్తే సంక్రాంతి సమయానికి పంట చేతికొచ్చేదని, ఇప్పుడు పరిస్థితి తారు మారైపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వరి దుబ్బులను తెచ్చి చూపించగా... మొత్తం కోల్పోయారుగా అని కేంద్ర బృందం సభ్యులు సైతం ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అల్లూరు చెరువును బృందం పరిశీలించింది. తుఫాను సమయంలో ఈ చెరువు కట్టకు గండి పడే పరిస్థితి తలెత్తగా, జిల్లా యంత్రాంగం అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తెచ్చిన తీరును వారు పరిశీలించారు. నీటి ఉధృతికి ఈ మార్గంలోని కల్వర్టు దెబ్బతినిన విధానాన్ని ఇంజనీరింగ్ అధికారులు ఈ సందర్భంగా వారికి వివరించారు.

నాగులుపలపాడులో దెబ్బతిన్న పత్తి పంటను ప్రతినిధుల బృందం పరిశీలించింది. పంట పూర్తిగా దెబ్బతిందని, వేర్లకు ఫంగస్ వ్యాపించడం వలన పొలంలో మరో పంట వేసే అవకాశం కూడా ఈ సీజన్లో లేదని రైతులు చెప్పారు.

కేంద్ర బృందం గ్రీవెన్స్ హాలుకు వచ్చినప్పుడు సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్, రాష్ట్ర వ్యవసాయం మిషన్ వైస్ చైర్మన్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రజా సంఘాల నాయకులు కూడా కలిశారు. జిల్లాకు జరిగిన నష్టాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి ఆదుకునే చూడాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు.



## కృష్ణాలో తుపాను నష్టం పరిశీలన

గన్నవరం(కృష్ణా), నవంబరు 10 ప్రభాతవార్త: ఇటీవల వచ్చిన పెనుతుఫాన్ మెంతా కారణంగా నష్టపోయిన పంటలను అంతర మ ంత్రిత్వ కేంద్రబృందం(ఐయంసిటీ) సోమవారం పరిశీలించింది. కేంద్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ కె.పొన్నుస్వామి నేతృత ్వంలోని బృందం క్షేత్రస్థాయిలో తుఫాన్ నష్టాన్ని పరిశీలించి నష్టం అంచనాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించనున్నారు. తుఫాన్ నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఈబృందం ముందుగా కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామ వరిపొలాల్లో క్షేత్రసాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా నేలవాలిపోయి చాపలా మారిన వరిపొలాలను పరిశీలించి నష్టం వివరాలను రైతులను అడిగితెలుసుకున్నారు. వరిపంట పాలుపోసుకునే దశలో తుఫాన్ గాలులకు ఇలా నేలకొరిగి పోవటంతో తాలు గింజలు వస్తాయని తద్వారా పావుశాతం కూడా పంట దిగుబడులు రావని రైతులు కేంద్రబృందానికి వివరించారు. అనంతరం రోడ్డుమార్గాన గన్నవరం చేరుకున్న ఈబృందం తుఫాన్ వల్ల దెబ్బతిన్న గృహాలు, పంటలు, చనిపోయిన పశువులు, దెబ్బతిన్న విద్యుత్ స్తంబాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, రహదారులు, సహాయశిబిరాలు, నిత్యావసర సరుకుల పంపిణీ, తదితర అంశాలపై ఫోటోలతో గన్నవరం యంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈసందర ్భంగా ఫోటో ప్రదర్శన ద్వారా జిల్లా వ్యాప్తంగా రహదారులకు, విద్యుత్‌శాఖకు, పంటలకు జరిగిన నష్టాన్ని, ప్రభుత్వం చేపట్టిన పునరావాస కార్యక్రమాలు, తుఫాన్‌కు ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌లు కేంద్రబృందానికి వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ బాలాజీ మీడియాతో మాట్లాడుతూ కేంద్రబృందానికి మెంతా తుఫాన్ కారణంగా జిల్లావ్యాప్తంగా జరిగిన నష్టాన్ని వివరించినట్లు చెప్పారు. జిల్లాలో ప్రధాన పంట అయిన వరిపొలాలకు ఈబృందాన్ని తీసుకువెళ్ళి దెబ్బతిన్న పంటలను చూపించామని, ఈబృందంలోని సభ్యులు పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారని, ఇతర పంటలు, ఇతరత్రా నష్టాలను ఫోటో ప్రదర్శన ద్వారా వారికి వివరించినట్లు తెలిపారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో తుఫాన్ వల్ల భారీ వర్షపాతం నమోదు కానప్పటికీ ఈదురుగాలులకు పంటలకు ఆపారనష్టం వాటిల్లిందన్నారు. ఇదే విషయాన్ని కేంద్రబృందానికి వివరించి రైతులను ఉదారంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ కార ్యక్రమంలో కేంద్రబృందం సభ్యులు హైదరాబాద్ సెంట్రల్ వాటర్ కమీషన్ జలవనరుల మంత్రిత్వశాఖ సంచాలకులు శ్రీనివాసు బైరి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అధారిటీ విద్యుత్‌చ్ఛక్తి మంత్రిత్వ శాఖ ఉపసంచాలకులు ఆర్ి సింగ్ గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయసంచాలకులు మనోజ్‌కుమార్ మీనా, కేంద్రబృందం వెంట రాష్ట్రపౌరసరఫరాలసంస్థ యండి డిల్లీరావు, జేసి యం.నవీన్, గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ ్యం, జిల్లావ్యవసాయఅధికారి ఎన్.పద్మావతి, పశుసంవర్ధకశాఖ అధికారి చిన్ననరసింహులు, తదితర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## విశాఖ సిఐఐ సదస్సు రాష్ట్ర యువత బంగారు భవితకు వేదిక

### మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

సచివాలయం(అమరావతి), నవంబరు 10 ప్రభాతవార్త: రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ అవిశ్రాంత కృషి చేస్తున్నారని విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 14,15తేదీల్లో విశాఖలో జరగనున్న సిఐఐ సదస్సు రాష్ట్ర యువత బంగారు భవితకు వేదిక కానుంది.ఈ సదస్సు ద్వారా 410ఒప్పందాలు,రూ.9.76లక్షల కోట్ల పెట్టుబడులు, 7.48 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఈ సిఐఐ సదస్సులో 112 పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు చేయబోతున్నాం. సదస్సుకు 45దేశాల నుండి సుమారు 300మంది ప్రతినిధులు, 200మంది భారత అగ్రశ్రేణి సంస్థల సీఈవోలు,పలువురు కేంద్రమంత్రులు హాజరవుతారు. ఈ సదస్సులో భాగంగా 48కీలక సెషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్ పెవిలియన్, హ్యాకథాన్, బిజినెస్ టూ గవర్నమెంట్ సమావేశాలు జరుగుతాయని మంత్రి తెలిపారు. విశాఖ సిఐఐ సదస్సు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ సదస్సును రాష్ట్రంలోని ప్రజలు,విద్యార్థులు వీక్షించేలా ఏర్పాట్లు చేయమని ముఖ్యమంత్రి ఆదేశించారని, అందుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు.



క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను కలసిన బిసి నేతలు

## టిడిపితోనే బిసిల అభ్యున్నతి

### రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

సచివాలయం, నవంబరు 10 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు గుర్తింపు లభించిందని,రాజకీయ, ఆర్థిక, సామాజికంగా బీసీల అభ్యున్నతి సీఎం చంద్రబాబు తోనే సాధ్యమని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను నూతనంగా ఎన్నికైన అమరావతి కురుమ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలుసమస్యల పరిష్కారానికి మంత్రికి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సవిత సానుకూలంగా స్పందించారు. నూతనంగా ఎన్నికైన అమరావతి కురుమ సంక్షేమ గుంటూరు జిల్లా శాఖ ప్రతినిధులను మంత్రి సవిత అభినందించారు. ఈ కార్యక్రమంలో నూతన కురమ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు మర్రి వెంకట సత్యనారాయణను, ఉపాధ్యక్షుడు బక్కా ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణ, ట్రెజరర్ కెవి సత్యనారాయణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



## ఏలూరు జిల్లాలోనూ...

### ఉంగుటూరులో పంట నష్టాలను పరిశీలన
### కేంద్ర బృందానికి వివరించిన జిల్లా కలెక్టర్

ఉంగుటూరు/ ఏలూరు, నవంబరు 10 ప్రభాతవార్త ఏలూరు జిల్లాలో మొంథా తుఫాన్ నష్టాల పరిశీలనకు కేంద్ర ప్రభుత్వం నియమించిన పరిశీలన బృందం సోమవారం ఉంగుటూరు మండలం నారాయణపురం చేరుకుని ముందుగా గొట్టుముక్కల సత్యనారాయణ రాజు పొలంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించింది. పంట నష్టాలను గురించి అక్కడకు చేరుకున్న రైతులను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా యంత్రాంగం తుఫాన్ నష్టాలు, అనంతరం చేపట్టిన పునరుద్ధరణ పనులు, తుఫాను బాధితులకు ఏర్పాటుచేసిన పునరావాస కార్యక్రమాలపై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను బృందం సభ్యులు పరిశీలించారు. తేమ శాతం కొలిచే యంత్రం ద్వారా దెబ్బతిన్న వరి పంట తేమ శాతం కొలువగా 23. 6 శాతంగా తేలింది. దెబ్బతిన్న వరిదుబ్బులను, పాడైన మినుము పంటలు, అరటి, ఉద్యాన పంటలను బృందం సభ్యులు పరిశీలించి వాటి వివరాలను నమోదు చేసుకున్నారు. జిల్లాలో మొంథా తుఫాన్ కారణంగా వ్యవసాయం, అనుబంధ రంగాలకు, గృహాలు, విద్యుత్, రోడ్లు, ఇతర నష్టాలను కేంద్ర బృందానికి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వివరించారు. కేంద్ర బృందంతో పాటు వ్యవసాయ శాఖ కమీషనర్ ఢిల్లీరావు, ప్రభృతులు ఉన్నారు. అనంతరం కేంద్ర బృందం తూర్పు గోదావరి జిల్లా బయలుదేరి వెళ్ళింది. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఉద్యానవనాల అధికారి షాజా నాయక్, తహసీల్దార్ పూర్ణారావు, ఎంపిపి ఘంటా శ్రీలక్ష్మి, సర్పంచ్ టి. అలకానంద, ఎంపిటిసి మహాలక్ష్మి, ప్రభృతులు పాల్గొన్నారు. కేంద్ర పరిశీలన బృందంలో కేంద్ర వ్యవసాయ శాఖ మరియు రైతు సంక్షేమ శాఖ డైరెక్టర్ డా. కె. పొనుసామి, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ శ్రీనివాసు బాలి, కేంద్ర విద్యుత్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తీ సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్ కుమార్ మీనా లు సభ్యులుగా ఉన్నారు.

## రాయల చెరువు బాధితులకు నష్టపరిహారం

### ప్రభుత్వ చర్యలు వేగం... కలెక్టర్ చొరవతో సహాయం

శ్రీకాళహస్తి, నవంబరు 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి సమీపంలోని సత్యవేడు నియోజకవర్గం కెవిబిపురం ఒళ్ళూరు పాతపాళెం, కళత్తూరులను ముంచేసి తీవ్ర ఆస్తినష్టాన్ని కల్గించి ప్రజలకు కష్టాలు మిగిల్చిన రాయల చెరువు తెగిన సంఘటనలో బాధితులకు సత్వర సహాయం అందించుటకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ చూపిన చొరవ సర్వత్రా అభినందనలు అందుకుంటుంది. వరదలో చరిత్రలో లేని విధంగా ప్రభుత్వం స్పందించటం, మొక్కుబడిగా ఇచ్చే సహాయం స్థానంలో భారీ సహాయం అందించటం చర్చనీయాంశంగా మారింది. ఒక్క గంటలో గ్రామాలు జలమయమయ్యాయి. పచ్చటి పొలాలు ఇసుక మేటలుగా మారింది.పాడి పశువులు కళ్ళ ముందే కొట్టుకుపోతుంటే నిస్సహాయంగా చూస్తు ఉండటం మినహా ఏమి చేయాలేని దుస్థితి. ఇళ్ళలో జల ప్రళయం అన్నట్లు మారింది. కళత్తూరుకు ఎగువ బాగంలో నిర్మించిన రాయల్‌చెరువు కట్ట తెగింది. సుమారు 1200 ఎకరాల అధికారికంగా మరోన 1500 ఎకరాలు అనధికారికంగా సాగు జరుగుతుంది. పాడి పరిశ్రమలతో తులతూగుతున్న పచ్చని గ్రామాలపై రాయలచెరువు నీరు దాడి చేసింది. వేలాది కుటుంబాలు ఒక్క సారిగా రోడ్డు మీద పడ్డాయి. ఇళ్ళు బురద గుంతలుగా మారింది. అయితే విజయవాడలో ఉన్నజిల్లా కలెక్టర్ పరుగున వచ్చారు. అప్పటికే శ్రీకాళహస్తి ఆర్‌డిఓను సంఘటనా స్థలానికి పంపారు. బాదితులకు తక్షణ సాయం అందించుటకు పునరావస కేంద్రాలు ఏర్పాటుకు ఆదేశించారు. సాయంత్రానికి కలెక్టర్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

**క్యాబినెట్‌లో సమీక్ష:**

**సహాయం ప్రకటన:**

కెవిబిపురం మండలం లో చోటు చేసుకున్న సంఘటనలపై సోమవారం మంత్రి వర్గ సమావేశంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి సమీక్షించారు. జరిగిన ఉదంతం దారుణమని భావించారు.వెంటనే సహాయం ప్రకటించారు. సాధారణంగా ఇప్పటి వరకు సంభవించిన వరద ముంపులకు సంబంధించిన సహాయాన్ని గమనిస్తే రూ.500లకు మించి ఇచ్చే వారు కాదు. కానీ కళత్తూరు సంఘటనలో బాధితులకు తాత్కాలిక సహాయం ఒక్కొక్క ఇంటికి రూ.3 వేలు చొప్పున చెల్లించుటకు నిర్ణయించారు. కాగా ఇక్కడ 980ఇళ్ళు దెబ్బతినగా రూ.3.9కోట్లు మంజూరు చేసారు.కాగా 1100 పశువులకు గాను రూ.2.95 కోట్లు ఆర్థిక సహాయం అందించుటకు ప్రభుత్వం ఆదేశించారు. ఈ సత్వర చర్యలు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ చొరవతో మాత్రమే సాధ్యమైందని చెప్పవచ్చు. ఇక్కడ సాధారణ స్థితి కల్పించుటకు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకుంటున్నారు.



కళత్తూరులో జీవన స్థితి సాధారణ స్థితికి తేవటానికి ప్రయత్నం



## గీత పఠనంలో తారుష్ భళా

హిందూపురం, నవంబరు 10 ప్రభాతవార్త: ఆరేళ్ల వయసులోనే అద్భుతమైన ఘనత వహించి.. గీతా పఠనంలో తెలుగు రాష్ట్రాల విజేతగా నిలిచి హిందూ పురానికి వన్నెతెచ్చాడు సుంకు తారుష్. హిందూ పురం మార్కెట్ యార్డ్‌లో ప్రముఖ మండి మర్చంట్స్ వ్యాపారులు సుంకు బద్రినాథ్ మనవడు, సుంకు వెంకటేష్, అపూర్వల కుమారుడు స్థానిక యూరో కిడ్స్ స్కూల్‌లో యూకేజీ చదువుతున్నాడు. పిన్న వయసులో చదువుతో పాటు ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగిన తారుష్ స్థానిక డిబి కాలనీలో ఎస్.కె.నాగవేణి సారథ్యంలోని ప్రసన్న వేణివేద మాలిక సంస్థలో రెండేళ్లుగా ప్రతిరోజు భగవద్గీత శ్లోకాలను నేర్చుకుంటున్నాడు. ఇటీవల చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ స్కూల్స్ జిల్లా స్థాయి కాంపిటీషన్లో ప్రథమ స్థానంలో నిలవడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గీత పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 9న కడప నందు చిన్మయ మిషన్ నేతృతంలో జరిగిన గ్రూప్ ఎ పోటీలో అద్భుతమైన ప్రదర్శనతో బాలుడు శభాష్ అనిపించుకున్నాడు. గీత 15వ అధ్యాయంలో శ్లోకాలను చెప్పడమే కాకుండా వాటి అర్థాలను కూడా వివరించడంతో నిర్వాహకులు భళా.. అని అభినందిస్తూ విజేతగా ప్రకటించారు. అంతేకాకుండా త్వరలో పుణేలో జరగబోయే జాతీయ స్థాయి భగవద్గీత పోటీలకు ఎంపికయ్యాడు. గురు శిష్యులకు సన్మానం భగవద్గీత పఠనంలో రెండు తెలుగు రాష్ట్రాల విజేతగా నిలిచారన్న సమాచారం తెలుసుకుని బోధకులు నాగవేణి, చిచ్చరపిడుగు తారుష్‌ను మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రమోహన్ యాదవ్, జనసేన నాయకులు రాము సన్మానించి అభినందనలు తెలిపారు.

### ఆవులు కడిగేందుకై వెళ్లి...

## నీట మునిగి ఇద్దరు మృతి

రామకుప్పం, నవంబరు 10 ప్రభాతవార్త: ఆవులు కడిగేందుకని నీటి కుంట వద్దకు వెళ్లిన ఇద్దరు యువకులు నీటికుంటలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం కోటచేను గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. కోటచేను గ్రామంకు చెందిన సుబ్బన్న కుమారుడు గోవిందరాజులు(31), కుళ్లగా నూరుకు చెందిన రామూర్తి కుమారుడు సతీష్ (16)లు గ్రామ సమీపంలో పశువులు కడిగేందుకని వెళ్లారు. ప్రమాదవశాత్తు వీరు నీటికుంటలో ఇరుక్కుపోయి మృతి చెందారు. స్థానికులు హుటాహుటిన నీటికుంటలో దిగి రక్షించే యత్నం చేయగా అప్పటికే వారు చనిపోయారు. విషయం తెలుసుకున్న డిఎస్పీ పార్థసారథి, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్,ఎస్సై వెంకటమోహన్ సిబ్బందితో కలసి సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా సతీష్ కోట చేనులో ఉన్న తన అవ్వను చూసేందుకు వచ్చాడని తెలిసింది. ఇకేసారి ఇద్దరు యువకులు మృతి చెందడంతో కోటచేనులో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ముదిగుబ్బలో గంజాయి కలకలం... 14 మంది అరెస్ట్

ముదిగుబ్బ నవంబర్ 19 ప్రభాతవార్త: శ్రీ సత్య సాయి జిల్లా ముదిగుబ్బ మండల కేంద్రంలో గంజాయి కలకలం చెలరేగింది సోమవారం పోలీసుల అకస్మిక తనిఖీలు సుమారు మూడు కిలోల గంజాయి ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకొని 14 మంది యువకులను పోలీసులు అరెస్టు చేశారు వివరాల్లోకెళ్తే ముదిగుబ్బ గ్రామ శివారులోని కాకతీయ హోటల్ సమీపం లో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేయగా ఈ దాడిలో గంజాయి క్రీస్తున్న వారు. గంజాయి సేవిస్తున్న యువకులు కూడా పోలీసులకు పట్టుబడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి వ్యాపారం పై ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల వరకు గంజాయి చొరబడడం పోలీసులకు పెను సవాలుగా మారిందని అధికారులు తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న వారిలో ప్రధాన నిందితులు గా గుర్తించిన అనంతపురానికి చెందిన షికారి గోవిందు (38) వద్ద నుండి స్థానిక యువకులు నందకుమార్ సాయికుమార్ సాయి తేజ నవీన్ కుమార్ రెడ్డి గణేష్ తదితరులు కలిసి 18 వేలకు ఒక కిలో గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో బయటపడింది కొన్న గంజాయిని తదుపరి దానిని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ప్రతి ప్యాకెట్ కు 200 నుండి రూ 400 వరకు ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు ఈ గంజాయిని ఎక్కువగా 16 నుండి 22 సంవత్సరాల వయసు గల యువకులకు విక్రయించి వారిని గంజాయికి అలవాటు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు అరెస్ట్ అయిన వారి వివరాలు కుమార్ 34 సంవత్సరాలు ముదిగుబ్బ. మేకల సాయి తేజ 24 సంవత్సరాలు ఎస్సీ కాలనీ ముదిగుబ్బ. పోతిరెడ్డి నవీన్ కుమార్ రెడ్డి 21 సంవత్సరాలు ఆర్ అండ్ బి బంగ్లా ముదిగుబ్బ. ముత్తన నగేష్ 24 ముదిగుబ్బ. షికారి గోవిందు 38 అనంతపురం టౌన్. ముష్టురు దాదా పీర్ 25 టీచర్స్ కాలనీ ముదిగుబ్బ. రామన్న గారి నిధి కుమార్ 19 సంవత్సరాలు ముదిగుబ్బ. మేకల నరేష్ 31 సంవత్సరం సెలీంబావి వీధి. సాకే పవన్ కుమార్ 21 ఎస్సీ కాలనీ ముదిగుబ్బ. చెన్నంపల్లి గణేష్ 19 సంవత్సరాలు దొరిగిల్ రోడ్డు ముదిగుబ్బ. తలసూరి ప్రవీణ్ కుమార్ నాయుడు 20 సంవత్సరాలు కస్తూరిబా కాలనీ ముదిగుబ్బ. వీరిలో 13 14 సంవత్సరాల వయసు గల బాల నేరస్తులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీటిపై చాలా రోజుల నుండి నిఘా పెట్టినట్లు డీఎస్పీ హేమంత్ కుమార్ పర్యవేక్షణలో సీఐ శివరాముడు ఎస్సై ట్రైనింగ్ భువనేశ్వరి ఇతర పోలీస్ సిబ్బంది ఈ దాడిని నిర్వహించారు




ముదిగుబ్బ పోలీసులను డిఎస్పి హేమంత్ కుమార్ ప్రశంసించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక పనులకు ఎవరైనా పాల్పడితే గంజాయి. మటక. కార్డ్స్ బెట్టింగులు ఇటువంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు


11-11pg10 12 ONG_11-11pg10.qxd 11/Nov/25 1:08 AM Page 1



## జపాన్ బ్యాడ్మింటన్‌లో ప్రమోద్‌కు ట్రిపుల్ స్వర్ణం
### డబుల్ గోల్డ్‌తో కృష్ణ, సుకాంత్ స్వర్ణం, రజతం



**న్యూఢిల్లీ:** జపాన్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ 2025లో భారత పారా బ్యాడ్మింటన్ స్టార్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ప్రమోద్ భగత్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో 3 స్వర్ణ లను సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. కృష్ణ నాగర్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో 2 స్వర్ణాలను గెలుచుకున్నాడు. సుకాంత్ కదమ్ పురుషుల డబుల్స్‌లో 1 స్వర్ణం, సింగిల్స్‌లో 1 రజతం సాధించాడు. ఈ ఛాంపియన్‌షిప్ ఎస్‌ఎల్3 సింగిల్స్ ఫైనల్ భగత్ డైసుకే ఫుజిహారా (జపాన్) చేతిలో తొలి సెట్ కోల్పోయిన తర్వాత అద్భుతమైన పునరాగమనం చేశాడు. మొదటి మ్యాచ్‌లో 17-21తో, రెండవ మ్యాచ్‌లో 16-19తో వెనుకబడినప్పటికీ, ప్రమోద్ ధైర్యాన్ని ప్రదర్శించి మ్యాచ్‌ను సమం చేశాడు. తర్వాత 1 గంట 33 నిమిషాల పాటు జరిగిన పోరులో 17-21, 21-19, 21-10 తేడాతో ఆధిపత్యం చెలాయించాడు. అలాగే పురుషుల డబుల్స్‌లో భగత్, సుకాంత్ కదమ్‌తో కలిసి జగదీష్ దిల్లీ, నవీన్ శివకుమార్‌లను మూడు సెట్లర్లలో (21-17, 18-21, 21-16) ఓడించాడు. మనీషా రామదాస్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌ఎల్4-ఎస్‌యు5 టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా అతను తన బంగారు హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. 29 నిమిషాల పోటీలో నితేష్ కుమార్, తులసిమతి మురుగేషన్‌లను 21-19, 21-19 తేడాతో ఓడించాడు. ఇక టోక్యో పారాలింపిక్ బంగారు పతక విజేత కృష్ణ నాగర్ మరోసారి రెండు బంగారు పతకాలు గెలుచుకున్నాడు. సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో యుఎస్‌కు చెందిన మైల్స్ క్రజెవ్స్కీని వరుస సెట్లలో ఓడించాడు. మొదటి సెట్‌లో 11-17తో వెనుకబడిన తర్వాత, తిరిగి 22-20తో సెట్‌ను కైవసం చేసుకున్నాడు. తదుపరి రెండవ సెట్‌ను 21-13తో సునాయాసంగా ముగించాడు.



## ఏథెన్స్ ఓపెన్ టోర్నీ విజేత జోకోవిచ్

**న్యూఢిల్లీ:** ఏథెన్స్ ఓపెన్ టోర్నీ 2025 విజేతగా ప్రపంచ మాజీ నంబర్ వన్, సెర్బియా దిగ్గజం నోవాక్ జోకోవిచ్ నిలిచాడు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకోవడంలో జనోకోవిచ్ విఫలమైనా సీజన్‌ను మాత్రం సింగిల్స్ టైటిల్‌తో ముగించాడు. ఏథెన్స్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జోకోవిచ్ ఛాంపియన్‌గా అవతరించాడు. 2 గంటల 59 నిముషాల పాటు జరిగిన ఫైనల్లో జోకోవిచ్ 4-6, 6-3, 7-5తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై చిరస్మరణీయ విజయం సాధించాడు.

తద్వారా తన కెరీర్‌లో 101వ సింగిల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ముసెట్టిపై జోకోవిచ్ కు ఇది తొమ్మిదో విజయం కావడం విశేషం. నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ మ్యాచ్‌లో జోకోవిచ్ ఆరు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన ర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగు సార్తు బ్రేక్ చేశాడు. తొలి సర్వీస్‌లో 61 పాయింట్లకు గాను 43 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 36 పాయింట్లకు గాను 21 పాయింట్లు గెలిచాడు. టైటిల్ ఖాయమైన వెంటనే ఈ సెర్బియా స్టార్ తన జెర్సీని చించివేసి విజయ గర్జన చేశాడు.

## ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్స్‌కు భారత్
### కొరియాతో మెన్, ఉమెన్ టీంల తుది పోరు

**న్యూఢిల్లీ:** ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2025లో భారత రికర్వ్ పురుషులు, కాంపౌండ్ మహిళల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. భారత పురుషుల రికర్వ్, మహిళల కాంపౌండ్ జట్లు రెండూ ఫైనల్‌లో దక్షిణ కొరియాతో తలపడను న్నాయి. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో సోమవారం జరిగిన ఛాంపియన్‌షిప్‌లో అనుభవజ్ఞులైన అతాను దాస్, రాహుల్, యశ్‌దీప్ భోగేలతో కూడిన భారత పురుషుల రికర్వ్ ఆర్చరీ జట్టు సెమీఫైనల్లో కజకిస్తాన్‌ను 5-3 తేడాతో ఓడించింది. ఫైనల్‌కు చేరుకునే అవకాశం కోసం హోరాహోరీగా జరిగిన ఈ పోరులో, తొలి సెట్‌ను గెలుచుకుని భారత్ మంచి ఆరంభం ఇచ్చింది. రెండో సెట్ టైగా ముగిసిన తర్వాత కజకిస్తాన్ మూడో సెట్‌ను గెలుచుకుని స్కోరును సమం చేసింది. తదుపరి కజకిస్తాన్ క్రమేపీ బలహీనం కావడంతో భారత్ తన సత్తా చాటుతూ నాల్గవ సెట్‌ను 57-52 తేడాతో మ్యాచ్‌ను గెలుచుకుంది. ఫలితంగా దక్షిణ కొరియాతో టైటిల్ పోరుకు సిద్ధమైంది. ఇదిలా ఉండగా, దీప్శిక, ప్రితిక ప్రదీప్, వెన్నం జ్యోతి సురేఖల తో కూడిన భారత మహిళల



కాంపౌండ్ జట్టు సెమీఫైనల్లో ఆతిథ్య బంగ్లాదేశ్‌ను 234-227 తేడాతో ఓడించింది. తొలి సెట్ ముగిసే సమయానికి భారత జట్టు నాలుగు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించి, ఆ జోరును కొనసాగించి ఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగే ఫైనల్‌లో దక్షిణ కొరియా జట్టుతో కూడా వారు తలపడనున్నారు. కాగా అంతకు ముందు భారత్ నంబర్ 1 రికర్వ్ ఆర్చర్లు బూమదేవర ధీరజ్, దీపికా కుమారి తమ తమ టీమ్ ఈవెంట్లలోకి అర్హత సాధించలేకపోయారు. ఈ ఇద్దరు ఆటగాళ్ళు ర్యాంకింగ్ రౌండ్‌లో నాల్గవ అత్యుత్తమ భారతీయులుగా నిలిచినా, ముగ్గురు సభ్యుల పురుషులు, మహిళల వేర్వేరు టీముల్లో స్థానం కోల్పోయారు.

ఆట

## సిఎస్‌కె కెప్టెన్‌గా సంజూ
### జడేజా, కరణ్ ఛేంజింగ్
### సిఎస్‌కె, ఆర్‌ఆర్ మధ్య ఫిక్సింగ్





**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) ను వెటరన్ వికెట్ కీపర్ సంజూ శాంసన్ నడిపించబోతున్నాడు. ఈ మేరకు రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్)తో చెన్నై సూపర్ కింగ్స్ ట్రేడ్ డీల్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో జరగనున్న ఐపీఎల్ మినీ వేలానికి ముందే ఈ రెంటి ఫ్రాంచైజీల మధ్య ట్రేడింగ్ డీల్ జరుగుతోంది. తద్వారా రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజూ శాంసన్‌ను సీఎస్‌కే తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు గానసంజూ శాంసన్‌ను ఇవ్వాలంటే ఇద్దరు ఆటగాళ్లను ఇవ్వాలని రాజస్థాన్ రాయల్స్ చేసిన ప్రతిపాదనకు సీఎస్‌కే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సంజూ శాంసన్ కోసం స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాతో, పాటు సామ్ కరణ్‌ను వదులుకునేందుకు సీఎస్‌కే సిద్దంకావడం విశేషం. ఈ ఇద్దరిని తీసుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ అంగీకరిస్తే, ఆటగాళ్ల మార్పిడి ప్రక్రియ పూర్తవుతుంది. ఇక సంజూ శాంసన్ తన ఐపీఎల్ కెరీర్‌లో ఎక్కువ కాలం రాజస్థాన్ రాయల్స్‌కే ఆడాడు. ఐపీఎల్ 2021 సీజన్ నుంచి కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. మరోవైపు జడేజా తన కెరీర్‌ను రాజస్థాన్ రాయల్స్‌తో ప్రారంభించాడు. ఆ తర్వాత చెన్నైకే ఎక్కువ ప్రాతినిధ్యం వహించాడు. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరణ్ సీఎస్‌కేతో పాటు పంజాబ్ కింగ్స్‌కు ఆడాడు. సంజూ శాంసన్, రవీంద్ర జడేజా ఐపీఎల్ వేతనం రూ.18 కోట్లు. కాబట్టి ఇది స్వాప్ డీల్. కానీ సామ్ కరణ్ ధర రూ. 2.40 కోట్లు. ఈ డబ్బును రాజస్థాన్ రాయల్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ట్రేడింగ్ డీల్ విషయమై త్వరలోనే అధికార ప్రకటన రానుం దని ఇరుజట్ల వర్గాలు పేర్కొన్నాయి.



సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకొని సారథ్య బాధ్యతలు అప్పగించాలనే యోచనలో సీఎస్‌కే ఉంది. కాగా మహేంద్ర సింగ్ ధోనీ కెరీర్ చివరి దశలో ఉండటం, కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్ ఆశించిన ఫలితాలు అందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



## మహిళల ఆసియా కప్‌కు భారత్ అర్హత
### గ్రూప్ ఆఫ్ డెత్‌లో జపాన్, ఆస్ట్రేలియాతో ఢీ

**న్యూఢిల్లీ:** మహిళల ఆసియా కప్ 2026కు భారత్ అర్హత సంపాదించింది. జపాన్, ఆస్ట్రేలియా మరియు చైనీస్ తైపీతో భారత్ డ్రా చేసుకుంది. దీంతో గ్రూప్ ఆఫ్ డెత్‌లో స్థానం దక్కింది. ఇది టోర్నమెంట్‌లో అత్యంత కఠినమైన గ్రూప్ గా పరిగణించబడుతుంది. సోమవారం బ్యాంకాక్‌లో జరిగిన అధికారిక డ్రా తర్వాత మహిళల ఆసియా కప్ కోసం జపాన్, ఆస్ట్రేలియా, చైనీస్ తైపీలతో పాటు, భారతదేశం సవాలుతో కూడిన గ్రూప్ సి లోకి ప్రవేశించింది. సీడెడ్ ఆతిథ్య థాయిలాండ్ ఎ 1 స్థానాన్ని ఆక్రమించగా, పాట్ 4 నుండి డ్రా అయిన భారత్, చారిత్రాత్మక నాకౌట్‌దశ బెర్తును సాధించడంలో ఆసియాలోని అత్యుత్తమ జట్లతో ఢీ కొట్టనుంది. 2026 ఏప్రిల్ 1 నుండి 18 వరకు జరగనున్న 12 జట్ల ఖండాంతర పోటీల్లో భారత్ 2006 తర్వాత తొలిసారి పాల్గొంటుంది. ఆరుసార్లు ఛాంపియన్లుగా నిలిచి, యూత్ ఫుట్‌బాల్‌లో ఖండంలోని అత్యంత ఆధిపత్య శక్తులలో ఒకటైన టాప్‌సీడ్ జపాన్ ఈ గ్రూప్‌కు నాయకత్వం వహిస్తుంది. వీరితో పాటు శారీరక దృఢత్వం, వ్యూహాత్మక క్రమశిక్షణకు పేరుగాంచిన ఆస్ట్రేలియా, సాంకేతికంగా బలమైన, వేగవంతమైన జట్టును కలిగి ఉన్న చైనీస్ తైపీ కూడా ఉన్నాయి. పాట్ 4 నుండి తీసుకోబడిన భారత్ గ్రూప్ దశ దాటి ముందుకు సాగడానికి బలీయమైన జట్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మొత్తం 12 జట్లను 4 గ్రూపులుగా విభజించగా, ఎ లో ఆతిథ్య థాయిలాండ్, చైనా, వియత్నాం, బంగ్లాదేశ్ ఉండగా, బి లో కొరియా, కొరియా రిపబ్లిక్, ఉజ్బెకిస్తాన్, జోర్డాన్ ఉన్నాయి. ప్రతి గ్రూప్ నుండి మొదటి రెండు జట్లు, మూడవ స్థానంలో నిలిచిన రెండు ఉత్తమ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

## మూడు రోజుల నష్టాలకు బ్రేక్!
### లాభాల్లో ముగిసిన స్టాక్ సూచీలు

**ముంబయి, నవంబరు 10:** మూడు రోజుల నష్టాలకు బ్రేకులు వేస్తూ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఐటీ, ఆటో, ఎంపిక చేసిన బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ సమస్య త్వరలో పరిష్కారం కావచ్చన్న సానుకూల అంచనాలు సూచీలకు కలిసొచ్చాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్‌ఇ సెన్సెక్స్ 319 పాయింట్లు లాభపడి 83,535.35 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 82 పాయింట్లు వృద్ధితో 25,574.35 వద్ద ముగిసింది.

ఉదయం మందగమనంతో ప్రారంభమైన సెన్సెక్స్, ట్రేడింగ్ మధ్యలో టెక్, ఆటో షేర్లలో భారీ కొనుగోళ్ల కారణంగా దాదాపు 500 పాయింట్లు ఎగబాకి, ఇంట్రాడేలో 83,754.49 గరిష్ఠాన్ని తాకింది. అమెరికా షట్‌డౌన్ పరిష్కారంపై సానుకూల సంకేతాలు, మెరుగైన రెండో త్రైమాసిక ఫలితాల అంచనాలతో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోళ్లు చేపట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. దేశీయంగా స్థూల ఆర్థిక సూచికలు బలంగా ఉండటం కూడా కలిసొచ్చిందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అంచనావేసారు.సెన్సెక్స్ సూచీలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, టాటా మోటార్స్, టిసిఎస్, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్, ఎల్‌అండ్‌టీ భారీగా లాభపడ్డాయి. మరోవైపు, పవర్‌గ్రిడ్, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ నష్టపోయిన వాటిలో ఉన్నాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ సూచీ 1.62శాతం, నిఫ్టీ ఆటో 0.30శాతం చొప్పున పెరిగాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు కూడా



లాభాల్లోనే ముగిశాయి. అయితే, ఎఫ్‌ఎంసీజీ రంగం నష్టాల్లో ముగిసింది. బ్రాడర్ మార్కెట్లలోనూ కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.47శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.35శాతం లాభపడ్డాయి. ఇక రూపాయి మారకం విలువ విషయానికొస్తే, డాలర్ ఇండెక్స్ బలహీనపడినప్పటికీ, ఎఫ్‌ఐఐల అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో రూపాయి ఫ్లాట్‌గా 88.66 వద్ద ట్రేడ్ అయింది. ఈ వారం విడుదల కానున్న భారత్, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు రూపాయి కదలికలపై ప్రభావం చూపుతాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన జతిన్ త్రివేది అంచనా వేశారు. సమీప భవిష్యత్తులో రూపాయి 88.45 88.90 మధ్య కదలాడవచ్చని ఆయన పేర్కొన్నారు.

వాణిజ్యం

## ఐదు కంపెనీల ఐపిఒలు
## రూ.10వేల కోట్లు టార్గెట్!

**న్యూఢిల్లీ, నవంబరు 10:** స్టాక్ మార్కెట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి పెరుగుతోంది. ఈ వారం మొత్తం 5 ఐపిఒలు ఉండగా వాటిలో మూడు మెయిన్ బోర్డు కేటగిరీ నుంచి రెండు ఎస్‌ఎంఈ సెగ్మెంట్ ఉన్నాయి. ఆయా కంపెనీల సబ్‌స్క్రిప్షన్లు నవంబరు 11 నుంచి 14వ తేదీ మధ్య జరగనున్నాయి. ఈ ఐదు కంపెనీలు మొత్తం కలిపి రూ.10,000 కోట్లక ు పైగా సమీకరించే లక్ష్యంతో ఉన్నాయి. ఎడ్యుకేషన్, హరిత ఇంధనం నుంచి ఆటోమోటివ్ టెక్నాలజీ, ఫార్మా రంగాల వరకు ఈ కంపెనీలు విస్తరించి ఉన్నాయి. మరి ఆయా కంపెనీల పబ్లిక్ ఇష్యూల గురించి తెలుసుకుందాం. మెయిన్ బోర్డు నుంచి వస్తున్న ఎడ్‌టెక్ కంపెనీ ఫిజిక్స్ వాలా పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ 11న మొదలై 13వ తేదీ వరకు కొనసాగుతుంది. షేర్ల ప్రైస్ బ్యాండ్ రూ.103-109గా నిర్ణయించారు. ఐపిఒద్వారా రూ.3480 కోట్లు సమీకరించనుంది. బీఎస్‌ఇ, ఎన్‌ఎస్‌ఇ రెండింటిలోనూ లిస్టింగ్ కానుంది. టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.3,600 కోట్లు సమీకరించే లక్ష్యంతో ఉంది. మొత్తంగా ఆఫర్ ఫర్ సేల్ ద్వారానే షేర్లు విక్రయిస్తోంది. ఈ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ 12న మొదలై 14వ తేదీ వరకు కొనసాగనుంది. ఒక్కో షేరుకు రూ.378-397గా నిర్ణయించారు. ఎమ్వీ ఫోటోవోల్టాయిక్ పవర్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.2900 కోట్లు సమీక రించనుంది. ఈ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 11న మొదలయి 13వ తేదీ వరకు కొనసాగుతుంది. ఒక్కో షేరుకు రూ.206-217గా నిర్ణయించారు. ఎస్‌ఎంఇ విభాగం నుంచి వస్తున్న ప్రముఖ కంపెనీల్లో మహామాయ లైఫ్ సైన్సెస్ ఐపిఒ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 11న ఓపెన్ అయి 13వ తేదీ వరకు అందుబాటులో ఉంది. ఈ పబ్లిక్ ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ.108-114గా నిర్ణయించారు. ఈ ఐపిఒ ద్వారా రూ.70.44 కోట్లు సమీకరించనుంది.




టెక్ సొల్యూషన్స్ సేవల సంస్థ వర్క్ మేట్స్ కోర్ 2 క్లౌడ్ సొల్యూషన్ సంస్థ ఈ వారం ఎస్‌ఎంఈ నుంచి వస్తున్న మరో ఐపీఓ. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.69.84 కోట్లు సమీకరించనుంది. ఇక సబ్‌స్క్రిప్షన్ ఈనెల 11వ తేదీనుంచి మొదలయి 13వ తేదీ వరకు కొనసాగుతుంది. ఒక్కో షేరు ధర రూ.200-204గా నిర్ణయించింది.

## బ్రిటానియాకు కొత్త ఎండి సిఇఒ



**ముంబయి, నవంబరు 10:** బ్రిటానియా కంపెనీ ఎండి సిఇఒ వరుణ్ బెర్రీ తన పదవికి రాజీనామాచేసారు. ఇటీవలే నియమితులయిన చీఫ్ రక్షిత్ హర్గావే ఆయన స్థానంలో కొత్త ఎండి సిఇఒగా బాధ్యతలు స్వీకరిస్తారని కంపెనీ ప్రకటించింది. కంపెనీకి ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఎండిగా బ్రిటానియాలో బెర్రీ పనిచేసారు. గత మేనెలలోనే రాజ్‌నీత్‌మోహ్లి రాజీనామాతో ఆయన సిఇఒగా పదోన్నతి పొందరు.

గడచిన 13 ఏళ్లుగా బ్రిటానియాలో పనిచేసారు. వినియోగరంగ ఉత్పత్తుల విభాగంలోపనిచేసిన ఆయన ఉపాధ్యక్షుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా 2013లో పనిచేసారు. అంతకుముందు బెర్రి పెప్సికో ఇండియా యూనిట్‌లోను, హిందూస్థాన్ యూనిలీవర్‌లోను పని చేసారు. గతవారంలోనే బ్రిటానియా బిర్లా ఒపస్‌కు హర్గావే తన కొత్త సిఇఒ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉంటారని ప్రకటించింది. వచ్చే డిసెంబరు 15 నుంచి హర్గావే తన సిఇఒ ఎండి కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. ఐదేళ్లపాటు ఎండిసిఇఒగా కొనసాగుతారు. ఈలోపు నటరాజన్ వెంకట రామన్ అనే సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను తాత్కాలిక సిఇఒగా నియమించింది.

## భారత్-బహ్రెయిన్‌ల మధ్య యుపిఐ సేవలు




**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారత్, బహ్రెయిన్ మధ్య రియల్ టైమ్ క్రాస్ బోర్డర్ లావాదేవీలను సులభతరం చేయ డానికి ఆ దేశానికి చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ వెనెఫిట్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లుగా నేషనల్ పేమెంట్ లిమిటెడ్ (ఎన్పీసిఐ) సోమవారం ప్రకటించింది. దీనితో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) సేవలు బహ్రెయిన్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్ ఫారిప్లస్ సేవతో అనుసంధానించ నున్నట్లు తెలిపింది. ఇది రెండు దేశాల్లోని వినియోగదారులు తక్షణం డబ్బు పంపించడంతో పాటు స్వీకరించడం వీలవుతుంది. ఫారిప్లస్ అనేది బహ్రెయిన్‌లో దాదాపు రియల్ టైమ్ బ్యాంక్ టు బ్యాంక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ సేవలు అందిస్తుంది. ఇది దేశంలోని ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్‌లో భాగం. ఈ భాగస్వామ్యం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బహ్రెయిన్ మార్గదర్శకత్వంలో జరిగింది. రెండు దేశాల మధ్య క్రాస్‌బోర్డర్ చెల్లింపు కనెక్టివిటీని బలోపేతం చేయడంలో ఈ సహకారం ఓ కీలకమైన అడుగుగా పరిగణిస్తున్నారు. రెండు దేశాల నివాసితులకు వేగవంతమైన, సమర్థవంతమైన, సరసమైన చెల్లింపులను సులభతరం చేస్తుందని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. డిజిటల్ ఆర్థిక సేవలు ప్రోత్సహించేందుకు, అంతర్జాతీయ లావాదేవీ వ్యవస్థలను ఆధునీకరించడానికి ఈ చర్య ఒక ఉమ్మడి దృష్టిని ప్రతిబింబిస్తుంది. యూపిఐ, ఫారిప్లస్ సర్వీస్ ఏకీకరణ భారతదేశం, బహ్రెయిన్ మధ్య వ్యూహాత్మక చెల్లింపుల కారిడార్‌ను ఏర్పాటు చేస్తుందని ఇది దేశ మొత్తం జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న బహ్రెయిన్‌లో నివసిస్తున్న భారతీయులకు డబ్బు పంపడం, ఆపై జమలను సులువుగాను సురక్షితంగాను చేస్తుందని పేర్కొన్నాయి.




## స్వదేశీ, విదేశీ రూట్లలో మరిన్ని ఆకాశ ఎయిర్ సర్వీసులు!

**ముంబయి, నవంబరు 10:** ఆకాశ ఎయిర్ త్వరలో మరికొన్ని దేశీయ, అంతర్జాతీయ రూట్‌లో విమానసర్వీసులు ప్రారంభిస్తోంది. బోయింగ్ నుంచి విమానాలను త్వరగా తీసుకురావాలనుకుంటున్నట్లు ఎయిర్‌లైన్ అధికారి సోమవారం తెలిపారు. ఆకాసా ఎయిర్‌లైన్స్ 2022 ఆగస్టులో తొలిసారిగా కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుతం ఆ కంపెనీకి 30 విమానాలు ఉన్నాయి. 24 దేశీయ, మరో ఆరు అంతర్జాతీయ గమ్యస్థానాలకు విమానాలను నడుపుతుంది.

త్వరలోనే ఢిల్లీ నుంచి మరికొన్ని అంతర్జాతీయ విమానాలను ప్రారంభించనున్నట్లు ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ పేర్కొన్నారు. ఎయిర్‌లైన్ ప్రస్తుతం ఢిల్లీ నుంచి ప్రతిరోజూ 24 విమానాలను నడుపుతోంది. సింగపూర్, ఉజ్బెకిస్తాన్, ఇండోనేషియా, వియత్నాం, తాష్కెంట్‌తో సహా వివిధ విదేశీ గమ్యస్థానాలకు విమానాలను నడపాలని ఎయిర్‌లైన్ యోచిస్తుందని అయ్యర్ ఓ బ్రీఫింగ్‌లో చెప్పారు. ఆకాశ ఎయిర్ ప్రస్తుతం ఆరు అంతర్జాతీయ నగరాలకు విమానాలను నడుపుతోంది. ఇందులో దోహా (ఖతార్), జెడ్డా, రియాద్ (సౌదీ అరేబియా), అబుదాబి (యూఎఇ), కువైట్ సిటీ, ఫుకెట్ (థాయిలాండ్) ఉన్నాయి. ఎయిర్‌లైన్ మొత్తం 226 బోయింగ్ 737 మాక్స్ విమానాలను ఆర్డర్ చేసింది. అయితే, డెలివరీలో జాప్యం జరుగుతున్నది.

## సిగ్నల్ లేని చోట్ల జియో, బిఎస్‌ఎన్‌ఎల్ టైఅప్
### ఐసిఆర్‌పరిధిలో రెండు ప్రత్యేక జియో ప్లాన్లు




**ముంబయి, నవంబరు 10:** ఇంట్రా సర్కిల్ రోమింగ్ రీఛార్జి ప్లాన్ల కోసం రిలయన్స్ జియో ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బిఎస్‌ఎన్‌ఎల్‌తో ఒప్పందంచేసుకుంది. జియో సిగ్నల్స్ లేని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్ ఉపయోగించుకోవచ్చు. జియో యూజర్లకు బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్ అందించడమే ఇంట్రా సర్కిల్ రోమింగ్ లక్ష్యమని ,చెపుతూ బిఎస్‌ఎన్‌ఎల్‌తో టైఅప్ చేసుకున్నట్లు ప్రకటించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ యూజర్లకు మాత్రమే ఈ సరికొత్త ప్లాన్లను జియో అందుబాటులోకి తీసుకొచ్చింది.

రెండు ఇంట్రా సర్కిల్ రోమింగ్ రీఛార్జ్ ప్లాన్లను తెచ్చినట్లు తెలిపింది. 28 రోజుల వ్యాలిడిటీతో ఈ రెండు రీఛార్జ్ ప్లాన్స్ అందిస్తున్నట్లు తెలిపింది. అవి రూ. 396, రూ. 196 ప్లాన్ల ధరలు నిర్ణయించినట్లు జియో తెలిపింది. ఇక రూ. 396 రీఛార్జ్ ప్లాన్‌తో 10 జీబీ డేటాతో పాటుగా 1000 నిమిషాల టాక్ టైమ్, 1000 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. ఇక రూ. 196 ఐసీఆర్ రీఛార్జ్ ప్లాన్‌తో 2 జీబీ డేటాతో పాటుగా వెయ్యి నిమిషాల మేర టాక్ టైమ్, 1000ఎస్ఎంఎస్‌లు ఇస్తోంది. అయితే, ఈ ప్లాన్స్‌ద్వారా కేవలం బిఎస్ ఎన్‌ఎల్ నెట్వర్క్‌మాత్రమే ఉపయోగించకోవచ్చు. అంటే జియో సిగ్నల్ లేని సందర్భంలో బిఎస్‌ఎన్‌ఎల్ నెట్వర్క్ సిగ్నల్ ఎంచుకున్నప్పుడు మాత్రమే ఈ ప్లాన్స్ పని చేస్తాయి. ఈఏడాది జనవరిలోనే టెలికాం నియంత్రణ సంస్థ డాట్ ప్రకటించింది. ఈ ప్లాన్ ద్వారా జియో, ఎయిర్‌టెల్, బిఎస్‌ఎన్‌ఎల్ యూజర్లు తమ సొంత సెల్యూలార్ టవర్ల రేంజ్‌లో లేని సందర్భంలో ఇతర టెలికాం నెట్‌వర్క్ ఉపయోగించుకుని సేవలు పొందవచ్చు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps